అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

గురువారం 8-2-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 38 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



శాస్త్రీయంగా నదీ జలాల పరిష్కారం

కేఆర్‌ఎంబీకి ప్రాజెక్టులు అప్పగించకూడదు

- రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రాల మధ్య కొట్లాటలు పెడుతున్న కేంద్రం
- ఆర్నెల్లలో ప్రభుత్వం కూలుతుందనే శాపనార్థాలు తగవు
- తెలుగు రాష్ట్రాల ప్రజలు విడిపోకూడదు
- జర్నలస్టులకు ఇండ్ల స్థలాలివ్వాలి
- ఎంత సీరియస్ కండీషన్‌కు వెళ్లానో అంత త్వరగా రికవరీ అయ్యాను : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని
- ఆరోగ్యం మెరుగయ్యాక తొలిసారి ఖమ్మానికి.. కార్యకర్తల ఘన స్వాగతం

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

నదీ జలాల సమస్యపై శాస్త్రీయ పరిష్కారం అవసరమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల సమస్య ద్వారా కేంద్రం లబ్ది పొందాలని చూస్తోందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలరీత్యా కృష్ణా రిజర్వాయర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్‌ఎంబీ)కి ప్రాజెక్టులను అప్పగించకూడదని చెప్పారు. ఆర్నెళ్లలో ప్రభుత్వం కూలుతుందని బీఆర్‌ఎస్ చేస్తున్న వ్యాఖ్యలను తమ్మినేని ఖండించారు. అస్వస్థత నుంచి బయటపడిన తర్వాత తొలిసారి బుధవారం ఖమ్మం వచ్చిన వీరభద్రానికి సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయం సుందరయ్య భవనం వద్ద కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం విలేకరుల సమావేశంలో తమ్మినేని మాట్లాడారు.

తెలుగు రాష్ట్రాలు విడిపోయినా ప్రజలు విడిపోకూడదన్నది సీపీఐ(ఎం) సిద్ధాంతం అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయినప్పుడు కేంద్రం అనేక హామీలు ఇచ్చినా ఏ ఒక్కటీ నెరవేర్చకపోగా కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని తరలించే ప్రయత్నం చేస్తోందన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాల మధ్య తగవులు పెడుతోందని అన్నారు. దేశం మొత్తానికి ఒకే ఎన్నిక ఉండాలని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన కేంద్రం కమిటీ ఏర్పాటు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడంలో భాగమే తప్ప మరొకటి కాదన్నారు.

ప్రతిపక్షాలను అణచివేసే ధోరణి

కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాలను అణచివేసే ధోరణి అవలంబిస్తోందని తమ్మినేని అన్నారు. కేరళలో కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా గురువారం జరిగే ఆందోళనకు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ మద్దతు ఇచ్చిందన్నారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, మతతత్వ, అప్రజాస్వామిక విధానాలను నిరసిస్తూ ఈనెల 16వ తేదీన నిర్వహించే ...13లో



నేటి నుంచి సభా పర్వం

17 వరకూ కొనసాగింపు?

- లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు
- ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం
- 10న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం
- నీటి పారుదల శాఖపై శ్వేతపత్రం
- కులగణన,మరో రెండు గ్యారంటీలపై అసెంబ్లీలో చర్చ

ఒకవైపు సీఎం రేవంత్‌రెడ్డి..మరోవైపు మాజీ సీఎం కేసీఆర్...మాటల దాడిలో ఇద్దరూ సిద్ధహస్తులే. పదేండ్లపాటు రాష్ట్రాన్ని ఏలిన అనుభవం ఒకరిదైతే.. అదే పదేండ్లపాటు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్‌ను పవర్‌లోకి తెచ్చిన ఘనత మరొకరిది.. వెరసి గురువారం నుంచి ఆరంభమయ్యే అసెంబ్లీ సమావేశాలు మరింత హీటెక్కనున్నాయి. లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా అధికార, ప్రతిపక్షాలు ప్రజల్ని ఆకర్షించేందుకు మాటల తూటాలే ఆయుధాలుగా మలచుకోనున్నాయి. అందుకు అసెంబ్లీని వేదికగా చేసుకోనున్నాయి.

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 11 గంటలకు శాసనసభ, శాసనమండలి సంయుక్తంగా సమావేశం కానున్నాయి. ఉభయ సభలనుద్దేశించి రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందరరాజన్ ప్రసంగించనున్నారు. ఆమె ప్రసంగం అనంతరం సభ శుక్రవారానికి వాయిదా పడనుంది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శుక్రవారం శాసనసభ, మండలిలో చర్చ జరగనుంది. శనివారం ...6లో




పద్దు రూ.2.70 లక్షల కోట్లు...?

రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.2.70 లక్షల కోట్లతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్టు సమాచారం. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే రెండు అమలవుతున్న సంగతి తెలిసిందే. మిగతా వాటిలో 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడే వారికి ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ స్కీములను కూడా అమలు చేస్తామని సీఎం ప్రకటించారు. వీటితోపాటు రైతు భరోసా, ఉద్యోగాల భర్తీ తదితరాంశాలకు పెద్ద మొత్తంలో నిధులు అవసరమవుతాయి. ఈ కోణంలో ఆలోచించి రూ.2.70 లక్షల కోట్లతో పద్దును ప్రవేశపెట్టనున్నారని సమాచారం. పొరుగు రాష్ట్రం ఏపీలో రూ.2.86 లక్షల కోట్లతో బుధవారం పద్దును ప్రవేశపెట్టిన సంగతి విదితమే.

కేజ్రీవాల్‌కు కోర్టు సమన్లు

- 17న హాజరుకావాలని ఆదేశం



వివరాలు 13లో

రాజస్థాన్‌లోనూ యూసీసీ

- మంత్రి కన్హయ్య లాల్ చౌదరి కీలక వ్యాఖ్యలు



వివరాలు 13లో

ఇతరులకూ అవకాశమివ్వండి


- రిజర్వేషన్ లబ్దిదారులకు సుప్రీం సూచన



వివరాలు 13లో

బీజేపీకి బాబుమోహన్ రాజీనామా


- పొమ్మనకుండా పొగ పెడుతున్నారని వ్యాఖ్య



వివరాలు 13లో

నేడు హైదరాబాద్‌లో కేరళ సంఘీభావ ధర్నా

- హాజరు కానున్న బీవీ రాఘవులు



వివరాలు 13లో

15రోజుల్లో 15 వేల పోలీసు ఉద్యోగాలు భర్తీ

సింగరేణిలో అన్ని సమస్యలు పరిష్కరిస్తాం

- త్వరలో గ్రూప్ -1 నోటిఫికేషన్
- అదనంగా 60 ఖాళీలు : సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వచ్చే 15 రోజుల్లో 15 వేల పోలీసు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తామని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అలాగే 60 కొత్త ఖాళీలతో గ్రూప్ -1 నోటిఫికేషన్ కూడా జారీ చేస్తామన్నారు. రాష్ట్రంలోని 30 లక్షల నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన సింగరేణి సంస్థను అన్ని ...6లో



కాళేశ్వరం ఎఫెక్ట్..

ఇరిగేషన్ ఈఎన్సీకి ఉద్వాసన

- మురళీధర్‌రావు రాజీనామాకు సర్కారు ఆదేశం
- ఇన్‌చార్జి ఈఎన్సీ వెంకటేశ్వర్లు తొలగింపు
- విజిలెన్స్ నివేదికతో చర్యలకు ఉపక్రమించిన ప్రభుత్వం
- అసెంబ్లీలో శ్వేతపత్రంపైనా వాడివేడి చర్చకు అవకాశం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

నీటిపారుదల శాఖలో రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో చోటుచేసుకున్న అవకతవకలకు సంబంధించి విజిలెన్స్ నివేధిక ఆధారంగా సర్కారు చర్యలకు ఉపక్రమించింది. తొలుత ఇద్దరు సీనియర్ ఇంజినీర్లపై వేటు వేసింది. నీటిపారుదల శాఖ ఈఎన్సీ సి.మురళీధర్ రావును రాజీనామా చేయాలని ఆదేశించింది. అలాగే రామగుండం ఈఎన్సీ, కాళేశ్వరం



మురళీధర్‌రావు

ఇన్‌ఛార్జీ ఈఎన్సీగా ఉన్న ఎన్. వెంకటేశ్వర్లును సర్వీసు నుంచి తొలగిస్తూ జీవో నెంబరు 13ను జారీచేసింది. మరికొందరు ఇంజినీర్ల పైనా త్వరలో చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ చర్యలతో ...6లో

కేంద్ర వైఖరిపై కర్నాటక నిరసన

రాజధానిలో ఆందోళన



న్యూఢిల్లీ : కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు వాటా చెల్లించే విషయంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష ప్రదర్శిస్తోందని ఆయా రాష్ట్రాలకు చెందిన ప్రభుత్వాలు మండిపడ్డాయి. ఇప్పటికే కేరళ, తమిళనాడు, తెలంగాణ ప్రభుత్వాలు కేంద్ర వైఖరిపై గళం విప్పగా తాజాగా కర్నాటక కూడా గొంతు కలిపింది. కర్నాటకకు 15వ ఆర్థిక సంఘం చేస్తున్న అన్యాయంపై ఆ రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు బుధవారం రాజధాని న్యూఢిల్లీలో ఆందోళన నిర్వహించారు. 15వ ఆర్థిక సంఘం వైఖరి కారణంగా రాష్ట్రానికి గత ఐదు సంవత్సరాల్లో రూ.1,87,000 కోట్ల నష్టం వాటిల్లిందని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇటీవల విలేకరుల సమావేశంలో విమర్శించారు. రాష్ట్రంలో నీటి పారుదల, అభివృద్ధి ప్రాజెక్టుల అమలులో కేంద్రం జాప్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రానికి రావాల్సిన వాటా 4.71% నుండి 3.64%కి తగ్గిందని గుర్తు చేశారు. దీనివల్ల పన్నుల్లో రూ.62,098 కోట్లు నష్టపోయామని సిద్ధరామయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

సాధారణ ఎన్నికలకు సిద్ధంకండి

- రాష్ట్ర ఎన్నికల అధికారులకు సీఈసీ ఆదేశాలు
- ఏర్పాట్లపై సమీక్ష

వివరాలు 13లో..

హైదరాబాద్ ఇమేజ్ పెరగాలి



క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉండాలి

- అన్ని శాఖల సమన్వయంతో అభివృద్ధి
- తాగునీటి సమస్య లేదు
- జీహెచ్ఎంసీ ఉద్యోగులకు 5లోగా జీతాలు
- డబుల్ బెడ్ రూమ్‌లపై త్వరలోనే ప్రభుత్వ పాలసీ : మంత్రి పొన్నం ప్రభాకర్

వివరాలు 3లో

బీఆర్‌ఎస్‌ది ఎప్పుడూ ప్రజాపక్షమే

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

నవతెలంగాణ విలేకరి- జనగామ

అధికారంలో ఉన్నా..ప్రతిపక్షంలో ఉన్నా.. బీఆర్‌ఎస్‌ది ఎప్పుడూ ప్రజాపక్షమేనని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. జనగామ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ కార్యకర్తలతో బుధవారం జరిగిన సమావేశంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్‌కు జనగామ అంటే అమితమైన ప్రేమ అని తెలిపారు. ఎప్పుడూ ఈ ప్రాంతం ...13లో



ఈసారీ..బీజేపీఎల్పీ నేత లేనట్టే!

ఎంపికపై పార్టీలో ఆధిపత్యపోరు

- జాతీయ నాయకత్వం కోర్టులో బంతి
- సమావేశాలపై దిశానిర్దేశం చేయని వైనం

ఈ'సారీ'..అసెంబ్లీ సమావేశాలకూ ఎల్పీనేత ఎవరనేది బీజేపీ తేల్చలేదు. ఎంపిక విషయంలో నేతల మధ్య ఆధిపత్యపోరు కొనసాగుతూనే ఉన్నది. ఎల్పీనేత ఎంపిక వాయిదా పడుతూనే పోతున్నది. రాజాసింగ్‌నా? మహేశ్వర్‌రెడ్డినా? వెంకటరమణారెడ్డినా? అనేది ఎటూ తేల్చుకోలేక అధిష్టానం సతమతమవుతున్నది. రాష్ట్ర నాయకత్వం చేతులెత్తేసి బంతిని జాతీయ నాయకత్వం కోర్టులోకి నెడితే అక్కడా పెండింగ్‌లోనే ఉంది. అంతిమంగా ఎల్పీనేత ఎంపిక కరవమంటే కప్పకు కోపం..విడవమంటే పాముకు కోపం అన్న చందంగా తయారైంది.

ఏం మాట్లాడాలనే దానిపై స్పష్టత కరువు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ సమావేశాల్లో కమలం పార్టీ తరుపున ఎవరు ప్రాతినిధ్యం వహించాలనే దానిపై స్పష్టత లేదు. వాస్తవానికి 2022 ఆగస్టులో రాజాసింగ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన తర్వాత ఆ పార్టీకి అసెంబ్లీలో ఎల్పీ నేత లేకుండా పోయారు. ఆ సమయంలో అన్ని అంశాలపైన పట్టున్న రఘునందన్‌రావు, ఈటల రాజేందర్ ఉన్నప్పటికీ దాటవేత ధోరణిని అవలంబించింది. గత అసెంబ్లీలో ఏడాదిన్నర పాటు ఆ పార్టీకి శాసనసభా పక్ష నేత లేని విషయం విదితమే. ప్రస్తుతం కూడా అదే వైఖరితో ముందుకెళ్తున్నది.

అసెంబ్లీ సమావేశాల ముందు ఏ పార్టీ అయినా ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేస్తుంది. అసెంబ్లీలో ప్రధానంగా లేవనెత్తాల్సిన అంశాలపై ఫోకస్‌పెట్టి దానిపై గైడ్‌లైన్స్ ఇస్తుంది. కానీ, బీజేపీలో అదేమీ కనిపించడం లేదు. ఏ పార్టీకైనా తొలి సమావేశాల్లోనే ఎల్పీనేతను ప్రకటించడం ఆనవాయితీ. కానీ, తొలి సమావేశాల్లో ఎల్పీ నేత ఎంపికపై హడావిడి చేసి దాటవేసింది. ఆ తర్వాత తరుణ్‌చుగ్, కిషన్‌రెడ్డి ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా భేటీ అయినప్పటికీ ఎటూ తేల్చలేకపోయారు. ఆ తర్వాత హైదరాబాద్ పర్యటనలో కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్‌షా బీజేపీఎల్పీ నేతను తేల్చుతారని రాష్ట్ర ...3లో

విలీనం అయ్యేనా..?

జీహెచ్ఎంసీలోకి శివారు కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు..!



- గతంలో ప్రకటించిన బీఆర్ఎస్ సర్కార్
- కాంగ్రెస్ సర్కార్ నిర్ణయంపై ఆసక్తి
- రాజకీయ, అధికార వర్గాల్లో చర్చ

నవతెలంగాణ-సిటీబ్యూరో

శివారులోని కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు జీహెచ్ఎంసీలో విలీనం అంశం చర్చనీయాంశమవుతోంది. మెరుగైన పాలన కోసం మున్సిపాల్టీలు, కార్పొరేషన్లను బల్దియాలో కలుపుతామంటూ గతంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించినా కాలేదు. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో అధికారం మారడంతో ఈ విలీన ప్రక్రియ మరోసారి తెరపైకి వచ్చింది. 2019లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మెరుగైన పాలన కోసమంటూ గ్రామపంచాయతీలను కలిపి కొత్తగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని సిటీ శివారుల్లో 4 కార్పొరేషన్లు, 13 మున్సిపాల్టీలను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత ఎన్నికలు నిర్వహించి మెజార్టీ స్థానాలను అప్పటి బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. వచ్చే ఎన్నికల నాటికి ఈ మున్సిపాల్టీలు, కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తామని అప్పట్లో ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలు కావడం, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. కొత్త సర్కార్ గత ప్రభుత్వ నిర్ణయాన్ని పరిగణలోకి తీసుకుంటుందా..? పక్కన పెడుతుందా..? అని రాజకీయ, అధికార వర్గాల్లో చర్చ నడుస్తోంది.

మరో ఏడాదిలో ఎన్నికలు..

కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు మరో ఏడాదిలో ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ కొద్ది సమయంలో జీహెచ్ఎంసీలో వీలీనం సాధ్యమవుతుందా..? లేదా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ విలీనం చేయాల్సి వస్తే.. గ్రేటర్ హైదరాబాద్‌లోని ఆరు జోన్లలో వీటిని కలపాల్సి ఉంటుంది. ఇప్పటికే గ్రేటర్ జనాభా కోటి దాటింది. ఈ శివారు కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను సైతం విలీనం చేస్తే జీహెచ్ఎంసీ జనాభా దాదాపు రెండు కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. ఇప్పటికే జీహెచ్ఎంసీ నిర్వహణ భారంగా ఉంది.

కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో మిగులు బడ్జెట్..


శివారు కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు ఆర్థికంగా బలంగా ఉన్నాయి. దాదాపు అన్ని మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు మిగులు బడ్జెట్‌తో ఉన్నాయి. జీహెచ్ఎంసీ ప్రస్తుతం అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతోంది. అయితే విలీనం చేస్తారా? అన్నదే ప్రశ్నగా ఉంది. రాజకీయంగా కూడా ఇబ్బందులు ఉండే అవకాశం ఉందనేది విశ్లేషకుల అభిప్రాయం. పదవుల పంపకాలలో తేడాలు రాక తప్పదంటున్నారు. అనవసరమైన తల నొప్పులు ప్రభుత్వం పెట్టుకోకపోవచ్చని అంటున్నారు.

సర్కార్ నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ

శివారులోని మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల విలీనంపై సర్కార్‌దే తుది నిర్ణయం. కాగా.. విలీనానికి ముందు స్థానిక ప్రజల నుంచి ప్రజాభిప్రాయం తీసుకోవాలని కొందరు అభిప్రాయపడుతుండగా.. జీహెచ్ఎంసీలో విలీనం చేయకపోవడమే మంచిదనే అభిప్రాయాలను సైతం కొందరు వ్యక్తం చేస్తున్నారు.

గ్రామ పంచాయతీలనే..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సిటీ శివారులో బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేటతో కలిపి నాలుగు కార్పొరేషన్లు ఉన్నాయి. దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్కేసర్, తూంకుంట, కొంపల్లి, దుండిగల్, మేడ్చల్, గుండ్ల పోచంపల్లితో కలిపి దాదాపు 13 మున్సిపాల్టీలు ఉన్నాయి. 2019కు ముందు ఇందులో చాలా కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు గ్రామ పంచాయతీలుగా ఉండేవి.



నర్సింగ్ విద్యార్థులపై వేధింపులు ఆపాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమపై యాజమాన్యం అనుసరిస్తున్న వేధింపులను వెంటనే ఆపాలని నైటింగేల్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్‌కు లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. కాలేజీలో చేరినప్పుడు ఉపకార వేతనం మినహాయించుకోగా అదనంగా రూ 20 వేలు కట్టాలని యాజమాన్యం చెప్పిందనీ, ప్రస్తుతం యజమాన్యం మాట మారుస్తూ ఏడాదికి రూ.60 వేలు కట్టాలని ఇబ్బందులకు గురి చేస్తున్నదని తెలిపారు. మొదటి సంవత్సరం నుంచే ఆస్పత్రుల్లో డ్యూటీ చేయిస్తూ జీతం యాజమాన్యం తీసుకుంటుందని లేఖలో ఆరోపించారు. ఫీజు కట్టలేదని పలువురు విద్యార్థులకు హాల్ టికెట్ ఇవ్వక పోవడంతో సెకండ్ ఇయర్ పరీక్షలు రాయలేక పోయామని వాపొయ్యారు. సమస్యలపై దృష్టి సారించి న్యాయం చేయాలని వారు రిజిస్ట్రార్‌కు విజ్ఞప్తి చేశారు.

భారతరత్నకే పీచే

లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీ పాచికలు • అందుకే అద్వానీ, కర్పూరీ ఠాకూర్‌లు ఎంపిక



90వ దశకంలో అద్వానీ 'కమండల్'.. కర్పూరీ 'మండల్' పోరాటం

- ఇప్పుడు అవార్డుతో 'రామ మందిరం', బీహార్ రాజకీయాలకు ముడి
- ఇప్పటికే ఎన్డీయే చెంతకు నితీశ్
- బీహార్‌లో ప్రభుత్వం ఏర్పాటు



దేశంలోనే అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న. వివిధ రంగాల్లో అపూర్వ సేవలు అందించనవారికి ఈ అత్యున్నత అవార్డు దక్కుతుంది. అయితే, కేంద్రంలో బీజేపీని సర్కారు దీనిని రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నది. లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా పావులు కదుపుతున్నది.







అణగారిన వర్గాలకు రిజర్వేషన్లను వ్యతిరేకించిన జన్‌సంఘ్

బీహార్ సీఎంగా కర్పూరీ ఠాకూర్ ఉన్న సమయంలో 1978లో ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీలు, అణగారిన వర్గాలకు 26 శాతం రిజర్వేషన్లు కల్పించటానికి సంకల్పించారు. ఆ సమ యంలో బీజేపీకి పూర్వ రూపమైన జన్ సంఘ్ ఈ నిర్ణయాన్ని వ్యతి రేకించిందనీ, ఆ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కూలిపోవటానికి కారణ మైందని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. అలాగే, కర్పూరీ మీద అసభ్యపద జాలాన్నీ జన సంఘ్ వాడింది. ఆయన తల్లిని కూడా దుర్భాషలాడిందని తెలిపారు.

న్యూఢిల్లీ : కేంద్రంలోని బీజేపీ పెద్దలు.. మూడోసారి అధికారం దక్కించు కోవటానికి ఎంతకైనా దిగజారుతున్నదనే విమర్శలకు భారత రత్న అవార్డుల ప్రకటనే ఊతమిస్తోంది. ఏండ్ల తరబడి పార్టీలో ఉన్న నేతల్ని పక్కనబెట్టేసి..ఇపుడు మెహర్బానీ చాటుకున్నదని స్పష్టమవుతోంది. ఇందులో భాగంగా బీహార్‌లో ఓబీసీలకు ఉద్యోగ రిజర్వేషన్లలో విశిష్ట కృషి చేసిన కర్పూరీ ఠాకూర్‌కు మరణానంతరం భారతరత్నను ప్రకటించింది. ఆ తర్వాత కొన్ని రోజులకే బీజేపీ వ్యవస్థాపకుల్లో ఒకరు, 'హిందూత్వ' కీలక నాయకులు అయినటువంటి ఎల్.కె అద్వానీని భారతరత్న పురస్కారంతో సత్కరించనున్నట్టు ప్రధాని మోడీ ప్రకటించారు. అయితే, కేంద్రం భారతరత్న అనే ఈ అత్యు న్నత పౌర పురస్కారాన్ని స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమే వాడుకుంటున్నదని రాజకీయ విశ్లేషకులు ఆరోపిస్తున్నారు. ఇందులో భాగంగానే తాజా అవార్డుల ప్రకటనలు వెలువడ్డా యని అంటున్నారు. ప్రస్తుతం భారతరత్న అవార్డును పొందిన వ్యక్తుల ఇద్దరి ఆలోచనలు, సిద్ధాంతాలు 1990 దశకంలో పరస్పర విరుద్ధమైనవని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

ఇద్దరి ఆలోచనలు వేరైనా...

ఉద్యోగాల్లో ఓబీసీ రిజర్వేషన్ల కోసం పోరాడిన కర్పూరీ ఠాకూర్, అయోధ్యలో రామ మందిర నిర్మాణమంటూ భావోద్వేగ రథయాత్ర చేసి హిందూత్వ రాజకీయాలు చేసిన అద్వానీ.. ఇద్దరి ఆలోచనలు, దారులు వేరని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. భారత్‌లో మండల్ కమిషన్ నివేదిక చారిత్రాత్మకమైనది. ఉద్యోగాల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ కల్పించాలని సిఫారసు చేసే ఈ నివేదికను 90వ దశకంలో వి.పి సింగ్ ప్రభుత్వం అమలు చేస్తున్న సమయంలో.. దానికి కౌంటర్‌గా అద్వానీ రథయాత్రను చేపట్టారు. మండల్ కమిషన్ సిఫారసులు హిందువుల్లో కులాల ఆధారంగా విభజనలు తీసుకొస్తాయని అద్వానీ భావించారు. ఓబీసీలకు రిజర్వేషన్ల అంశాన్ని ఆయన వ్యతిరేకించారు.

దీనికి హిందూత్వ ఎజెండాతోనే చెక్ పెట్టాలనుకున్నారు. దీంతో అద్వానీ రథయాత్ర 'కమండల్'గా, రిజర్వేషన్ల అంశం 'మండల్'గా ఆ సమయంలో ప్రసిద్ధి చెందిందని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు ఆ ఇద్దరి వ్యక్తులకు బీజేపీ భారతరత్న ప్రకటించటం.. రాబోయే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనేనని వారు అంటున్నారు.

బీహార్‌పైనే బీజేపీ కన్ను...

ఇప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న అదే బీజేపీ కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్నను ప్రకటించి మోడీ పొగడటమనేది చాలా ఆశ్చర్యకరమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కర్పూరీ ఠాకూర్ అంశమూ బీహార్‌లో ప్రభుత్వ మార్పునకు దోహదం చేసిందని చెప్తున్నారు. ఇప్పటికే నితీశ్ ఎన్డీయే చెంతకు చేరారనీ, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీహార్ నుంచి వీలైనన్ని ఎక్కువ స్థానాలు గెలుపొందటమే బీజేపీ లక్ష్యమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మరోవైపు రామ మందిర నిర్మాణం, అద్వానీకి భారతరత్న అవార్డుతో హిందూత్వ అనుకూల ఓట్లను పొందాలని బీజేపీ చూస్తున్నదని చెప్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

జగిత్యాల గుడిసెవాసులపై కేసులు ఎత్తేయాలి

అరెస్టైన వారిని విడుదల చేయాలి

పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలివ్వాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

నవతెలంగాణ - జగిత్యాల

జగిత్యాలలో గుడిసె వాసులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తేయాలని, అరెస్టు అయిన వారిని భేషరతుగా విడుదల చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగిత్యాల పట్టణంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగిత్యాలలో ఆరు నెలలుగా సీపీఐ(ఎం), ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరుపేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని, ఈ భూమి గతంలో ఎవరికీ కేటాయించినది కాదని చెప్పారు. నిరుపయోగంగా ఉందన్నారు. అలాంటి స్థలంలో పేదలు గుడిసెలు వేస్తే తప్పేంటని ప్రశ్నించారు. గత పాలకులు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని మోసం చేయడం మూలంగానే కాంగ్రెస్‌ను ఆదరించారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పోలీసులు పేదల గుడిసెలను కూల్చివేయడం, సీపీఐ(ఎం), భూ పోరాట నాయకులపై, పేదలపై అక్రమంగా కేసులు పెట్టి జైల్లో వేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో 69 కేంద్రాల్లో భూపోరాటం చేస్తున్నామని, గతంలో సీఎం రేవంత్‌రెడ్డిని సీపీఐ(ఎం) బృందం కలిసి అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని వినతిపత్రం ఇచ్చామని గుర్తు చేశారు. జగిత్యాల పోలీసులు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కొమ్ముకాస్తూ పేదలపై దౌర్జన్యంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 307లాంటి అక్రమ కేసులు బనాయించారని వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజాసంఘాలను ఐక్యం చేసి పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు దక్కే వరకు పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

జైల్లో నాయకులకు పరామర్శ..

జైల్లో ఉన్న నాయకులు జి.తిరుపతి నాయక్, లెల్లెల బాలకృష్ణ, రజియా సుల్తానాను సీపీఐ(ఎం) బృందం పరామర్శించింది. జైలు గోడలు, లాఠీలు తూటాలు ఉద్యమాలను ఆపలేవని, గతంలో ఇండ్ల స్థలాల కోసం పోరాడి సాధించుకున్న అనుభవాలను స్ఫూర్తిగా తీసుకొని భూ పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా జూలకంటి అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్రాములు, అరుణ జ్యోతి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు వర్ణవెంకట రెడ్డి, జగిత్యాల జిల్లా నాయకులు రమేష్, వెంకటచారి, చౌదరి, సలీం, రఫిక్, మహ్మద్, శ్రీను పాల్గొన్నారు.

కేసీఆర్ కుటుంబానికి బ్రోకర్‌గా పని చేస్తున్నావా?

ఎంపీ విజయసాయిరెడ్డిపై జగ్గారెడ్డి ఆగ్రహం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మాజీ సీఎం కేసీఆర్ కుటుంబానికి బ్రోకర్‌గా పని చేస్తున్నావా? అంటూ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డిని ప్రశ్నించారు. 'కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు నెలలే అయింది. కేటీఆరేమో ఆరు నెలలు ఆగండి కేసీఆర్ సీఎం అంటున్నారు. హరీశ్‌రావు కూడా అదే విధంగా మాట్లాడుతున్నారు. కేటీఆర్, హరీశ్‌రావులకు పదవులుపోయి తట్టులేకపోతున్నారు. ఆ పార్టీకి చెందిన 20 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వచ్చే అవకాశం ఉండటం ఉన్నది. దీంతో బీఆర్ఎస్ పార్టీని కాపాడుకునేందుకు కాంగ్రెస్ కూలిపోతుంది' అంటూ బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు.

ఈ సమయంలో కాంగ్రెస్‌ను కూల్చేందుకు విజయసాయిరెడ్డి వకాల్తా పుచ్చుకున్నట్టు కనిపిస్తోందని విమర్శించారు. మోడీ డైరెక్షన్...కేసీఆర్, జగన్ ఆధ్వర్యంలో విజయసాయిరెడ్డి బ్రోకర్ దుకాణం పెట్టుకున్నవా? ఏంటి అని ప్రశ్నించారు. మీడియేటర్ విజయ సాయిరెడ్డి, కేటీఆర్, హరీశ్ కుట్రలు తిప్పి కొడతామన్నారు. 'వీలైనంత త్వరలోనే 20 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను లేపుకొస్తాం. కేసీఆర్ పక్కన పడుకున్న కూడా వారిని తీసుకొస్తాం. చూసుకోండి. బాగా బలుకెక్కింది. కుట్రలకు ప్రతి కుట్ర ఉంటది. కేసీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఏపీ సీఎం జగన్‌కు వెయ్యి కోట్ల ఫండింగ్ ఇచ్చారు' అని ఆరోపించారు. పదేండ్లపాటు కాంగ్రెస్ ఎలా అధికారంలో ఉండాలనే విషయంలో తమ పార్టీకి స్పష్టత ఉందని తెలిపారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో 12 నుంచి 14 ఎంపీ సీట్లు గెలవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందన్నారు.

పాక్ ఎన్నికల వేళ జంట పేలుళ్లు

- 28 మంది మృతి
- మరో 40 మందికి గాయాలు
- అమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆందోళన



ఇస్లామాబాద్ : గురువారం సార్వత్రిక ఎన్నికలు జరగనున్న వేళ పాకిస్తాన్‌లో బుధవారం జంట పేలుళ్ళు చోటు చేసుకున్నాయి. బలూచిస్తాన్ ప్రావిన్స్‌లోని పిషిన్, కిలా సైపుల్లాల్లో వెంట వెంటనే జరిగిన బాంబు పేలుళ్లలో 28 మంది మరణించారు. 40 మంది పైగా గాయపడ్డారు. ఖైబర్ ఫంఖ్తుఖ్వా, బెలూచిస్తాన్‌ల్లో ఇటీవల తీవ్రవాద దాడులు పెరగడంతో భద్రతా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. క్వెట్టాకు సమీపంలో గల పిషిన్‌లోని ఖానొజాయ్ యూనియన్ కౌన్సిల్‌లో మొదటి పేలుడు సంభవించింది.

స్వతంత్ర అభ్యర్థి అసఫన్‌దార్ కాకర్ ఎన్నికల కార్యాలయం వెలుపల ఈ పేలుడు సంభవించినట్లు జిల్లా డిప్యూటీ కమిషనర్ మీడియాకు తెలిపారు. 14 మృతదేహాలను, 23 మంది క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

గాయపడిన మరో నలుగురు మరణించారని, దీంతో ఇక్కడి పేలుడు ఘటనలో మృతుల సంఖ్య 18కి పెరిగిందని మెడికల్ సూపరింటెండెంట్ తెలిపారు. ఆ ప్రాంతంలో పార్క్ చేసిన మోటార్‌సైకిల్‌లో పేలుడు పదార్థాలను పెట్టినట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు.

సమాచార కమిషనర్‌ను కలిసిన నవతెలంగాణ ప్రతినిధి బృందం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమచార పౌరసంబంధాల శాఖ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.హన్మంతరావును బుధవారం నవతెలంగాణ ఎడిటర్ ఆర్.సుధాభాస్కర్, అడ్వర్టైజింగ్ జనరల్ మేనేజర్ ఎం.వెంకటేష్, హెచ్ఆర్ మేనేజర్ నరెందర్ రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు నవతెలంగాణ ప్లానర్‌ను కమిషనర్‌కు అందజేశారు.



హైదరాబాద్ ఇమేజ్ పెరగాలి



క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉండాలి

- అన్ని శాఖల సమన్వయంతో అభివృద్ధి
- తాగునీటి సమస్య లేదు
- జీహెచ్ఎంసీ ఉద్యోగులకు 5లోగా జీతభత్యాలు
- డబుల్ బెడ్ రూమ్‌లపై త్వరలోనే ప్రభుత్వ పాలసీ : మంత్రి పొన్నం ప్రభాకర్

వరద ముంపు లేకుండా చర్యలు తీసుకున్నాం: కమిషనర్

జీహెచ్ఎంసీలో చేపడుతున్న పనులను విభాగాల వారీగా జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. రానున్న వర్షాకాలంలో నగరంలో వరద ముంపు లేకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్‌కు ఉన్న ఇమేజ్ మరింత పెరిగే విధంగా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు అధికారులతో కలిసి హైదరాబాద్ నగర అభివృద్ధి, సమస్యలపై మంత్రి సమీక్షించారు. మహానగరం రోజురోజుకూ విస్తరిస్తోందని, అందుకు అనుగుణంగా అభివృద్ధి జరగాలన్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి తలెత్తే ప్రాంతాలను ముందుగానే గుర్తించి సరఫరా చేయాలని సూచించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు ఇబ్బంది లేకుండా ముందుకు వెళ్లాలన్నారు. రానున్న రోజుల్లో నీటి ఎద్దడి ఎదురవుతుందని ప్రతిపక్షం వాళ్ళు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి ఆరోపణలను తిప్పికొట్టాలన్నారు. ప్రాజెక్టులు డెడ్ స్టోరేజీకి వెళ్లలేదని, వచ్చే సమ్మర్‌లో సిటీలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాదన్నారు. మూసీ నది అభివృద్ధికి ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు ఉంటాయన్నారు.

రాష్ట్రంలో పట్టణాల అభివృద్ధి కోసం కేంద్రంతో కలుపుకొని పోతామన్నారు. భవిష్యత్‌లో ఎదురయ్యే సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ప్లానింగ్‌తో ముందుకు పోవాలన్నారు. రాష్ట్రంలో రూ.40 నుంచి 50 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, గత ప్రభుత్వం రూ.లక్ష 90 వేల కోట్ల విలువ గల పనులకు ప్రొసీడింగ్స్ ఇచ్చిందని తెలిపారు. జీహెచ్ఎంసీలో ప్రాజెక్టు పనులకు రూ.2వేల కోట్లు అవసరం ఉందన్నారు.

జిల్లాల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి జిల్లా ఇన్‌చార్జి మంత్రులకు రూ.10 కోట్ల నిధులు కేటాయించారని, అత్యవసర పనులు పూర్తి చేసేందుకు అధికారులు వివరాలు తెలియజేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతోపాటు జీహెచ్ఎంసీ ఉద్యోగులకు కూడా ప్రతి నెలా 1వ తేదీ నుంచీ 5వ తేదీ వరకు జీతభత్యాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. ప్రజలపై భారం పడకుండా ఆదాయ వనరులు పెంచుకోవాలని, అవసరమైతే రాయితీపై ఆలోచించాలన్నారు. అప్పులు - ఆస్తుల అంశాలపై ముఖ్యమంత్రికి నివేదిక ఇవ్వనున్నట్టు చెప్పారు. డబుల్ బెడ్ రూమ్‌లపై త్వరలోనే ప్రభుత్వం పాలసీ ప్రకటన చేస్తుందన్నారు. అధికారుల సమన్వయం కోసం ప్రత్యేకంగా ఓఎస్‌డీని నియమిస్తామన్నారు. అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇవ్వడంతో మంత్రికి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ధన్యవాదాలు తెలిపారు.

40 శాతం మురుగునీటి శుభ్రత నగరం : జలమండలి ఎండీ

నగరంలో సివరేజ్ అభివృద్ధికి తీసుకున్న చర్యలపై జలమండలి ఎండి సుదర్శన్‌రెడ్డి వివరించారు. గతంలో 25 ఎస్‌టీపీలుండగా మరో 31 ఎస్‌టీపీల నిర్మాణాలు చేపట్టగా అందులో 5 పూర్తయ్యాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అమృత పథకం ద్వారా మరో 35 ఎస్‌టీపీలకు ప్రతిపాదనలు పంపామని వివరించారు. దేశంలో 40 శాతం మురుగునీటి శుభ్రత నగరంగా హైదరాబాద్ పేరుగాంచినట్టు తెలిపారు. మురుగునీటి శుభ్రత ఎస్‌టీపీల వల్ల మూసీ నది అభివృద్ధికి ఇబ్బంది ఉండదన్నారు.

ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, శివ కుమార్ నాయుడు, జయరాజ్ కెన్నెడీ, సరోజ, ఉపేందర్ రెడ్డి, యాదగిరిరావు, సీసీపీ రాజేంద్రప్రసాద్ నాయక్, సీఈ దేవానంద్, కిషన్, సురేష్ కుమార్, జోనల్ కమిషనర్లు అభిలాష అభినవ్, రవి కిరణ్, పంకజ, వెంకన్న, ఎస్.ఈలు రత్నాకర్, చిన్నారెడ్డి, సీఎం.ఓ.హెచ్ డాక్టర్ పద్మజ, చీఫ్ వెటర్నరీ ఆఫీసర్ అబ్దుల్ వకీల్, చీఫ్ ఎంటమాలజి డాక్టర్ రాంబాబు, హౌసింగ్ ఎస్.ఈ విద్యాసాగర్, జోనల్ వెటర్నరీ, జోనల్ హౌసింగ్, జోనల్ ఎంటమాలజి, ఆయా విభాగాల ఉన్నతాధికారులు, వాటర్‌బోర్డు రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్, ఆపరేషన్స్ డైరెక్టర్-1 అజ్మీరా క్రిష్ణ, ఆపరేషన్స్ డైరెక్టర్-2 స్వామి, టెక్నికల్ డైరెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

ఈసారీ.. బీజేపీఎల్పీ నేత లేనట్టే

(మొదటి పేజీ తరువాయి)

నాయకులు తెగ ప్రచారం చేశారు. కానీ, అక్కడ అమిత్‌షా తాను వెళ్లే ముందు ఎమ్మెల్యేలను చుట్టపుచూపులా పరిచయం చేసుకుని వెళ్లారే తప్ప ఎల్పీ నేత ఎవరనే దానిపై స్పష్టత ఇవ్వలేదు. సమస్యను తెగేదాకా లాగితే అది మరింత జఠిలం అవుతుందన్నట్టుగా ఇప్పుడు పరిస్థితి తయారైంది. ఎల్పీనేత ఎంపిక ఆ పార్టీలో చిచ్చుపెట్టి కూర్చున్నది. గురువారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతుండగా ఓ గ్రూపు ఎమ్మెల్యేలు మాత్రం ఢిల్లీబాట పట్టినట్టు తెలిసింది. వారు అక్కడకు ఎందుకెళ్లారు? ఎల్పీనేత ఎంపిక గురించి తేల్చాలనే డిమాండ్‌తోనా? రాష్ట్ర నాయకత్వం తీరుపై ఫిర్యాదు చేయడానికా? అనేదానిపైనే ప్రధానంగా చర్చ నడుస్తున్నది. శాసనసభ సమావేశాల నేపథ్యంలో ఏయే అంశాలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలనే దానిపై రాష్ట్ర నాయకత్వం సమావేశం పెట్టి దిశానిర్దేశం చేయకపోవడంపైనా ఎమ్మెల్యేలు ఆగ్రహంతోనూ ఉన్నారు.


బీజేపీలో ఫ్లోర్ లీడర్ నియామకం కోసం నేతలు పోటీ పడుతున్నారు. సీనియారిటీ ప్రకారం తనకే వస్తుందని రాజాసింగ్ లెక్కలు వేసుకుంటున్నారు. అటు కేసీఆర్.. ఇటు రేవంత్ రెడ్డిని ఓడించిన వెంకటరమణారెడ్డి తనకు వస్తుందని ఆశిస్తున్నారు. అలాగే రేసులో ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఉండగా పైడి రాకేశ్ రెడ్డి సైతం తనకు అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. అయితే పార్టీ మాత్రం దీనిపై ఎంతమాత్రం స్పందించకపోవడం గమనార్హం. ఫ్లోర్ లీడర్ పదవి కోసం పోటీపడే క్రమంలో బీజేపీ ఎమ్మెల్యేల మధ్య కూడా సమన్వయ లోపం ఉందనే విమర్శలు వస్తున్నాయి. ఎవరికి వారే.. యమునా తీరే అన్న చందంగా బీజేపీ ఎమ్మెల్యేల వ్యవహార శైలి ఉందనే విమర్శలు వస్తున్నాయి.

అందరూ పోటీదారులే..

ఎమ్మెల్యేలందరూ తమకంటే తమకే ఆ పదవి ఇవ్వాలని పట్టుబడుతున్నట్టు సమాచారం. సీనియర్, పార్టీ ఐడియాలజీని దృష్టిలో పెట్టుకుని మొదట రాజాసింగ్‌కు ఆ పదవి ఇస్తారనే ప్రచారం జరిగింది. కానీ, ఆయన దూకుడుతనం, తెలుగు భాషపై పట్టులేకపోవడం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని అధిష్టానం వెనక్కి తగ్గినట్టు తెలిసింది. అక్కడ మొదలైన పంచాయతీ నాకంటే నాకు అనే దాకా వెళ్లింది. సామాజిక, రాజకీయ అంశాలను పరిగణనలోకి తీసుకుని తమకే ఆ పదవి ఇవ్వాలని ఎమ్మెల్యేలు ఎవ్వరికి వారు పైరవీలు చేసుకుంటున్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తామని ప్రచారం చేసిన నేపథ్యంలో ఎల్పీ పదవిని బీసీనైన తనకే ఇవ్వాలని పాయల్ శంకర్ కోరుతున్నట్టు తెలిసింది. కొందరు మహేశ్వర్‌రెడ్డి పేరును తెరపైకి తెస్తున్నారు. మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిపై పోటీచేసి గెలిచిన తనకే ఎల్పీ పదవి కటబెట్టాలని వెంకటరమణారెడ్డి తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. తానూ తక్కువేంకాదన్నట్టు పైడి రాకేశ్‌రెడ్డి కూడా పైస్థాయిలో పైరవీ చేసుకుంటున్నాడు.

ఏపీ బడ్జెట్ @ రూ.2.86 లక్షల కోట్లు

ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి బుగ్గన



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2,86,389 కోట్ల అంచనాలతో ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ ను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. రూ.2,30,110 కోట్ల రెవెన్యూ వ్యయం, రూ.30,530 కోట్ల మూలధన వ్యయంతో పద్దును ప్రతిపాదించారు. రూ.24,758 కోట్ల రెవెన్యూ లోటు, రూ.55,817 కోట్ల ద్రవ్యలోటును అంచనా వేశారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో 3.51 శాతం మేర ద్రవ్యలోటు, 1.56 శాతం రెవెన్యూ లోటు ఉంటుందని పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరం మొత్తానికి బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పించినా ఏప్రిల్ నుంచి జులై నెలల వరకే ఆమోదం తీసుకుంటారు. పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఎన్నికల తర్వాత కొత్తగా కొలువుదీరే ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది.

కృష్ణార్పణం కానివ్వొద్దు

సంపాదకీయం

కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కు ప్రాజెక్టుల అప్పగింత, నీటివాటాల సంగతి రాష్ట్రంలో రాజకీయ వేడి రగిలిస్తున్నది. దాదాపు యాభై ఏండ్ల కిందటి గొడవ మళ్లీ రాజుకోవడానికి కారణమైంది. ఇప్పటిదాకా ఇది తెలుగు రాష్ట్రాల మధ్యేగాక తెలంగాణలో పాలక,

> 2004లో ఏర్పాటైన బ్రిజేష్‌కుమార్ కృష్ణా జలవివాదాల ట్రిబ్యునల్-2 తీర్పు వచ్చేవరకు 50:50 నిష్పత్తి చొప్పున జలాలను వాడుకోవడానికి అంగీకరించాలని కేఆర్ఎంబీని తెలంగాణ కోరుతున్నది. అలాగే కేఆర్ఎంబీ సైతం కేంద్రం సైగలతో దాగుడు మూతలాడుతున్నది. అపెక్స్ కౌన్సిల్‌తో సమస్యను పరిష్కరింపచేయకుండా కేంద్రం సాగదీస్తూ వచ్చింది.బలప్రయోగం ద్వారా ఏపీ రెండు వేల క్యూసెక్కుల నీటిని తరలించుకుపోవడానికి సహకరించింది. కేంద్రం మద్దతే లేకపోతే ఏపీ అంత బరితెగించేదా?

ప్రతిపక్షాలకు పాకింది. కృష్ణా జలాల వివాదాలు నిత్యకృత్యమయ్యాయి. నానాటికి పెను సమస్యగా మారింది. కలహాల భోజ్యంగా తయారైంది. మహారాష్ట్ర, కర్నాటక, ఏపీ, తెలంగాణ దప్పిక తీరుస్తూ, పరివాహక ప్రాంతానికి లక్షల ఎకరాలకు సాగునీటినందించేదే కృష్ణానదీ సమస్యను గుర్తించి పరిష్కరించుకునే బదులు తప్పు మీదంటే మీదని అధికార, విపక్షాలు గిల్లికజ్జాలకు దిగాయి. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ దుమ్మెత్తిపోసుకుంటున్నాయి. కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగించడం అంటే తెలంగాణకు వ్యతిరేకంగా వ్యవహరించడమేనంటూ ఒకరికొకరు నీతిసూత్రాలు వల్లించుకుంటున్నారు. రేవంత్ సర్కారు కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించిందనే విమర్శలకు బీఆర్ఎస్ దిగడం, కాదు కాదు ఆ ఘనకార్యం మీరే చేశారంటూ కాంగ్రెస్ సర్కారు ఎదురుదాడి చేయడంతోపాటు మొత్తం రికార్డులను మీడియా ముందుంచే ప్రయత్నాన్ని గమనిస్తున్నాం. ఇందులో ఏదీ నిజమో భవిష్యత్‌లో తేలనుంది.

సందట్లో సడేమియాలా నేనేమీ తక్కువ తినలేదన్నట్టు సమస్యను పరిష్కరించే బాధ్యతను కేఆర్ఎంబీ పైకి నెట్టేసి కేంద్రంలోని మోడీ సర్కార్ చేతులు దులుపుకుంది. శవాల మీద పేలాలు ఏరుకునే బుద్ధున్న బీజేపీ సమస్యను నాన్చింది. దేశాల మధ్య నదీజలాల సమస్యను పరిష్కరించుకున్నామని డబ్బా కొట్టుకున్న కేంద్రం, ఇప్పుడు అంత:రాష్ట్ర సమస్యల పట్ల ఎందుకింత నిర్లక్ష్యం చేస్తున్నదనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ బోర్డుల పేర కేంద్రం తెరవెనుక నాటకమాడుతున్నది. వ్యవహారాన్ని సాంతం సమీక్షించి, మొత్తం నికరజలాలు, మిగులు జలా లను కొత్త ట్రిబ్యునల్ ద్వారా పున:పంపిణీ చేస్తే సమస్య అంతమయ్యే అవకాశమెక్కువ. అయితే రాయలసీమ లిఫ్ట్



ఇరిగేషన్ ప్రాజెక్టుతో దక్షిణ తెలంగాణ ఏడారిగా మారుతుందని తెలంగాణ వాదన. దీంతో పరిపాలనా, పర్యావరణ అనుమతుల్లేకుండా ఏపీ కడుతున్న ప్రాజెక్టులను అడ్డుకోవాలని తొలినుంచి మోడీ సర్కారుకు మొరపెట్టుకుంటూనే ఉంది. అయినా అడుగుముందుకు పడలేదు. సుప్రీంకోర్టు కేసు ఉపసంహరిస్తే సమస్యను పరిష్కరిస్తామని రెండేండ్లుగా పెండింగ్‌లో పెట్టిన సంగతి ఎవరికి తెలియనిది? కాగా రాష్ట్రంలోని ఆ పార్టీకి చెందిన కేంద్రమంత్రి, ఎమ్మెల్యేలు మాత్రం చడీచప్పుడు చేయకపోవడం విడ్డూరం.

1964లో బచావత్ ట్రిబ్యునల్ తొలుత చేసిన కేటాయింపుల్లో 520 టీఎంసీలు ఏపీకి, 299 టీఎంసీలు తెలంగాణకు దక్కాయి. అప్పట్లో ప్రాజెక్టులతో పాటు ఆయకట్టూ తక్కువే. ఇప్పుడు ఆయకట్టుతోపాటు తాగు నీటి అవసరాలు పెరిగాయి. 2004లో ఏర్పాటైన బ్రిజేష్ కుమార్ కృష్ణా జలవివాదాల ట్రిబ్యునల్-2 తీర్పు వచ్చే వరకు 50:50 నిష్పత్తి చొప్పున జలాలను వాడుకోవడానికి అంగీకరించాలని కేఆర్ఎంబీని తెలంగాణ కోరుతున్నది. అలాగే కేఆర్ఎంబీ సైతం కేంద్రం సైగలతో దాగుడు మూతలాడుతున్నది. అపెక్స్ కౌన్సిల్‌తో సమస్యను పరిష్కరింపచేయకుండా కేంద్రం సాగదీస్తూ వచ్చింది. బలప్రయోగం ద్వారా ఏపీ రెండు వేల క్యూసెక్కుల నీటిని తరలించుకుపోవడానికి సహకరించింది. కేంద్రం మద్దతే లేకపోతే ఏపీ అంత బరితెగించేదా? పరిష్కరించడంలో ఆలస్యం మూలంగా శాంతిభద్రతల సమస్యా తలెత్తడం గమనార్హం.

ఢిల్లీలో డిసెంబరు 17న జరిగిన సమావేశం మినిట్స్‌నే తప్పుగా పంపడం వెనుక ఉన్న ఉద్దేశమేంటి? అధికారులు చెప్పింది ఒకటికాగా, మినిట్స్‌లో పొందు పరిచింది మరొకటి. సమస్యలన్నీ పరిష్కరిస్తే కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగిస్తామనడం వేరు, బేషరతుగా అప్పగించారనడం వేరనే సంగతి బోర్డు గ్రహించాలి. బీఆర్ఎస్ సర్కారు బడ్జెట్‌లో ప్రాజెక్టుల నిర్వహణకు రూ.200 కోట్లను ప్రతిపాదించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? దీనితో పాటు ఇతర పత్రాలపై బీఆర్ఎస్ హయాంలో అధికారులు చేసిన సంతకాలను కాంగ్రెస్ సాక్ష్యంగా చూపుతున్నది. అయితే రేవంత్ చెప్పినట్టుగా అఖిలపక్షం నిర్వహించి ఉంటే సమస్య పరిష్కారానికి శాస్త్రీయ పరిష్కారం దొరికే అవకాశముండేది. ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు చేసేలా ప్రభుత్వం చొరవ చేయాలని సాగునీటిరంగ నిపుణులు సూచిస్తున్నారు. అపెక్స్ కౌన్సిల్‌తో సమస్యను పరిష్కరించే బాధ్యత మోడీ సర్కార్‌దే. అలాగే మొత్తం వ్యవహారంపై రేవంత్ సర్కారు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సందర్భంగా శాసనసభలో ప్రవేశపెట్టే శ్వేతపత్రంపై చర్చద్వారా సమస్యను సానుకూలంగా పరిష్కరించాల్సిన అవసరమూ ఉంది.

చీకటిశక్తులు విస్తరిస్తున్నాయి



ఆర్. రఘు
9490098422

గత పదేండ్లకు పైగా మనదేశంలో పచ్చి మితవాద ఫాసిస్టు శక్తుల వీరంగం చూస్తున్నాం. ముస్లిం మైనారిటీల మీద, క్రైస్తవుల మీద, వారి ప్రార్థనాలయాల మీద దాడులు, తద్వారా సమాజంలో ఓ భయానకమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. మరోపక్క ప్రజాస్వామ్యవాదులను, ప్రభుత్వాన్ని విమర్శించే సంస్థలను, వ్యక్తులను అడ్డగోలుగా నెలల తరబడి నిర్బంధించడం నిత్యకృత్యంగా మారింది. సహజంగానే మన దృష్టంతా దేశంలో పెరుగుతున్న మితవాద ఫాసిస్ట్ ధోరణుల మీద, పార్టీల మీద, సంస్థల మీదే ఉంటుంది. కానీ వాస్తవానికి ప్రపంచ వ్యాప్తంగానే నయా ఫాసిస్ట్ పచ్చి మితవాద శక్తులు విజృంభిస్తున్నాయి. అర్జెంటీనా, ఇటలీ, నెదర్లాండ్స్, టర్కీ వంటి దేశాలలో మతతత్వ పార్టీలు అధికారంలోకి వచ్చాయి. ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా వంటి సామ్రాజ్యవాద దేశాల్లో కూడా 2022-23లలో జరిగిన ఎన్నికలలో నయా ఫాసిస్టులు దాదాపు అధికారంలోకి వచ్చినంతగా పెరిగారు. అమెరికా, ఇంగ్లం

> అమెరికా ఇతర సామ్రాజ్యవాద దేశాలను కలుపుకొని సృష్టించాలనుకుంటున్న ఓ నూతన ప్రపంచానికి కేంద్ర బిందువు చైనా వ్యతిరేకత, సోషలిజం వ్యతిరేకత. అందుకు పై అనేక ఉదాహరణలతో పాటు ఆర్థికంగా అత్యంత బలోపేతం అవుతున్న చైనాను దెబ్బతీయడానికి అనేక కూటములను కడుతున్నది. అంతర్జాతీయ వేదికల మీద చైనాను, క్యూబాను, ఉత్తర కొరియాను లక్ష్యంగా పెట్టుకొని దాడులు నిర్వహిస్తున్నది. అత్యధిక దేశాలు ఖండించినా, ఐక్యరాజ్యసమితి తిరస్కరించినా క్యూబాపై ఆంక్షలను ముమ్మరం చేస్తున్నది. తన మాట కాదంటే ఐక్యరాజ్యసమితినే నిర్వీర్యం చేస్తానని హెచ్చరిస్తున్నది. కానీ ప్రపంచవ్యాప్తంగా ఈ చీకటి శక్తులకు వ్యతిరేకత కూడా క్రమంగా ఊపందుకుంటున్నది.

డ్‌లలో ఈ ధోరణులను అధికార ప్రతిపక్ష పార్టీలే ప్రోత్సహిస్తున్నాయి. మానవత్వం, సమానత్వం, సౌభ్రాతృత్వం, శాస్త్రీయ దృక్పథం వంటి అత్యంత కీలక అంశాల మీద అంతర్జాతీయ వేదికలు, సంస్థలు చేసిన తీర్మానాలన్నింటిని బహిరంగంగా పెట్టుబడిదారీ దేశాలు తుంగలో తొక్కుతున్నాయి. నిశితంగా పరిశీలిస్తే ప్రపంచ వ్యాపితంగా, అందులో భాగంగా మనదేశంలో కూడా ఈ చీకటి శక్తులు బలపడటానికి అనేక సాధారణ కారణాలు మనకు కనిపిస్తాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పాలస్తీనాపై ఇజ్రాయిల్ అమానుష దాడి, పర్యవసానంగా ప్రపంచంలోని అత్యధిక భాగంలో యుద్ధ వాతావరణం అలుముకుని ఉంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ అమెరికా అండ చూసుకుని ప్రపంచ యుద్ధం ప్రారంభం కానున్నదని హెచ్చరిస్తున్నాడు. అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్‌ని విమర్శిస్తూ అమెరికా బలహీన పడుతున్నదని, మరోసారి ప్రపంచ యుద్ధం కనుచూపు మేరల్లో ఉందని హెచ్చరికలు జారీ చేస్తున్నాడు.

యుద్ధోన్మాదం, జాతి, మత, ఉన్మాదాల కలయిక

అనేకమంది అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు, మేధావులు ఈ పరిస్థితిని మొదటి ప్రపంచ యుద్ధం, రెండవ ప్రపంచ యుద్ధం ముందు నాటి కాలాలు పునరావృతం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ప్రపంచాన్ని కుదిపేస్తున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలోనూ మరీ ముఖ్యంగా పాలస్తీనాపై ఇజ్రాయిల్ నెలల తరబడి జరుపుతున్న మారణకాండను, పర్యవసానంగా ప్రపంచంలో పెరుగుతున్న యుద్ధ వాతావరణాన్ని, ఉద్రిక్తతలను పరిశీలిస్తే యుద్ధోన్మాదం, మత,జాతి ఉన్మాదాలు హెచ్చరిల్లుతున్నాయని స్పష్టం అవుతుంది. పాలస్తీనాకి మద్దతుగా మధ్య ప్రాచ్యంలోని అనేక ఇస్లాం రాజ్యాలు రంగంలోకి దిగుతున్నాయి. ప్రతిగా సామ్రాజ్యవాద దేశాలు క్రైస్తవ మత భావజాలానికి మద్దతుగా అన్నట్లు ఇజ్రాయిల్‌ని బలపరుస్తున్నాయి. 2023 డిసెంబర్ 29వ తేదీన దక్షిణాఫ్రికా ప్రభుత్వం అంతర్జాతీయ న్యాయస్థానంలో ఇజ్రాయిల్ మానవ ఖననంపైన కేసు వేసింది. దీనికి మద్దతుగా బంగ్లాదేశ్, జోర్డాన్ ఇంకా అనేక లాటిన్ అమెరికా దేశాలు కోర్టుకు పత్రాలు సమర్పించాయి. జర్మనీ, అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ దేశాలు ఇజ్రాయిల్‌కి మద్దతు తెలియజేస్తూ కేసు దఖలు పరిచాయి. ఫ్రాన్స్ ప్రభుత్వం తమ దేశంలో పెరుగుతున్న నయాఫాసిస్టు ఒత్తిడికి తలొగ్గి న్యాయస్థానం మీదే తీవ్ర విమర్శలు ప్రారంభిం చింది. గతంలో మయన్మార్‌లో రోహింగ్యా ముస్లింల మీద జరుగుతున్న మారణకాండపై గాంబియా ప్రభుత్వం ఇదే కోర్టులో వేసిన కేసుని బలపరిచిన జర్మనీ ఇప్పుడు ఇజ్రాయిల్ మారణకాండని బలపరుస్తూ ముందుకు రావడం యాదృచ్ఛికం కాదు. తాజాగా ఇరాన్ బలపరుస్తున్న షియా మిలిటెంట్లు జోర్డాన్‌లో పొంచి ఉన్న అమెరికా సైనిక దళాలపై డ్రోన్ దాడులు ప్రారంభించాయి. అంతర్జాతీయ న్యాయస్థానం పాలస్తీనాలోని గాజాపై ఇజ్రాయిల్ దాడులు నిలవరించమని ఆదేశించినా, ఇజ్రాయిల్ తాను రక్షణ దాడులు మాత్రమే చేస్తున్నానని బుకాయిస్తున్నది. అందుకు సామ్రాజ్యవాద దేశాలు వంతపాడటం ఈ అంతర్జాతీయ న్యాయస్థానం అస్తిత్వాన్నే ప్రశ్నించే పరిస్థితి దాపురించింది. ఈ అంతర్జాతీయ న్యాయస్థానం కూడా సామ్రాజ్యవాదుల అదుపాజ్ఞలలోనే ఉంటుందన్న అపోహను ఈ పరిణామాలు బలపరుస్తున్నాయి. ఇంత తీవ్రమైన పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నా 'విశ్వగురువు' ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ అమెరికా ప్రాపకం కోసం ఇజ్రాయిల్‌ని బలపర్చడం, దాని యుద్ధోన్మాద, మతోన్మాద, ఫాసిస్ట్ విధానాలకు నిదర్శనం

> తాజాగా ప్రపంచాన్ని కుదిపేస్తున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలోనూ మరీ ముఖ్యంగా పాలస్తీనాపై ఇజ్రాయిల్ నెలల తరబడి జరుపుతున్న మారణకాండను, పర్యవసానంగా ప్రపంచంలో పెరుగుతున్న యుద్ధ వాతావరణాన్ని, ఉద్రిక్తతలను పరిశీలిస్తే యుద్ధోన్మాదం, మత,జాతి ఉన్మాదాలు హెచ్చరిల్లుతున్నాయని స్పష్టం అవుతుంది. పాలస్తీనాకి మద్దతుగా మధ్య ప్రాచ్యంలోని అనేక ఇస్లాం రాజ్యాలు రంగంలోకి దిగుతున్నాయి. ప్రతిగా సామ్రాజ్యవాద దేశాలు క్రైస్తవ మత భావజాలానికి మద్దతుగా అన్నట్లు ఇజ్రాయిల్‌ని బలపరుస్తున్నాయి.

ఆర్థిక సంక్షోభం అసలు రహస్యం

సంక్షోభాలు రావడం, పోవడం పెట్టుబడిదారీ వ్యవస్థకు కొత్త కాదు. పెట్టుబడిదారీ వ్యవస్థను సంపూర్ణంగా 'స్కాన్' చేసిన కార్ల్ మార్క్స్ పెట్టుబడి గ్రంథంలోనూ, ఇతర అనేక తన అమూల్య రచనల్లోనూ స్పష్టంగా పెట్టుబడిదారీ వ్యవస్థకు మూడు లక్షణాలు ఉంటాయని ప్రకటించారు. ఒకటి ఆర్థిక సంక్షోభాలు. రెండు యుద్ధాలు. మూడు అసమాన అభివృద్ధి. ప్రస్తుత ప్రపంచంలో ఈ మూడు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. ఇందులో ప్రత్యేకించి ఆర్థిక సంక్షోభం గురించి చెప్పుకోవాలి. పెట్టుబడిదారీ వ్యవస్థ ఏర్పడిన తరువాత 1929-30లలో వచ్చిన ఆర్థిక సంక్షోభం అప్పటికి చాలా పెద్దది. భయానకమైనది. దాన్ని అధిగమించగలిగిన పెట్టుబడిదారీ వ్యవస్థ 2008లో ప్రారంభమైన ఆర్థిక సంక్షోభం నుండి బయట పడలేని ఒక తీవ్రమైన దుస్థితికి చేరుకున్నది. నాలుగు, ఐదేండ్లు మించకుండానే అనేక దేశాలలో పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభం నుంచి బయటపడుతూ వచ్చింది. కానీ ఈ తడవ 16 సంవత్సరాలు గడుస్తున్నా అతీగతీ కనపడటం లేదు. పరిష్కారం కోసం ఎంత ప్రయత్నించినా జబ్బు వికటిస్తుందే తప్ప బయటపడుతుందన్న ఆశ కనబడటం లేదు. ఈ ఆర్థిక సంక్షోభం యొక్క పర్యవసానం రాజకీయ, సాంఘిక రంగాల మీద తీవ్రంగా పడుతున్నది. దశాబ్దాలుగా పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడుకుంటూ వస్తున్న ఉదారవాద ప్రజాస్వామ్యం కళ్ళు తేలేసింది. ప్రొఫెసర్ ఐజాజ్ అహ్మద్ చెప్పినట్లు ఈ ఉదారవాద ప్రజాస్వామ్యం కనుమరుగవుతూ దాని స్థానంలోకి పచ్చి మితవాద, నయా ఫాసిస్టు లేక ఫాసిస్టు తరహా శక్తులకి భారీ ఊతం ఇస్తున్నది. అంతేకాదు పథకం ప్రకారం ఆయా దేశాల్లో విప్లవ శక్తులను, సోషలిస్టు భావజాలాన్ని దరిచేరనీయకుండా చూడటం మరో ముఖ్యమైన పరిణామం. ఈ పరిస్థితి అన్ని దేశాల్లో లాగానే మనదేశంలో కూడా మనకి కనపడుతున్నది. మధ్యేవాద పార్టీలు, ఆయా దేశాల్లో ఉన్న లౌకిక రాజ్యాంగాలు, గణతంత్ర పరిపాలన విధానాలు, వ్యవస్థలను తొలుచుకుంటూ మితవాద శక్తులు అధికార పీఠాలని చేజిక్కించుకుంటున్నాయి. మధ్యేవాద పార్టీలు లేక సెంటర్ లెఫ్ట్ పార్టీలు కోలుకోలేనంతగా బలహీన పడుతున్నాయి. పైగా ఈ బలహీనతను అధిగమించ డానికి మితవాద ధోరణులనే ఆసరా చేసుకోవడానికి పూనుకోవ డంతో మరింత బలహీన పడుతున్నాయి. దీనిని ప్రముఖ రచయిత, తత్వవేత్త అయిన సోవోజ్‌జిజెక్ "లెనిన్ దగ్గర్నుంచి మనం నేర్చుకోవాల్సిన గుణపాఠం ఏమిటంటే, లిబరల్ డెమోక్రసీ, సోషల్ డెమోక్రసీలను చాప చుట్టి అవతల పారేయాలి. ప్రయివేటు ఆస్తి హక్కు లేకుంటే ఈ రెండు ప్రత్యామ్నాయాలు బతికి బట్ట కట్టలేవు. నికార్సుగా మనం పెట్టుబడిదా రీ వ్యతిరేకతను ప్రదర్శించాలంటే ఈ రెండు ప్రజాస్వామ్యాల మీద ఉన్న మోజు వదిలి పెట్టాలి" అని చెప్పాడు. ఈరోజు అనేక దేశాలలో ఉదారవాద ప్రజాస్వామ్య పార్టీలే కాకుండా సోషల్ డెమోక్రటిక్ పార్టీలుగా ఉన్న వామపక్షాలు కూడా ప్రజల నుండి దూరమవుతున్నాయి. తిరస్కరించబడుతున్నాయి. నయా ఉదారవాదం బడా కార్పొరేట్ పెట్టుబడిదారీ వ్యవస్థలకు వ్యతిరేకంగా నికరంగా పోరాడు తున్న పార్టీలనే ప్రజలు ఆదరించడం జరుగుతున్నది.



సోషలిజం తప్ప మరో మార్గం లేదు

అమెరికా ఇతర సామ్రాజ్యవాద దేశాలను కలుపుకొని సృష్టించాలనుకుంటున్న ఓ నూతన ప్రపంచానికి కేంద్ర బిందువు చైనా వ్యతిరేకత, సోషలిజం వ్యతిరేకత. అందుకు పై అనేక ఉదాహరణలతో పాటు ఆర్థికంగా అత్యంత బలోపేతం అవుతున్న చైనాను దెబ్బతీయడానికి అనేక కూటములను కడుతున్నది. అంతర్జాతీయ వేదికల మీద చైనాను, క్యూబాను, ఉత్తరకొరియాను లక్ష్యంగా పెట్టుకొని దాడులు నిర్వహిస్తున్నది. అత్యధిక దేశాలు ఖండించినా, ఐక్యరాజ్యసమితి తిరస్కరించినా క్యూబాపై ఆంక్షలను ముమ్మరం చేస్తున్నది. తన మాట కాదంటే ఐక్య రాజ్యసమితినే నిర్వీర్యం చేస్తానని హెచ్చరిస్తున్నది. కానీ ప్రపంచ వ్యాప్తంగా ఈ చీకటి శక్తులకు వ్యతిరేకత కూడా క్రమంగా ఊపందు కుంటున్నది. అనేక లాటిన్ అమెరికా దేశాలలో మార్పు ఈ కాలంలో మనం గమనిస్తున్నాం. బ్రెజిల్‌లో లూలా గెలవడం, వెనిజులాలో ఎన్ని అవరోధాలు సృష్టించినా మధురో బలపడటం, దశాబ్దాల అనంతరం చిలిలో వామపక్ష ప్రభుత్వం ఏర్పడటం, ఫ్రాన్స్, ఇంగ్లాండ్ వంటి దేశాలలో విస్తృతంగా కార్మిక వర్గ, విద్యార్థి, ఉపాధ్యాయ పోరాటాలు వెల్లువెత్తడం మనం చూస్తున్నాం. అలాగే సామ్రాజ్య వాద ఒత్తిడులకు వ్యతిరేకంగా అనేక అంతర్జాతీయ కూటములు ముందుకొస్తున్నాయి. వీటన్నింటిలోనూ మనకు కనబడుతున్నది ప్రపంచం ఎదుర్కొంటున్న ఆర్థిక సాంఘిక సమస్యలు వేటినీ ఇక పెట్టుబడిదారీ వ్యవస్థ పరిష్కరించలేదని. ప్రత్యామ్నాయం అనివార్యమని క్రమంగా ప్రజలు గుర్తించడం ఆరంభమైంది. ఈ దశలో సోషలిజం తప్ప మరోమార్గం లేదని లేదన్న భావనలు తెరపైకి రావడం యాదృచ్ఛికం కాదు.

> అంతర్జాతీయ న్యాయస్థానం పాలస్తీనాలోని గాజాపై ఇజ్రాయిల్ దాడులు నిలవరించమని ఆదేశించినా, ఇజ్రాయిల్ తాను రక్షణ దాడులు మాత్రమే చేస్తున్నానని బుకాయిస్తున్నది. అందుకు సామ్రాజ్యవాద దేశాలు వంతపాడటం ఈ అంతర్జాతీయ న్యాయస్థానం అస్తిత్వాన్నే ప్రశ్నించే పరిస్థితి దాపురించింది. ఈ అంతర్జాతీయ న్యాయస్థానం కూడా సామ్రాజ్యవాదుల అదుపాజ్ఞలలోనే ఉంటుందన్న అపోహను ఈ పరిణామాలు బలపరుస్తున్నాయి. ఇంత తీవ్రమైన పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నా 'విశ్వగురువు' ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ అమెరికా ప్రాపకం కోసం ఇజ్రా యిల్‌ని బలపర్చడం, దాని యుద్ధోన్మాద, మతోన్మాద, ఫాసిస్ట్ విధానాలకు నిదర్శనం

మెయిల్ @ నవతెలంగాణ

'శ్రీమంతుడు' సినిమా మూలకథ రచయిత అయిన శరత్‌చంద్రకు నాంపల్లి కోర్టు మొదలు, సుప్రీంకోర్టు వరకు అనుకూలంగా తీర్పు రావడం ఎంతో ప్రశంసనీయం. సృజనాత్మక, కళా సాహిత్య రంగాలకు సంబంధించిన రచయితలకు, కళాకారులకు ఈ తీర్పు మరెంతో స్ఫూర్తిదాయకం. అలాగే రచయితల కథలను సునాయసంగా కాపీచేసి చిత్రంగా తెరకెక్కిస్తున్న దర్శకులకు ఇదో గుణపాఠం. 1957 కాపీ రైట్ చట్టం, సాహిత్య, రంగస్థలం, సంగీత చిత్రలేఖన, పాటలు, సినిమాటోగ్రఫీ చిత్రాలు మొదలగు సజనాత్మక రంగాలకు సంబంధించిన అంశాలను కాపీ చేయకుండా కాపాడుతోంది. స్వాతి పత్రికలో నవలగా వచ్చి ఉండటం, ఈ కథకు సినిమా రచయితల సంఘం వారిచ్చిన ధృవీకరణ పత్రం వలన సరియైన ఆధారాలు శరత్ కోర్టుకు అందజేయగలిగారు. చాలామంది రచయితల కథలు, నవలలు వారికి తెలియకుండానే, సినిమాలుగా రూపొందించి విడుదల చేసి సొమ్ము చేసుకుంటున్నారు దర్శక నిర్మాతలు. ఇదెంతో బాధాకరమైన విషయం. రచయిత ఎన్నో పుస్తకాలు చదివి, మరెంతో జ్ఞానంతో మేధోపర ఘర్షణను అనుభవించి, నిద్రలేని రాత్రులతో సహ జీవనం చేసి

'శ్రీమంతుడు'పై కోర్టుతీర్పు హర్షనీయం

ఒక రచనను సృష్టిస్తాడు. కానీ కాపీ చేసివాడికి ఇంతకష్టం అవసరముండదు. తనకదే సినిమాగా రూపొందుతుందని రచయిత ముందుగా తెలుసుకోగలిగితే, కోర్టు ద్వారా రిట్ వేసి సినిమాను నిలుపుదల చేయవచ్చు. గతంలో గరిడేపల్లికి చెందిన నారదబాబు తన నవల జోడు జ్యోతులను కాపీ చేశారని కోర్టుకు వెళ్లి, కొన్ని రోజుల పాటు నిలుపుదల చేయించారు. కథ లేదా నవలను అందులో సినిమాగా రూపొందించే ఎలిమెంట్స్ ఉన్నాయని దర్శకులు బావించినప్పుడు తమకు సమీపంలో ఉన్న రచయితలతో స్క్రీన్‌ప్లే రూపొందించి సినిమాగా మార్చి వ్యాపారం చేసుకుంటుంటారు. అన్ని సినిమాలు రచయిత చూడాలని ఏమీ లేదు. తన కథనే సినిమాగా రూపొందించారని తెలుసుకునే లోగానే, నిర్మాతకు పెట్టుబడులే కాక, లాభాలు కూడా వచ్చేస్తాయి. ఆదర్శ భావాలు కలిగిన ఒక యువకుడు గిరిజన ప్రాంతానికి వెళ్లి, జైలుపాలు కావడం అనే కథ సినిమాగా వచ్చిన మూడేళ్ల తర్వాత తాను చూశానని, అది నేను ఆంధ్రప్రభలో రాసిన కథ' అని, కీర్తిశేషులు జాతశ్రీ చెప్పి వాపోవడం ఇంకాగుర్తుంది. అదేవిధంగా అనేక కథలు, నవలలు, నాటకాలు రాసిన రచయిత, నటుడు రాసాని వెంకట్రామయ్య తన 'మట్టి బతుకులు' నవలను 'రౌడీ దర్బార్'గా రూపొందించారని, తన రచనలోని అంశాలే ఎనభైశాతంగా సినిమా రూపొందించారని చెప్పుకున్నారు. ఇలా అనేకమంది రచయితలు తమ రచనలు కాపీ రాయుళ్ల చేతిలో పడి ఆర్థికంగా, కీర్తిపరంగా నష్టపోతున్నారు. ఇలాంటి వారు తమ పుస్తకానికి ఐఎస్‌బిఎన్ నెంబర్ తీసుకోవడం సినిమా రచయితల సంఘంలో సభ్యులుగా చేరి తమ రచనను రిజిస్టర్ చేసుకోవడం వలన న్యాయం పొందే అవకాశం ఉంది. కథను కాపీ చేసిన ఒక దర్శకుని మీద ఎనిమిదేండ్లుగా కోర్టుల్లో పోరాడి, న్యాయం సాధించిన శరత్ చంద్ర ఎంతోమంది రచయితలకు మార్గదర్శకులు.

- పుప్పాల కృష్ణమూర్తి

రాముని సాకుతో 'హిందూత్వ' రాజప్రతిష్ట



మూడ్ శోభన్
9949725951

జనవరి 22న అయోధ్యలోని కొత్త స్థలంలో కొత్త దేవాలయం కాదు, కొత్తమతం ప్రారంభమైంది. ఆధ్యాత్మికతతో సంబంధం లేని, భారతీయ మత, తాత్విక సంప్రదాయంతో ఎలాంటి గుర్తింపు లేని, ఆత్మలేని, దేవుడు అని పిలవబడే వారితో సంబంధం లేని నిర్దిష్ట రాజకీయాలను ముందుకు తీసుకెళ్లే మతమిది. మతమే కాదు వారి రాముడు కూడా కొత్త. 'మా రాముడు' అంటూ నిర్మాణంలో ఉన్న భవనంలో అకాల స్థాపన పేరుతో ఈ ప్రహసనం సృష్టించారు. మతాన్ని నమ్మేవాళ్లూ, నమ్మని వాళ్లూ భారతీయ సమాజానికి ఇంతవరకూ తెలిసిన రాముడు ఈయన కాదు. ఇప్పుడు, వారిలో పెద్ద భాగం కూడా అతనిని నమ్ముతున్నారు. ఇది వాల్మీకి, తులసి, జైన, బౌద్ధ రామాయణాలతో సహా అనేక భాషల్లో రాసిన సాహిత్యంలో సృష్టించబడిన, చిత్రీకరించబడిన రాముడు కాదు. మరికొన్ని నెలల్లో జరగబోయే ఎన్నికల్లో గెలవాలని, ఆ తర్వాత తన పేరు మీద సామాజిక నిర్మాణాన్ని ఏర్పరుచుకోవాలని ఈ రామ్‌ని సృష్టించారు.అది ఎలా ఉంటుందో ఈ రామ్ సృష్టికర్తలు తమ చర్యల ద్వారా చెబుతూనే ఉన్నారు.

ఈ సంఘటనకు రెండు రోజుల ముందు, హత్య అత్యాచార దోషి గుర్మీత్ రామ్ రహీమ్ మరోసారి పెరోల్‌పై విడుదలయ్యాడు. ఈ వంశానికి చెందిన అగ్రనాయకులకు ఆశారాంతో ఉన్న సన్నిహిత సంబంధాన్ని, సుప్రీంకోర్టు అతని విడుదలను రద్దు చేసినందుకు వీడియో రికార్డ్ చేసింది. ఇటీవల పదకొండు మంది రేపిస్ట్ హంతకులు గుజరాత్ జైలుకు తిరిగొచ్చిన సంఘటనలు గొప్పగా చెప్పుకునే రామ్-రాజ్ గురించి ఒక ఆలోచన ఇవ్వడానికి సరిపోతాయి. అతనే బీజేపీ, సంఘ్‌కి చెందిన రామ్. ఇది రామ్ రాజ్ సే రాష్ట్ర కాజ్ ఉదాహరణ, ఈ కార్యక్రమం తర్వాత ఇచ్చిన ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోడీ పదే పదే "దేవ్ సే దేశ్, రామ్ సే రాష్ట్ర" అని పదేపదే చెప్పారు. సగం కట్టిన ఈ ఆలయ సముదాయాన్ని ఎన్నికలగా మార్చి "సాంప్రదాయ స్వచ్ఛత, ఆధునికత శాశ్వతత్వం" అనే బోలు వాక్యాలతో కప్పిపుచ్చడానికి ప్రయత్నించారు. తమ ప్రభుత్వాలు ఎన్ని ప్రయత్నాలు చేసినా, వేల కోట్ల రూపాయలు వెచ్చించినా, మతం ముసుగులో చేస్తున్న ఈ రాజకీయాన్ని భారత ప్రజలు గుర్తించక పోవచ్చుని, ఈ కసరత్తు మొత్తం ఇరవైయేండ్లుగా ప్రకాశిస్తున్న భారతదేశంలా ఉంటుందనే ఆందోళన ఇప్పటికీ వారి మనసులో ఉంది.

సార్వభౌమ, ప్రజాస్వామ్య, లౌకిక గణతంత్ర రాజ్య ప్రధానమంత్రి, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌కు చెందిన సర్‌సంఘచాలక్‌ల ఫ్రేమ్‌ను జనవరి 22న జాతీయ అహంకారం అని పిలవబడే ఈ వేడుకలో చూడటం నిజంగా భారత రాజకీయాల్లో కొత్త దశకు నాంది. మోడీ ప్రధాని అయిన తర్వాత 2014లో సంఘ్ చీఫ్ దసరా ప్రసంగాన్ని ప్రభుత్వ టీవీలో ప్రత్యక్ష ప్రసారం చేయడంతో మొదలైన ట్రెండ్ ఇప్పుడు ప్రధానితో ప్రత్యేక అతిథిగా చేరింది. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమానత్వానికి హామీ ఇచ్చే సమాఖ్య, సమగ్ర రాజ్యాంగం ఉన్న దేశంలో ఈ ఫొటో ఫ్రేమ్ అసాధారణమైనది. ఇది తన కార్యకలాపాల కారణంగా చాలాసార్లు నిషేధించబడిన సంస్థ అయినందున, ఇది భారతదేశం అనే భావనకు వ్యతిరేకమైనందున మాత్రమే కాదు, సంఘ్ ప్రకటిత విధానం ఈ ఆరింటిపై ఆధారపడి ఉంటుంది. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమానత్వం, సమాఖ్యవాదం, అందరినీ కలుపుకుపోవడం, రాజ్యాంగంలోనే తిరస్కరణ ఉంది.

వారు చెప్పే ప్రకారం ప్రజాస్వామ్యం ఆమోదయోగ్యం కాదు, లౌకికవాదం గురించి వినడం ఇష్టం ఉండదు, సమానత్వం, సమాఖ్య నిర్మాణం వారి ప్రకారం భారతీయ విరుద్ధం, రాజ్యాంగం పాశ్చాత్య భావన. వీటన్నింటిని అంతం చేసి మత ఆధారిత దేశాన్ని సృష్టించడమే వారి అంతిమ లక్ష్యం. ఏ మతం ఆధారంగా వారు దేశాన్ని నిర్మించాలనుకుంటున్నారో అది కూడా వారిచే స్థాపించబడిన కొత్త మతం అవుతుంది. ఈ కొత్త మతం జనవరి 22న అయోధ్యలో పవిత్రం చేయబడింది. ఈ కార్యక్రమంలో సర్‌సంఘచాలక్ హాజరు కావడం ఆకస్మికంగా లేదా ఎటువంటి కారణం లేకుండా కాదు. ఇది మొత్తం ప్రాజెక్ట్‌లో భాగం. అతను ఎన్నుకోబడని, రాజ్యాంగ విరుద్ధమైన వ్యక్తి, ప్రధానమంత్రి ఈ కార్యక్రమాన్ని పూర్తిగా అధికారిక వ్యవహారంగా చేయాలనుకుంటే, అతను భారత రాష్ట్రపతితో కలిసి ఉండవలసి ఉంటుంది. కానీ అయోధ్యలో అలా జరగలేదు. విషయం అందరికీ తెలిసిందే కదా!

మోహన్ భగవత్ మత గురువు కూడా కాదు. అప్పుడు వారు ఏ ప్రాతిపదికన అక్కడ ఉన్నారు? రాజకీయ వ్యవస్థలో సంఘ్‌ను స్థాపించడం, ఇదే ఉద్దేశ్యం - రామ్‌ని విశ్వవ్యాప్తంగా ఆమోదించే సాకుతో ఆర్ఎస్ఎస్‌ని స్థాపించే ప్రయత్నమిది. ఇది సంఘ్ ఎజెండాను మరింత ముందుకు తీసుకెళ్లడం, దీని ప్రకారం వారు రాజు కంటే రాజగురువు హోదాను సాధించాలని కోరుకున్నారు. దీంతో పాటు, రామ్ రాజ్ సే రాష్ట్ర కాజ్ విజ్ఞప్తితో 'దేవ్ సే దేశ్-రామ్ సే రాష్ట్ర' నినాదంతో మోడీ దాని పట్టికను ప్రదర్శించారు. హనుమంతుని నుండి అంకితభావం, సేవను, నిషాదు, శబరి నుండి అధీనం, ఉడుత నుండి క్రియ ప్రాధాన్యత, కర్తవ్యం పరాకాష్ఠను జటాయువు నుండి నేర్చు కోవాలని ఆయన ప్రజలకు సూచించారు. పొరపాటున దురాశ, దోపిడీ కూడబెట్టడం మానుకోవాలని మాట్లాడకుండా అంబానీ లాంటి కొత్త ప్రభువులను ముందు కూర్చోబెట్టి తనలాంటి దేశం, ప్రపంచం నిశ్చింతగా భరోసా ఇచ్చాడు.

ఇది కేవలం "సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్" నినాదాన్ని "సబ్కా మందిర్, సబ్కే రామ్"తో భర్తీ చేయడమే కాదు. ఇది బహిరంగ అవిధేయత, నిర్లక్ష్యం, రాజ్యాంగాన్ని పూర్తిగా ఉల్లంఘించే చర్య. రాష్ట్రం, మతం కచ్చితమైన విభజనను కల్పించే రాజ్యాంగం, ఏదైనా నిర్దిష్ట మతానికి ప్రోత్సాహం ఇవ్వకుండా రాష్ట్రాన్ని కచ్చితంగా నిషేధిస్తుంది, ఏ మతానికి రాజ్యాధికారం కల్పించడం పూర్తిగా నిషేధం ఆ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని, అమలు చేస్తానని ప్రమాణం చేసి రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ప్రధాని ఆ రాజ్యాం గాన్ని తుంగలో తొక్కుతూ దేశానికి దేవుణ్ణి నినాదంగా ఉపయోగిస్తున్నారు. ఒకే దేవుడు, రామ్‌రాజ్‌తో దేశం కారణాన్ని దేశం ప్రకటించింది. ఇదంతా అసంపూర్ణ సత్యంతో చాకచక్యంగా కప్పిపుచ్చడం ఇది అసత్యం కంటే ప్రమాదకరమైనది. ఇది సుప్రీంకోర్టు నిర్ణయం ప్రకారమే నిర్మిస్తున్నామని చెప్పుకుంటున్నారు. మంచి విషయమేమిటంటే, వారు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ - కనీసం ఇప్పటివరకు దేశవ్యాప్తంగా అనేకమంది సెలబ్రిటీలను ఉచ్చులో లాగేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. 55 దేశాల అధినేతల్ని ఆహ్వానించినా ఒక్కరు కూడా హాజరు కాలేదు. కానీ దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న చాలా పండళ్లు ఖాళీగా ఉన్నాయి. చెవులు చెదరగొట్టే శబ్దాలతో ప్రేక్షకుల కొరతను భర్తీ చేయడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

ఈ మొత్తం గందరగోళంలో, ఇప్పటికే తిరుగులేని అపకీర్తిని సాధించింది భారతీయ మీడియా. సంస్కృతి అని పిలవబడే గంగానదిలో ఈసారి పూర్తి భక్తితో, ప్రశ్నలు లేవనెత్తకుండా స్నానమాచరించాయి. ఆంగ్ల వార్తాపత్రికలు కూడా ప్రధాన పాయింట్ నుండి దూరంగా ఉండి రాజా బాకా వాయిస్తూ కనిపించాయి. మతతత్వానికి అతీతంగా చూడడానికి సిగ్గుపడే మీడియా వర్గాలు కూడా మతం, రాముడితోక పట్టుకుని, ప్రజా మద్దతు అని చెప్పుకునే వారి వరుసలో తలలు వంచుకుని నిలబడడం కనిపించింది.మొత్తంగా చూస్తే ప్రస్తుత పాలకులు పథకం ప్రకారం దేశంపై ఉన్మాదభరితదాడి చేస్తున్నారు. ఎదుర్కోవడానికి ఏకైక మార్గం ఏమిటంటే, ప్రజల్లోకి సత్యాన్ని తీసుకెళ్లడం, దహనమైన ప్రశ్నలకు వ్యతిరేకంగా వాటిని మరింత బలంగా లేవనెత్తడం.



> వారు చెప్పే ప్రకారం ప్రజాస్వామ్యం ఆమోదయోగ్యం కాదు, లౌకికవాదం గురించి వినడం ఇష్టం ఉండదు, సమానత్వం, సమాఖ్య నిర్మాణం వారి ప్రకారం భారతీయ విరుద్ధం, రాజ్యాంగం పాశ్చాత్య భావన. వీటన్నింటిని అంతం చేసి మత ఆధారిత దేశాన్ని సృష్టించడమే వారి అంతిమ లక్ష్యం. ఏ మతం ఆధారంగా వారు దేశాన్ని నిర్మించాలనుకుంటున్నారో అది కూడా వారిచే స్థాపించబడిన కొత్త మతం అవుతుంది. ఈ కొత్త మతం జనవరి 22న అయోధ్యలో పవిత్రం చేయబడింది. ఈ కార్యక్రమంలో సర్‌సంఘచాలక్ హాజరు కావడం ఆకస్మికంగా లేదా ఎటువంటి కారణం లేకుండా కాదు. ఇది మొత్తం ప్రాజెక్ట్‌లో భాగం.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	63,230	▲	230
22 క్యారెట్లు	58,000	▲	250
కిలో వెండి	76,000	-	---



చికెన్ ధరలు

హైదరాబాద్

బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 113
రిటైల్ (లైవ్)	రూ. 135
స్కిన్‌తో	రూ. 196
స్కిన్‌లెస్	రూ. 223

కొత్త బస్సులు కొంటాం..రిక్రూట్‌మెంట్ చేస్తాం

అనుమతుల కోసం ప్రభుత్వానికి లేఖ : టీఎస్ఆర్టీసీ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగిందనీ, దానికి అనుగుణంగా కొత్త బస్సుల్ని కొనుగోలు చేసి, కొత్త రిక్రూట్‌మెంట్లు చేపడతామని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ రిక్రూట్‌మెంట్ల అనుమతి కోసం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసామన్నారు. హైదరాబాద్ కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో బుధవారం టీఎస్ఆర్టీసీకి చెందిన 80 మంది కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్ సందడిగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్‌తో కలిసి కానిస్టేబుళ్ల గౌరవవందనం స్వీకరించి, నియామక పత్రాలు అందచేశారు. కారుణ్య నియామకం ద్వారా టీఎస్ఆర్టీసీలో ఇటీవల 80 మంది కానిస్టేబుళ్లుగా నియమితులయ్యారు. వారిలో 47 మంది పురుషులు, 33 మంది మహిళలు ఉన్నారు. హైదరాబాద్ లోని కొండాపూర్ 8వ బెటాలియన్‌లో పోలీస్ శాఖ సహకారంతో వీరందరికీ నెలరోజులు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కారుణ్య నియామకాల ద్వారా 1,700 మందికి సంస్థ ఉద్యోగ అవకాశాలు కల్పించిందనీ, తాజాగా మరో 813 మందిని నియమిస్తున్నామనీ, రెండు వారాల్లో నియామక ప్రక్రియ పూర్తి అవుతుందని తెలిపారు. కొత్తగా టీఎస్ఆర్టీసీలో చేరుతున్న కానిస్టేబుళ్లు నిబద్ధతతో పని చేస్తూ, సంస్థ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. టీఎస్ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తుందనీ, ప్రజా రవాణా ప్రాముఖ్యతను దేశానికి తెలియ జేసేలా సంస్థను తీర్చిదిద్దుతామన్నారు. టీఎస్ఆర్టీసీ ఎమ్‌డీ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ ఆర్టీసీ కానిస్టేబుల్ ఉద్యోగం అత్యంత క్రమశిక్షణతో కూడినదనీ, సంస్థలోని 50 వేల మంది సిబ్బందినీ, బస్సుల్ని కాపాడాల్సిన బాధ్యత వారిపై ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వారికి శిక్షణ ఇచ్చిన టీఎస్ఎస్పీ అదనపు డీజీపీ స్వాతి లక్రాకు కృతజ్ఞతలు తెలిపారు. శిక్షణలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన ఎమ్ శిరీష (బెస్ట్ ఆల్ రౌండర్), సంకీర్తన (బెస్ట్ ఇండోర్), శిరీష, రిత్విక్ (బెస్ట్ ఔట్ డోర్)లకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఓఓ డాక్టర్ రవీందర్, ఈడీ (అడ్మిన్) కృష్ణకాంత్, 8వ బెటాలియన్ కమాండెంట్ సన్ని, అడిషనల్ కమాండెంట్ నారాయణదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందిపై దాడులు చేస్తే కఠిన చర్యలు : ఎమ్‌డీ సజ్జనార్

తార్నాక ఆస్పత్రిలో దాడులకు గురైన సిబ్బందికి పరామర్శ



విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. దాడులు చేసిన వారిపై పోలీసు కేసులు పెట్టి హిస్టరీ షీట్లు తెరుస్తామని చెప్పారు. ఈనెల 4వ తేదీ ట్యాంక్‌బండ్‌పై వెళ్తున్న ఆర్టీసీ బస్సు కండక్టర్, డ్రైవర్‌పై ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. క్రికెట్ బ్యాట్‌తో దాడి చేయడంతో కండక్టర్‌కు చేయి విరిగింది. డ్రైవర్ గాయపడ్డారు. వీరు తార్నాక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం సజ్జనార్ తార్నాక ఆస్పత్రిలో బాధితులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలనీ, సంస్థ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కండక్టర్ రమేష్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. డ్రైవర్ షేక్ అబ్దుల్‌ను పరామర్శించారు. జరిగిన ఘటనలో తమ సిబ్బంది ఎలాంటి తప్పు చేయలేదనీ, కేవలం ఉద్దేశపూర్వకంగానే దుండగులు దాడికి పాల్పడ్డారని చెప్పారు. ఈ కేసులో నిందితులు మహ్మద్ మజీద్, మహ్మద్ ఖాసీంలను పోలీసులు అరెస్ట్ చేశారని చెప్పారు. ఎమ్‌డీ వెంట టీఎస్ఆర్టీసీ సీవోవో డాక్టర్ రవీందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కృష్ణ కాంత్, వెంకటేశ్వర్లు, తార్నాక ఆస్పత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ శైలజామూర్తి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, ఆస్పత్రి ఓఎస్డీ సైదిరెడ్డి తదితరులు ఉన్నారు.

కొత్త కాలేజీలకు పోస్టులు మంజూరు చేయండి

- సీఎం రేవంత్‌రెడ్డికి టీజీజేఎల్ఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కొత్తగా ప్రారంభమైన 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పోస్టులను మంజూరు చేయాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ (టీజీజేఎల్ఏ-475) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సీఎం ఎ రేవంత్‌రెడ్డికి బుధవారం ఆన్‌లైన్ ద్వారా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వస్కు ల శ్రీనివాస్, కొప్పిశెట్టి సురేష్ వినతిపత్రం పంపించారు. 15 కాలేజీల్లో ప్రిన్సి పాల్, బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ కళాశాలల్లో తాత్కాలికంగా విద్యార్థులకు బోధన నిర్వహిస్తున్నారని తెలిపారు. అయితే వాటికి శాశ్వత ప్రిన్సిపాల్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పోస్టులను మంజూరు చేయక పోవడంతో పూర్తిస్థాయిలో విద్యార్థుల కు న్యాయం జరగడం లేదని పేర్కొన్నారు. ప్రవేశాలు, తరగతులను బోధించ డంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోస్టుల మంజూరుకు సంబంధించిన దస్త్రం ఉన్నత విద్యాశాఖ పరిశీలనలో ఉందని పరిశీలించి వెంటనే పోస్టులను మంజూరు చేయాలని కోరారు. దానివల్ల 2024-25 విద్యా సంవత్సరంలో ఆ 15 కళాశా లల్లో విద్యార్థులు ఎక్కువ మంది చేరేందుకు అవకాశముందని పేర్కొన్నారు.

ఏపీలో జగన్‌కు ప్రతిపక్ష హౌదా కూడా రాదు

- షర్మిలపై అసత్య ప్రచారాలను ఆపండి : మాజీ శాసనసభ్యులు గోనె ప్రకాష్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై నేతల అసత్య ప్రచారాలను మానుకోవాలని మాజీ శాసన సభ్యులు గోనే ప్రకాష్‌రావు వైఎస్సార్‌సీపీ నేతలకు సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాలు, డబ్బుల కోసం సొంత చెల్లెలు అని కూడా చూడకుండా జగన్ అరాచక రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వైసీపీ శ్రేణులను ఉసి గొల్పి సోషల్ మీడియా వేదికగా నీచాతినీచంగా ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఏపీలో పాదయాత్ర చేసి జగన్ గెలుపు కోసం పాటు పడ్డ షర్మిలపై చేస్తున్న నీతిమాలిన ప్రచారాలను వెంటనే ఆపాలని హితవు పలికారు. ప్రస్తుతం ఏపీలో ఉన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తెలుగు దేశం, జనసేన, బీజేపీలు కలిసి పోటీ చేసి అధికారాన్ని హస్తగతం చేసుకుంటాయని జోస్యం చెప్పారు. ఇప్పటికైనా వైఎస్ షర్మిల విషయంలో జగన్ తన పద్దతి మార్చుకోవాలని సూచించారు.

నీలోఫర్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం

- షార్ట్ సర్క్యూట్ వల్లే.. : సూపరింటెండెంట్



నవతెలంగాణ-మెహిదీపట్నం

హైదరాబాద్ నీలోఫర్ ఆస్పత్రిలో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఆస్పత్రి మొదటి అంతస్తులోని ల్యాబ్‌లో ఒక్కసారిగా మంటలు చెల రేగాయి. దాంతో పరిసరాల్లో దట్టమైన పొగ కమ్ముకుంది. ఆస్పత్రిలోని రోగులు, పిల్లలు బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది.. ఆస్పత్రి ఆవరణకు చేరుకుని మంటలు ఆర్పింది. ఈ ఘటనపై నీలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషారాణి స్పందించారు. నీలోఫర్ పాత భవనంలోని మైక్రోబయాలజీ ల్యాబ్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల చిన్నపాటి అగ్నిప్రమాదం సంభవించిందని తెలిపారు. సిబ్బంది ఫైర్ సేఫ్టీపై శిక్షణ పొంది ఉన్నందున వేగంగా స్పందించి చర్యలు చేపట్టారన్నారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలిపారు.

వలస జీవుల తిరుగు ప్రయాణం

- స్వగ్రామాలకు చెరుకు నరికే కార్మికులు



నవతెలంగాణ- లింగంపేట్

పొట్టకూటి కోసం ఊరు.. ఇల్లు వదిలి రెండు నెలల కిందట చెరుకు నరికే పనికొచ్చిన కూలీలు తిరిగి ఇంటిదారి పట్టారు. కామారెడ్డి జిల్లాలోని అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామ సమీపంలో గల గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ వారి ఒప్పందం మేరకు చెరుకు నరికేందుకు నారాయణ్‌ఖేడ్, జహీరాబాద్, కర్నాటక రాష్ట్రంలోని పలు గ్రామాల నుంచి వలస కార్మికులు నవంబర్ నెలలో కామారెడ్డికి వచ్చారు. నారాయణ్‌ఖేడ్ డివిజన్ సిర్గాపూర్ మండలంలోని 20 గిరిజన తండాల నుంచి సుమారు 150 కుటుంబాల వరకు చెరుకు నరికే పనిలో నిమగ్నమవుతాయి. సుమారు 2000 మంది కార్మికులు వలస వచ్చి షుగర్ ఫ్యాక్టరీ పరిసరాల్లో చెరుకు నరికే పనిలో మూడు నెలలపాటు పని చేశారు. ప్రస్తుతం సీజన్ పూర్తి కావడం స్వగ్రామాలకు తిరుగు ప్రయాణం అవుతున్నారు. ఎడ్లబండ్ల మీదే వారి ప్రయాణం సాగుతుంది.

ఎయిర్‌పోర్టులాగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునర్నిర్మాణం

రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనుల పరిశీలనలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎయిర్‌పోర్టుల తరహాలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను ఆధునీకరిస్తున్నామని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. బుధవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను ఆయన పరిశీలించారు. పనుల వివరాలను రైల్వే జీఎం, ఇతర ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్లాట్ ఫామ్ 1, 10లలో మల్టీ లెవల్ కార్ పార్కింగ్ కోసం నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. రూ.715 కోట్ల విలువైన పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఓపెన్ ఫేస్ అయితే నిర్మాణం మరింత వేగంగా జరిగేదన్నారు. అయినా, రైళ్ల రాకపోకలు, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను వేగంగా చేస్తున్నారని తెలిపారు. 2025 సంవత్సరం ముగిసే సమయానికి ఎయిర్ పోర్టు తరహాలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ రూపురేఖలు మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ చేతుల మీదుగా చర్లపల్లి న్యూ టర్మినల్‌ను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రో స్టేషన్లు, బస్ స్టేషన్ల అనుసంధానం చేసేలా పనులు జరుగుతున్నాయని చెప్పారు. నాంపల్లి రైల్వే స్టేషన్‌ను రూ. 350 కోట్లతో ఆధునీకరించామనీ, కాజీపేట రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఘట్ కేసర్ -యాదాద్రికి వెళ్లే ఎమ్ఎమ్‌టీఎస్ లైన్‌ను త్వరలోనే పూర్తిచేస్తామని హామీ నిచ్చారు. కొమురవెల్లిలో కొత్తగా రైల్వేస్టేషన్ నిర్మాణానికి ఈ నెలలో శంకుస్థాపన చేస్తామన్నారు. సికింద్రాబాద్ నుంచి నడుస్తున్న వందేభారత్ రైళ్ల వందశాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయనీ, మరో రెండు ట్రైన్లు అదనంగా కావాలని రైల్వే మంత్రిని కోరామని చెప్పారు.

రెండు నెలల పారితోషికాలను విడుదల చేయాలి

- లేదంటే రేపు కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆశా వర్కర్లకు డిసెంబర్, జనవరికి సంబంధించి రెండు నెలల పెండింగ్ పారితోషికాలను వెంటనే విడుదల చేయాలనీ, సమ్మె సందర్భంగా ఆశా వర్కర్లకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయలక్ష్మి, ఆర్.నీలాదేవి డిమాండ్ చేశారు. లేదంటే శుక్రవారం కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో వైద్యారోగ్య కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పారితోషికాలు సకాలంలో అందక ఆశా వర్కర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొటున్నారని వాపోయారు. పారితోషికాలు అందకపోవడంతో ఆశాలు ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కోశాధికారి పి.గంగమణి, రాష్ట్ర నాయకులు ఎమ్.మీనా, టి.యాదమ్మ, ఎమ్.అనిత, డి.భాగ్యలక్ష్మి, బి.యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

శభాష్ ఆరెస్కే...

- పోస్టల్ వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పూణెలో జరిగిన అఖిల భారత పోస్టల్ వెయిట్ లిఫ్టింగ్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ సార్టింగ్ డివిజన్ ఉద్యోగి ఆరెస్కే యాదవ్ బంగారు పతకం సాధించారు. బుధవారం నాడాయన్ని సార్టింగ్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ టీఏవీ శర్మ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరెస్కే కృషితో డివిజన్‌కు క్రీడా గుర్తింపు తెచ్చారని ప్రశంసించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సుభానీ, అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసులుతో పాటు సార్టింగ్ డివిజన్ ఉద్యోగులు ఆరెస్కే యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రేమ జంటలను దోచుకుంటున్న ముఠా అరెస్ట్

బంగారం, సెల్‌ఫోన్లు, ఆపిల్ వాచ్, డ్రిల్లింగ్ మెషిన్ స్వాధీనం



- వివరాలు వెల్లడించిన ఎస్పీ చందనా దీప్తి

నవతెలంగాణ-నల్లగొండటౌన్

నల్లగొండ శివారులో ప్రేమజంటలను బెదిరించి సెల్‌ఫోన్లు, నగదు, బంగారు ఆభరణాలు దోపిడీ చేస్తున్న ముఠాను అరెస్టు చేసినట్టు ఎస్పీ చందనాదీప్తి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నమ్మదగిన సమాచారం మేరకు బుధవారం ఉదయం టూ టౌన్ సీఐ, ఎస్ఐ, సిబ్బంది నల్లగొండ శివారులో గల నర్సింహారెడ్డి కాలనీలో ఉన్న కుంచం చందు ఇంటిపై దాడి చేశారు. అతన్ని, అక్కడ ఉన్న కుంచం ప్రశాంత్, చింతా నాగరాజు, అన్నెపూరి లక్ష్మణ్, శివరాత్రి ముఖేష్, కుంచం రాజును అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని విచారించారు. వారు కొద్ది రోజులుగా నార్కెట్‌పల్లి- అద్దంకి హైవే దారిలో పోయే ప్రయాణీకులు, ప్రేమ జంటలను, ఖాళీ స్థలాల్లో ఏకాంతంగా గడుపుతున్న వారిని రహస్యంగా వీడియోలు, ఫొటోలు తీసేవారు. వాటిని చూపించి బాధితులను బెదిరించి నగలు, సెల్ ఫోన్లు, డబ్బులు వసూలు చేస్తుంటారు. బాధితులు వారికి భయపడి విషయం ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయేవారు. నిందితులు అలా దోపిడీ చేసిన డబ్బులను తాగుడుకు, విలాసాలకు ఖర్చు చేస్తున్నారు. ఈ ముఠా డిసెంబర్ చివరి వారంలో నార్కెట్ పల్లి- అద్దంకి హైవే పక్కన నర్సింహా రెడ్డి కాలనీకి వెళ్లేదారిలో ఓ వ్యక్తి, మహిలను బెదిరించి నగదు, అరతులం బంగారం ఉంగరం తీసుకోవడమే కాకుండా.. ఆ వ్యక్తిని తీవ్రంగా కొట్టారు.

పట్టణంలోని గొల్లగూడ శివారులోని దత్తాత్రేయ వెంచర్‌లో గెస్టహౌస్ తాళం పగుల గొట్టి రెండు టీవీలు, డ్రిల్లింగ్ మెషిన్, మూడు ఫ్యాన్లు, ఇన్వర్టర్, హోం థియేటర్, గ్యాస్‌స్టౌలను దొంగిలించారు. ఫిబ్రవరి 1న ఓ యువతి, యువకుడు కారులో వచ్చి పానగల్ హైవే పక్కన ఉన్న ఖాళీ స్థలంలో చెట్టుకింద భోజనం చేస్తుండగా వారిని బెదిరించి.. యువకున్ని కొట్టి రెండు సెల్‌ఫోన్లు, 700 నగదు దోచుకుని పారిపోయారు. చింత నాగరాజు నేరాలు చేసేటప్పుడు ఉపయోగించిన మోటార్ సైకిల్‌ను నల్లగొండ వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో దొంగతనం చేశాడు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి బంగారు ఉంగరం, రెండు సెల్ ఫోన్లు, రెండు టీవీలు, ఆపిల్ వాచ్, మూడు ఫ్యాన్లు, డ్రిల్లింగ్ మెషీన్, ఇన్వర్టర్, హోం థియేటర్, గ్యాస్ స్టౌ, మోటార్ సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీఎస్పీ లక్ష్మీనారాయణ, టూ టౌన్ సీఐ కొండల్ రెడ్డి, ఎస్ఐ నాగరాజు, సిబ్బంది బాలకోటి, శంకర్ ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో వసతులు కల్పిస్తాం

ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతాం

- త్వరలో వైద్య ఆరోగ్య శాఖలో పది వేల పోస్టుల భర్తీ : వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- హుజూర్‌నగర్‌లో వైద్యారోగ్య శాఖ అధికారులతో మంత్రుల సమీక్ష



నవతెలంగాణ-హుజూర్‌నగర్

పేదవాళ్లకు నమ్మకం కుదిరేలా.. 75 శాతం మంది పేదలు ప్రభుత్వాస్పత్రులకు వచ్చే విధంగా అన్ని రకాల వసతులు, కావాల్సిన మందులను సమకూర్చుతామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని వంద పడకల ఆస్పత్రిలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి వైద్యశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. ప్రభుత్వాస్పత్రుల్లో మరిన్ని వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తామన్నారు. సిబ్బందికి కూడా మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఆస్పత్రి విస్తరణ గురించి అధికారులతో చర్చించారు. వైద్యశాలలో డాక్టర్లు రాసిన అన్ని మందులు ఆస్పత్రిలో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వాస్పత్రిలో ఖాళీగా ఉన్న 35 డాక్టర్ పోస్టులు నింపుతామని తెలిపారు. మెడికల్ టీచింగ్ హాస్టల్‌ను మంజూరు చేస్తామన్నారు. రూ.5లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10 లక్షల వరకు పెంచామన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా 1672 వైద్యసేవలు గతంలో అందుబాటులో ఉండేవని, ప్రస్తుతం వాటిని 1800 వరకు పెంచామన్నారు. ఆస్పత్రికి వచ్చే పేషెంట్లు డైట్, శానిటేషన్ డ్రగ్స్‌పై నిత్యం మానిటరింగ్ చేయాలన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఉన్న మెడికల్ కళాశాలకు సంబంధించిన వివాదాన్ని పరిష్కరిస్తామన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో త్వరలో పది వేల ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ప్రస్తుతం రూ.487 కోట్ల ఆర్థికభారం పడుతుందన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీలు సీఎస్ఎస్ ఫండ్ ద్వారా వైద్య ఆరోగ్యశాఖకు నిధులివ్వాలని కోరారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. హుజూర్‌నగర్ ప్రభుత్వాస్పత్రిలో మౌలిక సదుపాయాలు, కావాల్సిన వస్తువుల గురించి, సౌకర్యాల గురించి నివేదిక పంపితే ప్రభుత్వం జాప్యం లేకుండా నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న పీహెచ్‌సీ సెంటర్లు, అక్కడ వైద్యం, వసతుల గురించి ఆయా పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శితోపాటు ఆరోగ్య శాఖ కమిషనర్ అజయ్, కలెక్టర్ వెంకట్రావు, డీఎంహెచ్ఓ కోటాచలం, ఆస్పత్రి సూపరింటెండెంట్ కరణ్, ఆర్ఎంఓ రవి, అదనపు జేసీ వెంకటరెడ్డి, డీఎస్పీ ప్రకాశ్‌యాదవ్, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ నాగార్జున్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, టీపీసీసీ జాయింట్ సెక్రెటరీ తన్నీరు మల్లికార్జున్, జక్కుల మల్లయ్య, పోతుల జ్ఞానయ్య, గరిడేపల్లి ఎంపీపీ పెండెం సుజాతశ్రీనివాస్, గోల మట్టయ్య పాల్గొన్నారు.

వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ నిలిపివేత

బీజేపీ ఓటమితోనే సాధ్యం

స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల జాతీయ సదస్సులో సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రజల సంపద

- అమ్మే హక్కు ప్రధాని మోడీకి లేదు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ నిలిపివేత బీజేపీ ఓటమితోనే సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం మూడేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నాడిక్కడ కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి మాట్లాడుతూ "విశాఖ స్టీల్ ప్లాంట్ దేశ సంపద. ఆ సంపదకి ప్రధాని మోడీ మేనేజర్ మాత్రమే. దేశ ప్రజలు దాని యజమానులు. ప్రజల అనుమతి లేకుండా దేశ సంపదని అమ్మే హక్కు మోడీకి లేదు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలంటే 2024 ఎన్నికల్లో మోడీని గద్దె దించాలి. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించకపోతే, వైజాగ్ స్టీల్ ప్లాంటనే కాదు, దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని కూడా కాపాడుకోలేం" అని అన్నారు. "ప్రభుత్వ రంగాన్ని, దేశ సంపదను కాపాడుకోవాలి. అదే భవిష్యత్తు తరాలకు మనం అందించేది. దేశ సంపద, ఆస్తులు ప్రజలవి. అవి ప్రజల సార్వభౌమత్వంతో ముడిపడి ఉన్నాయి. అందుకోసమే ఆ ఆస్తులను సృష్టించాం. వాటిని మోడీ ప్రభుత్వం అమ్మేయడానికి ప్రయత్నిస్తోంది. దాన్ని తిప్పికొట్టాలి" అని పిలుపునిచ్చారు. "కేంద్ర ప్రభుత్వం కేవలం రూ. ఐదు వేల కోట్లు పెట్టుబడి పెడితే, దాన్ని కార్మిక వర్గం రూ.మూడు లక్షల కోట్ల సంపదకు పెంచింది. ఆ రూ.మూడు లక్షల కోట్లు ప్రజల ఆస్తి. ప్రజల ఆస్తి, ప్రభుత్వ ఆస్తిగా ఉంటుంది. అంతేగాని దాన్ని అదానీ, అంబానీ ఆస్తిగా మార్చకూడదు" అని అన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జరిగే పోరాటానికి సీపీఐ(ఎం) మద్దతుగా ఉంటుందని, గత మూడేళ్లుగా ఆ పోరాటంలో సీపీఐ(ఎం) ముందుందని తెలిపారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో సీపీఐ పాల్గొంటుందని అన్నారు. ప్రధాని మోడీ దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ వ్యక్తులకు అమ్మేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రాజేష్ నిలోతియా మాట్లాడుతూ మోడీ సర్కార్ వైఖరిని ఖండించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని అన్నారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, స్టీల్ ప్లాంట్ అమ్మకం ఆపాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్‌ను రూ.లక్ష కోట్లతో విస్తరణకు ప్రభుత్వం యోచిస్తోందని, అయితే విస్తరించే బదులు, సెయిల్‌లో వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్ జిత్ కౌర్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణపై కార్మిక సంఘాల పోరాటం కొనసాగుతోందని అన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని ఆంధ్రప్రదేశ్ ఎంపీలు పార్లమెంట్‌లో లేవనెత్తాలని డిమాండ్ చేశారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో కూడా వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు కేటాయింపులు తగ్గించారని విమర్శించారు. పార్లమెంట్ ఉభయ సభల ఎంపీలు కేంద్రాన్ని ప్రశ్నించాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అడ్డుకుంటామని, వచ్చే ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెబుతామని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జాతీయ కార్యదర్శి సుదీప్ దత్, ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి సచ్చాజ్ రఫీక్, వైజాగ్ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, సీబీఐ మాజీ డైరెక్టర్ జెడి లక్ష్మీనారాయణ ఐద్వా కోశాధికారి ఎస్.పుణ్యవతి, ఆప్ నేత మణి నాయుడు, ప్రత్యేక హౌదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు డి.ఆదినారాయణ, ఎం.రాజశేఖర్, జె.అయోధ్య రాము తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ఎఫెక్ట్..

(మొదటిపేజీ తరువాయి)

కాళేశ్వరం అవినీతి, అక్రమాల విషయంలో రాజీపడేది లేదని సీఎం రేవంత్ నేతృత్వంలోని సర్కారు తేల్చిచెప్పింది. సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తొలి నుంచి కాళేశ్వరం పిల్లర్ల కుంగుబాటు విషయంలో ఆగ్రహంతో ఉన్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారనే కోణంలో పూర్తిస్థాయి అధ్యయనం అనంతరమే ఈ చర్యలు తీసుకోవడానికి సీఎంకు సిఫారసు చేసినట్టు తెలిసింది. గత శనివారం విజిలెన్స్ శాఖ నుంచి మధ్యంతర నివేదిక అందిన నేపథ్యంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నతాధికారులపై వేటుకు నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. తొలుత ఈఎన్సీ మురళీధర్‌రావుపై కూడా చర్యలు తీసుకోవాలనీ భావించినా, అనేక సమీకరణాల నేపథ్యంలో ఆయనే రాజీనామా చేసేలా అవకాశం ఇచ్చినట్టు తెలిసింది. సర్వీసు పూర్తయినా ఎక్స్‌టెన్షన్‌పై కొనసాగుతున్న నేపథ్యంలో రాజీనామా చేయాలని ఆదేశించినట్టు సమాచారం.

మేడిగడ్డ నిర్మాణంలో అవకతవకలు జరుగుతున్నా పట్టించుకోకుండా, ప్రభుత్వానికి రిపోర్టు చేయకుండా, ప్రాజెక్టు వాస్తవ పరిస్థితులను అంచనా వేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇన్‌ఛార్జి ఈఎన్సీ వెంకటేశ్వర్లును సర్వీసు నుంచి పక్కనపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. వెంకటేశ్వర్‌రావు నిర్మాణ సంస్థతో కుమ్మక్కయ్యారనే ఆరోపణలు, విమర్శలు గత రెండేండ్లుగా వస్తున్నాయి. ఇంతటి తీవ్రమైన చర్యలు తీసుకోవడానికి రాజీవ్‌రతన్ నేతృత్వంలోని విజిలెన్స్ బృందం ఇచ్చిన నివేదిక కారణమని సమాచారం. మొత్తం ప్రాజెక్టు అవకతవకలపై అటు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ), ఇటు విజిలెన్స్ శాఖ విచారణ చేసిన సంగతి తెలిసిందే. ఎన్‌డీఎస్‌ఏ రిపోర్టు సైతం ప్రాజెక్టుకు సంబంధించి సగానికిపైగా పిల్లర్లు పనికిరావనీ, ఇది మొత్తం ప్రాజెక్టుకే ప్రమాదమని నివేదికలో పేర్కొన్నట్టు సమాచారం. వాటిని కూల్చి మళ్లీ నిర్మించిన తర్వాతే ప్రాజెక్టును వినియోగించడంలోకి తేవాలని అభిప్రాయపడినట్టు తెలిసింది. వచ్చే వర్షాకాలం వరదను ఈ బ్యారేజీ తట్టుకునే అవకాశం లేదని కూడా నివేదికలో తెలియజేశారు. ఈ రెండు నివేదికల ఆధారంగా ప్రభుత్వం ఈ కఠిన చర్యలు తీసుకున్నట్టు సమాచారం.

ఇకపోతే ఈ తరహాలో మరికొందరు అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం లేకపోలేదని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. గురువారం నుంచి ఓటాన్ అకౌంట్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో సర్కారు చర్య సంచలనాలకు తావిస్తున్నది. అవినీతి,అక్రమాలను సహించబోమని ఈ చర్యల ద్వారా రేవంత్ ప్రభుత్వం చెప్పకనే చెప్పింది. సమావేశాల్లో నీటిపారుదల శాఖకు సంబంధించి శ్వేతపత్రం విడుదలచేసేందుకు ప్రభుత్వం సిద్ధమైన విషయం విదితమే. ఈ తరుణంలో ఆ శాఖలో దీర్ఘకాలికంగా విధులు నిర్వర్తిస్తున్న ఇంజినీర్లపై వేటు వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి పాల్పడిన, సహకరించిన అధికారులపై తీవ్రమైన చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజలకు సరైన సంకేతాలు పంపాలని భావిస్తున్నది. తాము అవినీతికి వ్యతిరేకమని చెప్పదలుచుకుంది. అలాగే వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, అప్పటి ముఖ్యమంత్రి, మంత్రులను ప్రజల్లో దోషులుగా నిలబెట్టాలనే ప్రయత్నం సైతం ఈ చర్యల వెనుక ఉన్నట్టుగా ప్రచారం జరుగుతున్నది. అలాగే కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కి ప్రాజెక్టుల అప్పగింత పేర సర్కారు వ్యతిరేక ప్రచారం చేపట్టిన బీఆర్ఎస్‌ను టార్గెట్ చేసేందుకు, నల్లగొండలో ఆందోళన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ఉపయోగపడుతుందని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నారు. రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టుపై దృష్టిసారించింది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన నేపథ్యంలో విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఇదిలావుండగా ఈఎన్సీ వెంకటేశ్వర్లు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, పంపుహౌస్‌కు సంబంధించిన పనులను పర్యవేక్షిస్తున్న సంగతి తెలిసిందే

విదేశాల్లోని విద్యార్థులు, యువతకు ప్రత్యేక హెల్ప్‌లైన్

- హైదరాబాద్ విద్యార్థి సయ్యద్ మజాహిర్‌పై దాడి కలవరపెడుతోంది : సీఎం రేవంత్‌రెడ్డి ట్వీట్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అమెరికా సహా ఇతర దేశాల్లో చదవుతున్న తెలంగాణ విద్యార్థులు, ఉపాధి పొందుతున్న యువత కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. చికాగోలో హైదరాబాద్ విద్యార్థి సయ్యద్ మజాహిర్‌పై దాడి, ఒహియోలో శ్రేయాస్‌రెడ్డి హత్య కలవర పెడుతున్నాయని పేర్కొన్నారు. తమ ఆందోళనను అమెరికాకు తెలపాలని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌ను కోరారు. తెలంగాణ ప్రజలు ఈ భూమిపై ఎక్కడ ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈమేరకు సీఎం బుధవారం ట్వీట్ చేశారు. ఉన్నత విద్య కోసం యూఎస్ వెళ్లిన హైదరాబాద్ విద్యార్థి సయ్యద్ మజాహిర్ అలీపై దాడి జరిగిన విషయం తెలిసిందే. తనపై జరిగిన దాడిని సయ్యద్ వీడియో ద్వారా వెల్లడించాడు. తనకు సాయం చేయాలని భారత ప్రభుత్వాన్ని, అమెరికాలో ఉన్న ఇండియా కాన్సులేట్‌ను అభ్యర్థించారు. తన భర్తకు సాయం చేయాలంటూ అలీ భార్య ఫాతిమా రిజ్వి జైశంకర్‌కు బుధవారం లేఖ రాశారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్ (ట్విట్టర్) ద్వారా స్పందించారు.

సీఎంను కలిసి నెదర్లాండ్ రాయబారి

భారత్‌లో నెదర్లాండ్స్ కింగ్‌డమ్ రాయబారి మెరిసా గెరార్డ్స్ బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. రెండు దేశాల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలపై ఈ సందర్భంగా వారు చర్చించారు. తెలంగాణలో వ్యవసాయ రంగం అభివృద్ధికి అపారమైన అవకాశాలున్నాయనీ, అగ్రికల్చర్ సెంటర్ ఫర్ ఎక్సెలెన్స్ ఏర్పాటు, మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగస్వామ్యం తదితర అంశాలు ఈ భేటీలో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి. ఈ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణా రావు తదితరులు పాల్గొన్నారు

తునికాకు సేకరణ టెండర్లు పిలవాలి

- 50 ఆకుల కట్టకు రూ.5 చెల్లించాలి : ఏఐకేఎమ్ఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో తునికాకు సేకరణకు సంబంధించిన టెండర్లను వెంటనే పిలవాలనీ, 50 ఆకుల కట్టకు ఐదు రూపాయలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అఖిల భారత రైతు కూలి సంఘం ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఈ మేరకు అటవీ శాఖ మంత్రి కొండా సురేఖకు, పీసీసీఎఫ్ డోబ్రియల్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన కాంట్రాక్టర్లకు రాయల్టీ రద్దును ఉపసంహరించుకోవాలని కోరారు. ఏజెన్సీలో ఆదివాసీలకు తునికాకు సేకరణ ప్రధాన ఆదాయ వనరు అని చెప్పారు. జనవరిలో పూర్తికావాల్సిన తునికాకు సేకరణ టెండర్ల ప్రక్రియ నేటికీ నిర్వహించలేదని చెప్పారు. ఆలస్యమైతే ఆకు సేకరణకు వాతావరణ పరిస్థితులు అనుకూలించవని వాపోయారు. రాయల్టీ రద్దు జీవో వల్ల ఆకు సేకరణ కూలీలకు బోనస్ రూపేణ వచ్చే కోట్లాది రూపాయల ఆదాయానికి గండి పడిందని వాపోయారు.

హైదరాబాద్‌లో డ్రోన్ పోర్ట్

పైలెట్లకు అధునాతన శిక్షణ

- ఇస్రో అధ్వర్యంలో ఏవియేషన్ అకాడమీ ఒప్పందం
- సీఎం రేవంత్‌రెడ్డితో ఇస్రో చైర్మెన్ సోమనాథ్ బృందం భేటీ
- వరంగల్ ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరించాలని ఆదేశం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఇస్రోకు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్సీ)తో తెలంగాణ స్టేట్ ఏవియేషన్ అకాడమీ డ్రోన్ పైలెట్లకు అధునాతన శిక్షణపై అవగాహన ఒప్పందం చేసుకుంది. బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఇస్రో చైర్మెన్ ఎస్ సోమనాథ్ సమక్షంలో తెలంగాణ ఏవియేషన్ అకాడమీ సీఈవో ఎస్ఎన్ రెడ్డి, ఎన్ఆర్ఎస్సీ డైరెక్టర్ ప్రకాష్ చౌహన్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ఎన్ఆర్ఎస్సీ డిప్యూటీ డైరెక్టర్ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. డ్రోన్ పైలెటింగ్, డ్రోన్ డేటా మేనేజ్ మెంట్, డేటా అనాలసిస్ పై శిక్షణ ఇస్తారు. అన్ని రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరిగిపోయిందనీ, పొలాల్లో ఎరువులు, పురుగు మందులను చల్లేందుకు రైతులు డ్రోన్లను వినియోగిస్తున్నారనీ, కొన్ని చోట్ల స్వయం సహాయక సంఘాలు డ్రోన్లను ఉపాధి మార్గంగా ఎంచుకున్నారని అధికారులు వివరించారు. ఉన్నత స్థాయి నుంచి తహసీల్దార్ల స్థాయి వరకు ప్రభుత్వ అధికారులకు కూడా డ్రోన్లపై అవగాహన కల్పించేందుకు శిక్షణ ఇవ్వాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ప్రస్తుతం ఎయిర్‌పోర్టులోనే డ్రోన్ పైలెట్లకు శిక్షణనిస్తున్నామనీ, అక్కడున్న రద్దీ దృష్ట్యా హైదరాబాద్ పరిసరాల్లో ప్రత్యేకంగా డ్రోన్ పైలెట్ల శిక్షణకు స్థలం కేటాయించాలని ఏవియేషన్ అకాడమీ అధికారులు సీఎంకు విజ్ఞప్తి చేశారు. దీనిపై సీఎం ఆరా తీసారు. డ్రోన్ పోర్టుకు అవసరమైన 20 ఎకరాల స్థలాన్ని ఫార్మా సిటీ వైపు ఉన్న స్థలాలను అన్వేషించాలని అధికారులను ఆదేశించారు. ఏవియేషన్ నిబంధనల ప్రకారం అభ్యంతరం లేని జోన్లో ఈ స్థలం కేటాయించాలని సూచించారు. అలాగే వరంగల్ ఎయిర్ పోర్ట్ పునరుద్ధరణకు తగిన చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. పాడైన పాత రన్-వేలను కొత్తగా నిర్మించటంతో పాటు అక్కడి నుంచి కమర్షియల్ ఆపరేషన్స్ నిర్వహించేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని సూచించారు. కొత్తగూడెం, భద్రాచలం పరిసర ప్రాంతాల్లోనూ ఎయిర్ పోర్టు ఏర్పాటుకు అనువుగా ఉంటుందని, అక్కడున్న అవకాశాలను పరిశీలించి ఎయిర్ పోర్టు అథారిటీతో సంప్రదింపులు జరపాలని సూచించారు.

15రోజుల్లో 15 వేల పోలీసు ఉద్యోగాలు భర్తీ

(మొదటిపేజీ తరువాయి)

రకాలుగా ఆదుకుంటామన్నారు. హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగరేణిలో 441 మందికి కారుణ్య నియామక పత్రాలను అందజేసారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రజాస్వామ్య స్పూర్తికి నిదర్శనంగా, అంబేద్కర్ విగ్రహ సాక్షిగా నియామక పత్రాలను అందజేస్తున్నామని చెప్పారు.తెలంగాణ సాధనలో సింగరేణి కార్మికుల పాత్రను ఎవరూ తగ్గించలేరని అన్నారు.గత ప్రభుత్వం సింగరేణిని ఖాయిలా పడేలా చేసిందనీ, కేంద్ర ప్రభుత్వం కూడా ఆ సంస్థకు అనేక అడ్డంకులు సృష్టించిందని తెలిపారు.గత ఎన్నికల్లో సింగరేణి ప్రాంతం కాంగ్రెస్‌కు అండగా నిలిచి ప్రజా ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించిందని గుర్తుచేశారు.పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘానికి సింగరేణి ఎన్నికల్లో కేవలం మూడు శాతం ఓట్లు మాత్రమే వచ్చాయని చెప్పారు. సింగరేణిలో 80 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని ఇటివలే ఆదేశాలిచ్చామని తెలిపారు. సింగరేణి ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించే అంశంపై చర్చించి, సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.అలాగే కారుణ్య నియామకాల వయసు సడలింపు అంశాన్ని కూడా పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ప్రేమ్‌సాగర్ రావు, గడ్డం వివేక్, గడ్డం వినోద్, కోవా లక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి,సింగరేణి ఎమ్‌డీ బలరాంనాయక్, ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి

- మ్యానిఫెస్టో అంశాల్ని బడ్జెట్ సమావేశాల్లో అమల్లోకి తేవాలి
- ప్రభుత్వానికి టీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎన్నికల సందర్భంగా ఆర్టీసీ కార్మికులకు సంబంధించి కాంగ్రెస్‌పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన అంశాలను ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో చర్చించి, అమల్లోకి తేవాలని టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.ఈ మేరకు ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్‌రావు బుధవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీన ప్రక్రియను పూర్తి చేస్తామనీ, 2017, 2021 సంవత్సరాల వేతన ఒప్పందాలు చేసి, బకాయిలతో సహా చెల్లిస్తామనీ, సంస్థలో కార్మిక సంఘాల కార్యకలాపాలను అను మతిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విషయాలను వారు ప్రస్తావించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆర్టీసీకార్మికులు ఎన్నో నమ్మకాలు, విశ్వాసం పెట్టుకు న్నారనీ, వాటిని ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో చర్చించి, స్పష్టమైన హామీలు ఇవ్వాలని కోరారు. మహాలక్ష్మి స్కీం అమల్లో రోజుకి రూ. 12 కోట్ల మేరకు జీరో టిక్కెట్లు ఇస్తున్నారనీ, సెస్‌లు, బస్‌పాస్‌ల రూపంలో కోల్పోతున్న మహిళల వాటా దాదాపు రూ.80 కోట్లు వుంటుందని తెలిపారు. ఆర్టీసీకి నెలకు రూ.440 కోట్ల వరకే నగదు వస్తున్నదనీ, ప్రభుత్వ జీఓ నెం.41/2023లో పేర్కొన్నట్టు రాష్ట్ర వార్షిక బడ్జెట్లో రూ.5,280 కోట్లతో పాటు మహాలక్ష్మి, ఇతర రాయితీల క్రింద మరో రూ.500 కోట్లు బడ్జెట్లో కేటాయించాలనీ, నూతన బస్సుల కొనుగోలుకు బడ్జెట్ సపోర్టు ఇవ్వాలని కోరారు. ఆర్టీసీ కార్మికులు 2013 నాటి జీతాలతోనే కాలం వెళ్లదీస్తున్నారనీ, గడచిన పదేండ్లలో ఒక్క ఆర్థిక సమస్య కూడా పరిష్కారం కాలేదని తెలిపారు. సీసీఎస్ మూసివేత వైపు నెట్టబడుతున్నదనీ, పీఎఫ్ ట్రస్ట్‌కు యాజమాన్యం డబ్బులు చెల్లించనందున హయ్యర్ పెన్షన్ కోసం రావలసిన డిమాండ్ నోటీసులు రావడం లేదని వివరించారు. 2013 వేతన ఒప్పందం బకాయిలు ఇప్పటికీ చెల్లించ లేదన్నారు. 173 నెలల డీఏ బకాయిలు ఉన్నాయని తెలిపారు. ఆర్టీసీ అభివృద్ధికి 2024-25 వార్షిక బడ్జెట్లో రెండు శాతం నిధులు కేటాయించాలనీ, కార్మికుల ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం వన్ టైమ్ సెటిల్‌మెంట్ క్రింద నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

(మొదటిపేజీ తరువాయి)

నేటి నుంచి సభాపర్వం

ఉభయ సభల్లో ఓటాన్ అకౌంట్ పద్దును ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. శాసనసభలో డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క, మండలిలో శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బడ్జెట్‌ను ప్రవేశపెడతారని సమాచారం. ఆదివారం ఉభయ సభలకు సెలవును ప్రకటించి, సోమవారం నుంచి బడ్జెట్‌పై ప్రభుత్వం చర్చను చేపట్టనుంది. బీఆర్ఎస్ హయాంలో సాగునీటి రంగంలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందంటూ రేవంత్ సర్కార్ ఆరోపిస్తున్న నేపథ్యంలో... ఆ శాఖపై ప్రభుత్వం అసెంబ్లీలో ప్రత్యేకంగా శ్వేతపత్రాన్ని విడుదల చేయనున్నట్టు తెలిసింది. కులగణన చేపట్టేందుకు రాష్ట్ర క్యాబినెట్ అంగీకరించిన క్రమంలో ఆ అంశంపై కూడా సభలో చర్చను చేపట్టనున్నారు. ఆరు గ్యారెంటీల్లో కీలకమైన 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలను లోక్‌సభ ఎన్నికల్లోపే అమలు చేయాలని సీఎం రేవంత్ భావిస్తున్నారు. అందువల్ల ఆ రెండింటిపై అసెంబ్లీలో చర్చించి, తుది నిర్ణయాన్ని ప్రభుత్వం ప్రకటించనుంది. వీటన్నింటిపై సమగ్రంగా చర్చించేందుకు వీలుగా ఈనెల 17 వరకూ అసెంబ్లీని నిర్వహించాలని సర్కారు భావిస్తోంది. ఇందుకు సంబంధించి గురువారం నిర్వహించబోయే సభా వ్యవహారాల కమిటీ (బీఏసీ)లో తుది నిర్ణయం తీసుకోనున్నారు.

నేడు కేసీఆర్ రాక అనుమానమే...?

బీఆర్ఎస్ అధ్యక్షుడు, ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్... తొలి రోజైన గురువారం అసెంబ్లీకి వస్తారా? లేదా..? అనే విషయమై స్పష్టత లేకపోవటం గమనార్హం. గవర్నర్ ప్రసంగంతోపాటు, ఆమె ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే రోజు (శుక్రవారం) కూడా ఆయన సభకు దాదాపు రాకపోవచ్చని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రతిపాదించే శనివారం నుంచి ఆయన అసెంబ్లీకి కచ్చితంగా వస్తారని ఆ పార్టీకి చెందిన ఓ సీనియర్ నేత తెలిపారు. కృష్ణా నదీ జలాలకు సంబంధించిన అంశాలపై ఈనెల 13న గులాబీ పార్టీ ఆధ్వర్యంలో నల్లగొండలో బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో కేసీఆర్ ఆ రోజు అక్కడికి వెళ్లనున్నారు. అందువల్ల 13న కూడా ఆయన సభకు డుమ్మా కొట్టనున్నారు. ఇదే సమయంలో బడ్జెట్‌పై చర్చ, నీటి పారుదల శాఖపై శ్వేతపత్రం సమయంలో ఆయన సభలోనే ఉంటారని తెలిసింది. పరిపాలనలో అనుభవమున్న బీఆర్ఎస్ అధినేత... ఆ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ఇప్పటికే 'స్క్రిప్ట్' రెడీ చేసుకున్నట్టు వినికిడి.

తగ్గేదేలే అంటున్న రేవంత్...

మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ సైతం... కారు పార్టీనీ, ఆ పార్టీ బాస్ కేసీఆర్‌ను ఇరుకున పెట్టేందుకు తన అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకున్నట్టు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో శాసనసభలో గులాబీ దళానిదే పై చేయి అయ్యింది. హస్తం పార్టీ ఎమ్మెల్యేల సంఖ్యను ఆరుకే పరిమితం చేయటం, అప్పటి ప్రతిపక్ష నేత భట్టి విక్రమార్కకు చాలినంత సమయమివ్వకపోవటం, కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో వాగ్ధాటిగల నేత లేకపోవటం తదితరాంశాలను సొమ్ము చేసుకున్న బీఆర్ఎస్... అసెంబ్లీని వన్ సైడ్‌గా నడిపించింది. కానీ ఇప్పుడు ఆ సీన్ లేదు. తమ మంత్రులు, ఎమ్మెల్యేల్లో వాగ్బాణాలు విసిరే వారు లేకపోయినా...సీఎం రేవంత్ 'తనదైన శైలి'లో ఒంటిచేత్తో బీఆర్ఎస్‌ను ఢీ కొడతారని అధికార పార్టీ చెబుతోంది. విశ్లేషణలు, సామెతలు, సెటైర్లతో ఆయన ప్రధాన ప్రతిపక్షాన్ని సమర్థవంతంగా ఎదుర్కొంటారని ఆ పార్టీ ధీమా వ్యక్తం చేస్తోంది. మొత్తం మీద 'ఈ అసెంబ్లీ సమావేశాలు చాలా హాట్ గురూ...' అనే రీతిలో సభ కొనసాగనుందని చెప్పక తప్పదు.

తప్పు చేసిన వారే భయపడతారు

- మాజీ సీఎం కేసీఆర్ కొత్త నాటకానికి తెర
- పార్లమెంటు ఎన్నికల తర్వాత 'కారు' ఖాళీ :మంత్రి జూపల్లి వ్యాఖ్యలు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తప్పు చేసిన వారే భయపడతారని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. అందుకే పార్లమెంట్ ఎన్నికల సమయంలో మాజీ సీఎం కేసీఆర్ కొత్త నాటకానికి తెర లేపారని విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సీడబ్ల్యూసీ సభ్యులు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, అనిరుధ్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి మంత్రి విలేకర్లతో మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను తిరస్కరించారని గుర్తు చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ ఒక్క ఎంపీ స్థానాన్ని కూడా గెలిపించుకునే పరిస్థితి లేదని నొక్కి చెప్పారు. ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు వరుస కట్టి కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారని చెప్పారు. ఈ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ ఖాళీ కావడం ఖాయమన్నారు. ఎన్నికల్లో తన పరువు కాపాడుకునేందుకు కేఆర్ఎంబీ పేరు చెప్పి కొత్త రాజకీయ డ్రామాకు తెరలేపారని విమర్శించారు. నీళ్ల విషయంలో మన రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతున్నదన్నారు. అటు ఏపీ ప్రభుత్వంతో పోరాటం చేయడంగానీ, ఇటు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడం గానీ కేసీఆర్ విఫలమైందని విమర్శించారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే ఉద్యమించాల్సింది పోయి కేంద్రంతో చెట్టా పట్టాల్ వేసుకుని తిరిగారని ఎద్దేవా చేశారు. మూడు వ్యవసాయ చట్టాలు, జీఎస్టీ, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో కూడా బీజేపీ సర్కారుకు బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిందన్నారు. నీటి వాటాల్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతుంటే, కేంద్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ సర్కారు ఒత్తిడి తేవాల్సింది పోయి మోకారిల్లిందని గుర్తుచేశారు.

ఉమ్మడి రాష్ట్రంలోని కృష్ణా బేసిన్‌లో తెలంగాణ పరివాహక ప్రాంతం 68.5 శాతమని తెలిపారు. సాధారణంగా నీటి కేటాయింపులు పరివాహక ప్రాంతం, కరువు నేలలు, జనాభా, సాగుయోగ్యమైన భూముల వంటి అంశాల ఆధారంగా జరుగుతాయని చెప్పారు. అందుకనుగుణంగా రాష్ట్రానికి 551 టీఎంసీలు, ఏపీకీ 260 టీఎంసీల కృష్ణా జలాలను పంచేలా డిమాండ్ చేయాల్సిందన్నారు. కేవలం రాష్ట్రానికి 299 టీఎంసీలు, ఏపీకు 512 టీఎంసీలకు ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. పదేండ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ సర్కారు కేవలం 299 టీఎంసీల నీటి వాటాను వాడుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోవడంతో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ఆరోపించారు. సాగర్ ప్రాజెక్టులో 2013-14కు ముందు దాదాపుగా 150 టీఎంసీలకు పైగా నీటిని రాష్ట్రం వాడుకుంటే, రాష్ట్రం వచ్చాక సగటున 85 టీఎంసీలను మాత్రం వాడుకుని రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ సర్కారు పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు ద్వారా 34 టీఎంసీలు వాడుకోవాల్సింది పోయి 100 టీఎంసీలకు పైగా కృష్ణానదీ జలాలను ఇతర బేసిన్లకు తరలించుకుపోతే, సర్కారు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించిందని విమర్శించారు. గెజిట్ నోటిఫికేషన్ ద్వారా కేఆర్ఎంబీపై కేంద్ర ప్రభుత్వానికి సర్వాధికారాలు కట్టబెట్టినప్పుడు కేసీఆర్ నోరు మెదపలేదని విమర్శించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లోని ఆయకట్టుకు సాగునీటిని అందించలేకపోయారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం పని చేస్తుందనీ, ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించేందుకు ఒప్పుకోలేదని చెప్పారు. భవిష్యత్తులో కూడా ప్రభుత్వం అంగీకరించబోమని మంత్రి స్పష్టం చేశారు.

నిబంధనల మేరకే ఇసుక తరలింపు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రభుత్వ నిబంధనల మేరకే జిల్లాలో ఇసుక తవ్వకాలు, తరలింపు జరుగుతున్నాయని తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్ఎమ్‌డీసీఎల్) జనరల్ మేనేజర్ (ఎస్ అండ్ ఎమ్) తెలిపారు. ములుగు జిల్లా కలెక్టర్ మరియు డిస్ట్రిక్ట్ లెవల్ శాండ్ కమిటీ (డీఎల్ఎస్సీ) అనుమతులతోనే టీఎస్ఎమ్‌డీసీ ధర్మవరం, అయ్యవారిపేట శాండ్ రీచ్‌ల్లో గిరిజన శాండ్ సొసైటీల సహకారంతో మట్టి తవ్వకాలు చేపడుతున్నదని వివరించారు. నవతెలంగాణలో ఈనెల 7వ తేదీ 'అనుమతి ఒకచోట తవ్వకాలు ఒకచోట' శీర్షికతో ప్రచురితమైన కథనంలో వాస్తవం లేదని పేర్కొన్నారు. గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇచ్చాక, పర్యావరణ అనుమతులు తీసుకొనే తవ్వకాలు చేపడుతున్నామని వివరించారు. ఎక్కడా ఓవర్ లోడింగ్ జరగట్లేదనీ, చెక్ పోస్టుల్లో పట్టుబడితే భారీ జరిమానాలతో పాటు అగ్రిమెంట్ కూడా రద్దు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఒప్పందంలో పేర్కొన్న ప్రాంతాల్లోనే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని వివరించారు.

దరఖాస్తుల వడపోత పూర్తి

- సీల్డ్ కవర్‌లో కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీకి అందజేత

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎంపీ టికెట్ల కోసం కాంగ్రెస్ పార్టీకి అందిన దరఖాస్తుల వడపోత పూర్తయింది. కాంగ్రెస్ ప్రదేశ్ ఎన్నికల కమిటీ ప్రతి సభ్యుడు ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి చెందిన ముగ్గురిని ఎంపిక చేసి ఆ జాబితాను సీల్డ్ కవర్‌లో స్క్రీనింగ్ కమిటికి బుధవారం అందజేశారు. ఈనెల 19న ఆ కమిటీ మరోసారి సమావేశాన్ని నిర్వహించి, కొన్ని పేర్లను ఎంపిక చేసి సీల్డ్ కవర్‌లో ఢిల్లీకి పంపనుంది. ఇప్పటికే స్క్రీనింగ్ కమిటీ సభ్యులు ప్రతి పేరును పరిశీలించనున్నారు. ఏఐసీసీ ఇచ్చిన ఆదేశాలను తూ.చ తప్పకుండా పాటిస్తామని స్క్రీనింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో కొంత మంది అభ్యర్థులు తమ పేరు సిఫార్సు చేయాలంటూ పీఈసీ సభ్యులను కోరుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన 17 పార్లమెంట్ నియోజకవర్గాలకు 309 దరఖాస్తులు వచ్చిన విషయం తెలిసిందే.

ఆరు నూరైనా సభ నిర్వహిస్తాం

- రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి మాకు లెక్క కాదు
- కేసీఆర్ సభాస్థలాన్ని పరిశీలించిన మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి
- సభ అనుమతి కోసం ఎస్పీని కలిసిన నాయకులు



నవతెలంగాణ-నల్లగొండటౌన్

"ఆరు నూరైనా నల్లగొండలో సభ నిర్వహించి తీరుతాం..తెలంగాణ రైతాంగ హక్కుల సాధనకు పేగులు తెగే దాకా కొట్లాడుతాం.. పెద్ద పెద్ద రాకాసుల్లాంటోళ్లతోనే కొట్లాడినోళ్లం.. ఈ చిన్న రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి మాకు లెక్క కాదు" అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. ఈనెల 13న నల్లగొండలో నిర్వహించనున్న కేసీఆర్ బహిరంగ సభ ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పోలీస్ యాక్ట్‌లు, నిర్బంధాలు, సంకెళ్లు తమకు కొత్త కాదు.. తాము ఫైటర్స్‌మి అని అన్నారు. కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పజెప్పిన కాంగ్రెస్ నాయకుల భాగోతం అంతా బట్టబయలు చేస్తామన్నారు. సాగర్ ఆయకట్టు రైతాంగం మనోవేదనకు గురవుతోందని, చేజేతులా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పజెప్పిన నీచులు కాంగ్రెస్ వాళ్లు అని విమర్శించారు. మళ్లీ ఎదురు దాడి చేస్తూ సన్నాయినొక్కులు నొక్కుతిన్నారన్నారు. కేంద్రం నుంచి ఏదో ఆశించే కాంగ్రెస్ వాళ్లు ప్రాజెక్టులను అప్పజెప్పారని ఆరోపించారు. సాగర్ డ్యామ్‌పై కేంద్ర బలగాలు మోహరించాయని కాలు కూడా పెట్టనివ్వడం లేదని అన్నారు. ఉత్తమ్ ఇరిగేషన్ మంత్రిగా అవగాహన లేదని, కోమటిరెడ్డికి మతిస్థిమితం లేదని విమర్శించారు. పోలీసులతో రాజ్యం నడపాలని చూస్తే పతనం తప్పదని, పోలీసులను అడ్డుపెట్టుకుని నాటకాలు ఆడితే ప్రజలు ఉరికించి కొడతారని హెచ్చరించారు. అనంతరం ఈనెల 13వ తేదీన భారీ బహిరంగ సభకు అనుమతి కోరుతూ.. జిల్లా ఎస్పీ చందన దీప్తిని కలిశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్రకుమార్ నాయక్, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, సభ సమన్వయకర్త రవీంద్ర సింగ్, నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్, మందడి సైదిరెడ్డి రెడ్డి, మాలే శరణ్యరెడ్డి తదితరులు ఉన్నారు.

వైద్యారోగ్యశాఖలో డిప్యూటేషన్ల రద్దు సరికాదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్యశాఖలో వర్క్ ఆర్డర్లు, డిప్యూటేషన్లను ఏకపక్షంగా రద్దు చేయడం సరికాదని వివిధ కార్మిక సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ మేరకు తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి(సీఐటీయూ) యాదా నాయక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ నెహ్రూ నాయక్, మాస్ మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పు ప్రసాద్ బుధవారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. జీవో 317 ద్వారా ఉద్యోగస్తులందరూ వివిధ జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న నేపథ్యంలో పిల్లలు ఒకచోట కుటుంబం మరోచోట ఉంటూ చాల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గత ఆరేండ్లుగా సాధారణ బదిలీలు లేకపోవడం వల్ల వర్క్ ఆర్డర్లు పొంది తమకు అనుకూలమైన స్థానాల్లో పనిచేస్తున్నారనీ, వీరిలో కొంతమంది దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు కూడా ఉన్నారని తెలిపారు. ఒక్కరోజు కూడా సమయం ఇవ్వకుండా విద్యాసంవత్సరం మధ్యలో ఇలాంటి ఉత్తర్వులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తమ సమస్యలను సానుకూలంగా పరిశీలించి తగు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : కార్పొరేటర్



నవతెలంగాణ - చైతన్యపురి

చైతన్యపురి డివిజన్‌లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ రంగా నరసింహా గుప్తా అన్నారు. చైతన్యపురి డివిజన్‌లోని గణేశపురి కాలనీలో ఉన్న వివిధ సమస్యలు, పనులను కార్పొరేటర్ బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండాకాలం సమీపిస్తున్నందున పనులను త్వరగా ప్రారంభించి, పూర్తిచేస్తే వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుందన్నారు. ఇప్పటికైనా పనులు త్వరగా చేయాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజనీర్ ఏఈ పార్వతి, ఇనిస్పెక్టర్ సాయి, వాటర్ వర్క్స్ ఇనిస్పెక్టర్ సురేందర్, ఇంచార్జి శ్రీకాంత్ , జవాన్ మహేష్ , అజయ్, సత్యం, కాలనీ వాసులు కృష్ణ గౌడ్, యదన్న , అశోక్, జైహింద్ , వెంకటేష్ , ప్రవీణ్, శ్రీనివాస్, ప్రకాష్ , సత్యం, కమల్ పాల్గొన్నారు.

కార్పొరేటర్‌ను కలసిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ అధినేత



నవతెలంగాణ - నాగోల్

నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్ర నాథ్ యాదవ్‌ను ఆమె నివాసంలో బుధవారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత మల్కా కొమరయ్య మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం కార్పొరేటర్ నివాసంలో మల్కా కొమరయ్యతో కలిసి కార్పొరేటర్ అల్పాహారాన్ని తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, వస్పరి మల్లేష్, బుద్ధ బాలకృష్ణ గౌడ్, దశరథ సాగర్, రావుల శ్రీనివాస్ గౌడ్, చంద్రశేఖర గుప్తా, మహేష్ శెట్టి, శివరాములు, పలువురు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం కోసం కృషి



- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ-బడంగ్ పేట్

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో తాగునీటి సౌకర్యం కల్పించడం కోసం కృషి చేస్తున్నానని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ శ్రీ బాలాజీ టౌన్ షిప్ కాలనీలో తాగునీటి సరఫరాను బుధవారం స్థానిక కార్పొరేటర్ బి.మనోహర్ తో కలిసి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు మౌలిక సదుపాయాల కల్పన కోసం ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు బండారి మనోహర్, నేనావత్ బాలు నాయక్, నాయకులు ఎర్ర జైహింద్, పన్నాల రాజేందర్ రెడ్డి, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

సెవెన్ సీటర్స్ ఆటోలకు సంతోష్‌నగర్ వరకు అనుమతివ్వాలి

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



నవతెలంగాణ - ఎల్బీనగర్

సెవెన్ సీటర్స్ ఆటోలను సంతోష్ నగర్ వరకు నడిపేందుకు అనుమతి ఇవ్వాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. కర్మన్ ఘాట్ కొత్తకాపు యాదవ రెడ్డి గార్డెన్స్ నందు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో సెవెన్ సీటర్స్, ట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి సంతోష్ నగర్, ఎల్బీనగర్ ట్రాఫిక్ ఏసీపీ అధికారులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా సెవెన్ సీటర్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ప్రయాణికులెవరూ మా ఆటోలు ఎక్కడం లేదని తెలిపారు. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం వలన మా జీవితాలు దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కావున మీరే మా యందు దయ తలచి మమ్మల్ని ఆదుకోవాలని కోరారు. తర్వాత ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ నోఎంట్రీ విధానం ఎత్తివేయాలని కోరారు. స్పందించిన అధికారులు మాట్లాడుతూ మీ సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి.. మీకు తప్పకుండా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. అలాగే మీరు కూడా సీరియల్ గా ఒకదాని వెంట ఒకటిగా ఆటోలు పెట్టుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రజలు సౌకర్యవంతమైన ప్రయాణం చేయాలనే ఉద్దేశంతో ఈనిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. మీ మీద మాకు ఎలాంటి కోపాలు లేవన్నారు. ప్రతి ఒక్కరు క్రమ శిక్షణ పాటిస్తూ, యూనిఫామ్ ధరించి విధులు నిర్వహించాలని సూచించారు.రాంగ్ రూట్, తాగి నడపడం వంటివి చేయకూడదని హెచ్చరించారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సూచనల మేరకు మీకు త్వరలోనే అనుమతులు ఇప్పించడం జరుగుతుందన్నారు. కావున మీలో మీరు మాట్లాడుకొని ఆటోలు ప్రణాళికబద్ధంగా పెట్టు కుంటామని ఒప్పందం చేసుకోవాలని సూచించారు.

అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పోలీస్ ఉన్నత అధికారుల సూచనలు పాటిస్తూ, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఆటోలు నడుపుకోవాలన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల మీద దృష్టి కేటాయించాలని కోరారు. అలాగే ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు కూడా ఒకసారి మాట్లాడుకోవాలని, ట్రాఫిక్ పోలీస్ అధికారులకు ట్రాఫిక్ విషయంలో ఇబ్బందులు కల్గించకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లింగోజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు, ఎల్బీనగర్, సంతోష్ నగర్ ఏసీపీలు నవీన్ రెడ్డి, సత్యనారాయణ, పలువురు ట్రాఫిక్ సీఐలు నర్సింగ్ రావు, నర్సింహ నాయక్, సెవెన్ సీటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సంతు యాదవ్, ఉపాధ్యక్షులు ఖాన్ పాషా, ట్రాక్టర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు దుర్గయ్య, అశోక్, అధ్యక్షులు మహేష్, ఉపాధ్యక్షులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఆలయ నిర్మాణానికి సాయం అందించాలి'



నవతెలంగాణ-బడంగ్ పేట్

ఆలయ నిర్మాణానికి దాతలు, భక్తులు సహాయ సహకారాలు అందించాలని దేవాలయ కమిటీ చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి కోరారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలో అభయ హనుమాన్ దేవాలయ నూతన గోపుర నిర్మాణానికి బుధవారం కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు చేసి పనులను ప్రారంభించారు. దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందిస్తే ఇంకా పనులు వేగవంతంగా జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాదర్ గుల్ గ్రామ ప్రజలు, భక్తులు, వేద పండితులు పాల్గొన్నారు.

డ్రయినేజీ పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

కుంట్లూర్ 20వ వార్డులోని శ్రీనగర్ కాలనీలో డ్రైనేజీ పనులకు వైస్ చైర్ పర్సన్ చామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డితో కలిసి కౌన్సిలర్ జోర్క శ్రీరాములు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో వార్డు అభివృద్ధి కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులతో వార్డులో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రవీందర్ రెడ్డి, నాయకులు కొండల్ గౌడ్, సురేష్, లింగం, శ్రీనివాస్ గౌడ్, మచ్చ రెడ్డి, శంకర్ యాదవ్, చాడ బాలకృష్ణ, అంజయ్య యాదవ్, శ్రీనగర్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు

- ప్రొఫెసర్ కోదండరాం



నవతెలంగాణ - చైతన్యపురి

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి ఇచ్చిన హామీ మేరకు త్వరలో నోటిఫికేషన్లు వెలబడతాయని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని రామయ్య కోచింగ్ సెంటర్ డైరెక్టర్ సిరికొండ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అధ్యాపక బృందం, సిబ్బంది బుధవారం కోదండరాంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నోటిఫికేషన్లు రావడమే తక్కువని, అందులోనే లీకేజీలు, కోర్టు కేసులతో విద్యార్థులు చాలా వారి విలువైన సమయాన్ని కోల్పోయారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జాగ్రత్తలు తీసుకుంటూ.. సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తుందని అన్నారు. ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులు సమయం వృధా చేసుకోకుండా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామయ్య కోచింగ్ సెంటర్ సిబ్బంది శ్రీనివాస్, గోపి, రాజ, మార్కండేయ, పరమేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వ
ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి'



నవతెలంగాణ - ధూల్ పేట్

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ సౌత్ జిల్లా అధ్యక్షురాలు ఎం మీనా అన్నారు. ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మె, పారిశ్రామిక బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ చార్మినార్ వద్ద బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేండ్లు అయినా ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. రైతాంగ, కార్మిక, వర్గ ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్రం..భారాలు మోపిందన్నారు. అంతేకాదు ప్రతి ఏడాది ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి, నేడు ఉద్యోగ కల్పన పడిపోయే స్థితి ఏర్పడిందన్నారు. దీంతో నిరుద్యోగం గత 50 ఏండ్ల గరిష్ట స్థాయికి చేరిందన్నారు. శ్రామికుల వేతనాలు 20శాతం తగ్గిపోయాయన్నారు. ధరలను నియంత్రిస్తామని వాగ్దానం చేసిన కేంద్ర ప్రభుత్వం వారి హయంలోనే ధరలను కనివిని ఎరగని రీతిలో 30 నుండి 56శాతం వరకు పెంచిందన్నారు. పెట్రోల్ ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం పన్నుల వాటాను పెంచిందన్నారు. స్విస్ బ్యాంకుల నుండి నల్లధనాన్ని వెనక్కి తెచ్చి.. పేదవారి బ్యాంక్ ఖాతాల్లో రూ.15లక్షల డిపాజిట్ చేస్తామన్న మాటలను మర్చిపోయారని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలు, సహజ వనరులను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల పరం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 16న నిర్వహించనున్న గ్రామీణ బంద్‌లో యావత్తు కార్మిక లోకం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబర్ ఖాన్, యాకూబ్, హాజీ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

ఈ నెల 16న జరిగే ఆల్ ఇండియా ఆల్ ట్రేడ్ యూనియన్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ రవాణా రంగం హైదరాబాద్ సౌత్ జిల్లా ఆధ్వర్యంలో బుధవారం ఆటో డ్రైవర్లతో కలిసి పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆల్ ట్రేడ్ యూనియన్ సౌత్ జిల్లా రవాణా రంగా కార్యదర్శి ఎల్. కోటయ్య మాట్లాడుతూ..కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఈ మధ్యకాలంలో రవాణా రంగంలో తీసుకువచ్చిన ప్రమాదకరమైన చట్టాలతో ఆటో రంగంలో పనిచేస్తున్న ఎంతోమంది డ్రైవర్లకు ఇబ్బందికరమైన పరిస్థితులు దాపురించాయన్నారు. ఇప్పటికైనా రవాణా రంగ కార్మికులను ఇబ్బందుల పాలు చేసే చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అందులో భాగంగానే ఈ నెల 16న దేశవ్యాప్తంగా జరుగుతున్న మజ్దూర్, కిసాన్ బంద్‌లో ఆటో డ్రైవర్ల అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రవాణా రంగం సౌత్ జిల్లా అధ్యక్షులు అలీ అబ్బాస్ డిమాండ్ చేశారు. ఈ నెల 16న తలపెట్టినటువంటి ఆల్ ఇండియా మజ్దూర్ కిసాన్ సంగ్, జాయింట్ యాక్షన్ బంద్‌లో డ్రైవర్లందరూ పాల్గొనాలని పిలుపు నిచ్చారు. రెంట్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు అశ్వాకుల్లా ఖాన్, అబిడ్స్ సెంటర్లో ఆల్ డ్రైవర్స్ ఆధ్వర్యంలో బుధవారం బ్యానర్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లపై పెండింగ్ చలాన్ల వేధింపులు ఆపాలన్నారు. హిట్ అండ్ రన్ పేరుతో డ్రైవర్లను ఒత్తిడికి గురి చేసే చట్టాలను వెనక్కి తీసుకొని, డ్రైవర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు కాజా పాషా, జుబేర్, యాసీన్, వాయిద్, ఆసిఫ్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



స్కాలర్‌షిప్ విద్యార్థులకు భిక్ష కాదు.. హక్కు..



- కన్వీనర్ సభావట్ కళ్యాణ్

నవతెలంగాణ - ధూల్‌పేట్

స్కాలర్షిప్ విద్యార్థులకు బిక్ష కాదు, అది హక్కు అని ఏబీవీపీ కోఠీ జిల్లా కన్వీనర్ సభావట్ కళ్యాణ్ అన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ కోఠీ జిల్లా, చార్మినార్ శాఖ ఆధ్వర్యంలో పాతబస్తీ హైకోర్టు చౌరస్తాలో బుధవారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5,312 కోట్ల ఫీజు రియింబర్స్మెంట్‌ను వెంటనే ప్రభుత్వం విడుదల చేసి, విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. లేనియెడల ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు సజన్, నగర కార్యదర్శిలు రాహుల్, సౌశిక్ విద్యార్థి నాయకులు శ్రీకాంత్, విగ్నేష్, తరుణ్, అఖిలేష్, జితేందర్, సందీప్, శివశంకర్, అనురాధ, గాయత్రి, భాగ్యలక్ష్మి హరికృష్ణ, మహేష్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

నవతెలంగాణ-హయత్ నగర్

గుండెపోటుతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ లింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని చంద్రపురి కాలనీలో నివాసం ఉంటున్న కొండగడుపుల ఉపేందర్(49). ఈ నెల 6న రాత్రి భోజనం చేసి పడుకున్నాడు. తెల్లారే సరికి ఎంతకూ లేవకపోవడంతో వెంటనే అతన్ని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా..అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేస్ నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

మన్సూరాబాద్ డివిజన్ భాగ్ హయత్ నగర్ పరిధిలోని లెక్చరర్స్ కాలనీ రోడ్ నెంబర్ 5లో ఓ వ్యక్తి రోడ్డు ఆక్రమించి ట్రీ ప్లాంటు ఐరన్ రాడ్లు ఏర్పాటు చేసిన విషయమై కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి జీహెచ్ఎంసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం టౌన్ ప్లానింగ్ ఏసీపీ పావని ఆధ్వర్యంలో ఆ రోడ్డు ఆక్రమణను కూల్చి వేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ..కార్పొరేటర్ కొప్పుల నరసింహా రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.



నవతెలంగాణ - హయత్ నగర్

'5.16 ఎకరాల పట్టా భూమి మాది'

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్



- కబ్జాలకు పాల్పడాల్సిన అవసరం లేదు
- అసత్య ప్రచారాలు మాని..బహిరంగ చర్చకు రావాలి
- ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మన్ లెక్కల విఠల్ రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, గౌరెల్లి గ్రామ రెవెన్యూ సర్వే నెం 195 లోని 5.16 ఎకరాల పట్టా భూమి తమదని, ఇది తమ స్వాధీనంలోనే ఉందని బాటసింగారం సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్ రెడ్డి అన్నారు. అందుకు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను బుధవారం తహసీల్దార్ రవీందర్ దత్తుకు అందజేశారు.

ఈ సందర్భంగా లెక్కల విఠల్ రెడ్డి మాట్లాడుతూ గౌరెల్లి గ్రామ రెవెన్యూ సర్వే నెం 195లోని 5.16 ఎకరాల భూమికి సంబంధించి చేస్సాల, పహానిలలో తమ కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్నాయని, ఆ భూమి తమ స్వాధీనంలో ఉందన్నారు. మేం ఎలాంటి అక్రమాలకు, కబ్జాలకు పాల్పడలేదని, ఆ అవసరం కూడా తమకు లేదన్నారు. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గౌరెల్లి గ్రామ రెవెన్యూ సర్వే నెం. 195లో 5.16 ఎకరాలకు పాసు బుక్కులు, టైటిల్ డీడ్, ప్రొసీడింగ్‌లను నాటి హయత్ నగర్ డిప్యూటీ కలెక్టర్ 1991 డిసెంబర్ 31నలో జారీ చేశారని గుర్తుచేశారు. సర్వే నెం.195లో 5.16 ఎకరాల భూమి పట్టా భూమి అని, అందుకు సంబంధించిన పాసు పుస్తకాలు మూడు వారాల్లోగా ఇవ్వాలని హైకోర్టు ఉత్తర్వులలో పేర్కొందని తెలిపారు. ఈ విషయం పత్రికల ద్వారా తెలియజేస్తున్నానని తెలిపారు. కొంతమంది పనిగట్టు కొని తమపై అసత్య ఆరోపణలు చేస్తూ, తన వ్యక్తి గత జీవితానికి భంగం కలిగించే విధంగా వ్యవరిస్తు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక నుంచి ఊరుకునేది లేదని హెచ్చరించారు. అబద్ధపు ఆరోపణలు చేస్తే సహించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి ముందుకు వెళ్తానని చెప్పారు. నేనుగాని, తమ కుటుంబ సభ్యులుగాని కబ్జాలకు పాల్పడితే బహిరంగ చర్చకు రావాలని సవాలు విసిరారు.

మధ్యంతర బడ్జెట్-2024పై అవగాహనా సదస్సు



నవతెలంగాణ - హయత్ నగర్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్ నగర్‌లో సామాజిక శాస్త్రాలు కామర్స్, ఐక్యూ ఏసి ఆధ్వర్యంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థపై మధ్యంతర బడ్జెట్- 2024 ప్రభావం అనే అంశంపై బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. జోత్స్నప్రభ అధ్యక్షత వహించగా.. తెలంగాణ విశ్వవిద్యాలయం ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఏ.పున్నయ్య భారతదేశ ఆర్థిక వ్యవస్థపై మధ్యంతర బడ్జెట్ ప్రభావం గురించి ఆలోచ నాత్మకమైన విశ్లేషణను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. డాక్టర్ రవీందర్ సమన్వయకర్తగా వ్యవహ రించిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీని వాస్‌రెడ్డి, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఇంతియాజుద్దీన్ ఫారూఖీ, అధ్యాపకులు డాక్టర్ జహీదా బేగం, డాక్టర్ మల్లేశం, డాక్టర్ సునీత, డాక్టర్ ధనరాజ్, సత్యనారాయణ, రమాదేవి, హృదయ రాజు, డాక్టర్ సురేష్, చెన్నోజి, డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రవీణ్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- యువ జూనియర్ కళాశాల డైరెక్టర్ భాస్కర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంటర్మీడియట్ విద్యతోనే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించిన ప్రవీణ్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని యువ జూనియర్ కళాశాల డైరెక్టర్ భాస్కర్ విద్యార్థులకు సూచించారు. వనస్థలిపురంలోని యువ జూనియర్ కళాశా లలో 2020- 2022 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియ ట్‌లో ఎంపీసీ గ్రూపులో 939 మార్కులు సాధించిన ప్రవీణ్ సింగ్ అనే విద్యార్థి..ఇటీవల విడుదలైన నేవీ ఎస్ఎస్ఆర్ ఫలితాలలో మెరిట్ లిస్టులో చోటును సాధించి, ఇండియన్ నేవీ విభాగంలో ఉద్యోగాన్ని సాధించారు. ఈ మేరకు బుధవారం వనస్థలిపురంలోని యువ జూనియర్ కళాశాల డైరెక్టర్ భాస్కర్, ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసు, కళాశాల సిబ్బంది ప్రవీణ్ సింగ్‌ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం డైరెక్టర్ భాస్కర్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి తాను ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే.. పట్టుదల, కృషి ఉండాలని సూచించారు.



ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రవీణ్ సింగ్ మొదటి ప్రయత్నంలో ఉద్యోగం సాధించలేకపోయినా, ఏమాత్రం నిరాశ చెందకుండా రెట్టింపు కృషితో రెండో ప్రయత్నంలో ఉద్యోగాన్ని సాధించారని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ప్రవీణ్ సింగ్ మాట్లాడుతూ నేవీలో ఉద్యోగం సాధించడం నా చిన్ననాటి కళ అని అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షబ్ ఎ మెరాజ్

నవతెలంగాణ- మలక్‌పేట్

ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో షబ్ ఎ మెరాజ్ పండుగను బుధవారం జరుపుకున్నారు. ముస్లింలందరూ ఇమాంవహాఖతీబ్ మజీద్ మహమ్మదీయ టీవీ టవర్ నందు రాత్రి ప్రార్థనలు చేస్తూ జాగారం చేశారు. ఈ సందర్భంగా మత గురువు సయ్యద్ అబ్దుల్ వహీద్ ఖాదీర్ పండుగ విశిష్టతను వివరించారు. పవిత్ర పండుగలలో ఈ పండుగ ఒకటని చెప్పారు. పేదలను ఆదుకుంటే అల్లాహ్ కనికరం పొందుతారని చెప్పారు. ప్రతి ముస్లిం సంపాదనలో కొంత ధనాన్ని పేదలకు ఖర్చు చేయాలని, అందరితో సోదర భావంతో మెలగాలని సూచించారు. అనంతరం ఒకరికి ఒకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని మంగాపురం వేంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేసి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ శ్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్‌చారి, కాలనీ అధ్యక్షులు అశోక్ రెడ్డి, కనకయ్య సురేష్‌బాబు, సాయికుమార్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడిని కలిసి వస్తానని వెళ్లిన వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ - జవహర్ నగర్

తన స్నేహితుడిని కలిసి వస్తానని ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జవహర్ నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం మామిడాల రాంచంద్రారెడ్డి, (57) జమ్మిగడ్డ నివాసి, మంగళవారం రాత్రి 11గంటల సమయంలో అతడి స్నేహితుడు నర్సన్నను జమ్మిగడ్డలో కలిసి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. కాని అక్కడికి వెళ్లలేదు, తిరిగి ఇంటికి రాలేదు. ఇంటి నుంచి బయటకు వెళ్లే సమయంలో పర్సు, మొబైల్‌ను ఇంట్లోనే వదిలేసి వెళ్లాడు. అతడి కోసం చుట్టుపక్కల, బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి



- ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి
- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-ఉప్పల్

అధికారులు సమన్వయంతో పనిచేసి ఉప్పల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే నంబర్ 1గా తీర్చిదిద్దాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. బధవారం ఉప్పల్ మున్సిపల్ కార్యాలయంలో ఉప్పల్ సర్కిల్ ఉప కమిషనర్ శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అన్ని విభాగాల సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ.. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని, అధికారులు అందరూ తమ డివిజన్లలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, చేతన హరీశ్, బండారి శ్రీవాణి వెంకట్రావు, ఎమ్మార్వో నర్సింహారెడ్డి, ట్రాఫిక్ సీఐ అశోక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో అరోరా కాలేజీ విద్యార్థికి బంగారు పతకం



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అరోరా పీజీ కళాశాలలో ఎంసీఏ ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తున్న రామ్‌కుమార్ జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొని 3 బంగారు పతకాలు సాధించాడు. ఈ నెల 3వ తేదీన నిర్వహించిన పోటీల్లో జూనియర్స్ మెన్స్ ఫిజిక్ సౌత్ ఇండియా, జూనియర్ బాడీ బిల్డింగ్ సౌత్ ఇండియా, సీనియర్ బాడీ బిల్డింగ్ సౌత్ ఇండియా అనే మూడు క్యాటగిరీల్లో పాల్గొన్నాడు. జనవరి 7న జరిగిన స్టేట్ లెవెల్ బాడీ బిల్డింగ్ పోటీల్లో సత్తా చాటి 2 గోల్డ్ మెడల్స్ కైవసం చేసుకున్నాడు. వేదిక ఎక్కడైనా..పోటీ ఎవరితో అయినా బంగారు పతకం సాధించడమే లక్ష్యంగా రామ్‌కుమార్ దూసుకెళుతున్నాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో డైరెక్టర్ శ్రీకాంత్ జట్ల రామ్ కుమార్‌ను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పథకాలను సాధించి దేశానికి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. అభినందన కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఉన్నారు.

ఘనంగా బన్నాల ప్రవీణ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఉప్పల్

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ జన్మదిన వేడుకలను ఉప్పల్ నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, విద్యార్థి, ఆటో యూనియన్ నేతలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బన్నాల ప్రవీణ్ మాట్లాడుతూ.. బీ ఆర్ఎస్ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటూ, అందరిని కలుపుకుని ముందుకెళ్తామని చెప్పారు. అనంతరం అభ్యుదయ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ వారికి క్యారం బోర్డ్సను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేసిన అధికారులు



నవతెలంగాణ-కాప్రా

నాచారం డివిజన్‌లోని సీకే గార్డెన్‌లో అక్రమంగా నిర్మిస్తున్న షెడ్లను కాప్రా టౌన్ ప్లానింగ్ అధికారులు పోలీసులతో కలిసి కూల్చి వేశారు. అధికార పార్టీ నాయకుల అండతో దర్జాగా సీకే గార్డెన్‌లోని పాత షెడ్లను తొలగించి ఎలాంటి అనుమతులు లేకుండా కొత్త షెడ్లను నిర్మించారు. పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించిన జీహెచ్‌ఎంసీ అధికారులు బుధవారం కూల్చివేశారు. ఎవరైనా అనుమతి లేకుండా షెడ్లను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ గిరిరాజు హెచ్చరించారు. ఇటీవల కాలంలో షెడ్ల నిర్మాణం భారీగా ఏర్పాటు చేస్తుండడంతో దీనిపై ఎమ్మెల్యే సీరియస్‌గా అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో అధికారుల్లో చలనం మొదలైంది.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



నవతెలంగాణ-కాప్రా

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. అభయ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ వారి సహకారంతో 45 రోజులు నిర్వహించిన డిజైనర్ బ్లౌజెస్ ఉచిత శిక్షణ ముగింపు కార్యక్రమం అభయ ఆఫీస్ చక్రిపురంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే శిక్షణ పొందిన 30మంది మహిళలతో పాటు పలువురు విద్యార్థులను 0అభినందించి వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఆడవారు ఇంటికే పరిమితం కాకుండా ఇలాంటి నైపుణ్యాన్ని మెరుగుపరుచుకొని కుటుంబానికి, సమాజానికి భాసటగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంతో మహిళలకు నైపుణ్యం నేర్పుతున్న అభయ అధ్యక్షురాలు దేరం ఉషను అభినందించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎంఈ ఈడీపీ ట్రైనర్ సుమతి, అనుముల నరసింహారెడ్డిలు అభయాసంస్థ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పద్మ అపర్ణ, సుచిత్ర, భాను, ఇందిరా, అలివేణి, షకీలా పాల్గొన్నారు.

సంకల్పం ముందు వైకల్యం ఎంత

- మోటివేషన్ స్పీకర్ నిక్ ఉజిసిక్
- సీఎంఆర్ సెట్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు



నవతెలంగాణ మేడ్చల్

సంకల్పంతో వైకల్యాన్ని సైతం జయించవచ్చు అని అందుకు తానే ఉదాహరణని ఆస్ట్రేలియా ప్రసిద్ధి చెందిన మోటివేషన్ స్పీకర్ నిక్ ఉజిసిక్ తెలిపారు. బుధవారం మేడ్చల్ గుండ్లపోచంపల్లి మున్సిపాలిటి పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ జీఐ ఆడిటోరియంలో మోటివేషన్ స్పీకర్‌గా హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడూతూ.. జీవితం అనేది అనేక సవాళ్లతో, సమస్యలతో నిండి ఉంటుందని, ప్రతి సమస్యను జయిస్తేనే జీవితంలో రాణించగలమని తెలిపారు. తనకు రెండు కాళ్లు, రెండు చేతులు లేకపోయినా తన జీవితం ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నానని అన్నారు. తన జీవితంలో పడిన కష్టాల నుంచే జీవితాన్ని నేర్చుకున్నాను అని తెలిపారు. మానవుడు తలుచుకుంటే సాధించలేనిది అంటూ ఏమీ లేదని, అందుకు తానే నిదర్శనమని తెలిపారు. అంగవైకల్యంతో కాళ్లు చేతులు లేని నేను ప్రపంచవ్యాప్తంగా ఎంతో మందికి మోటివేషన్ స్పీకర్‌గా గుర్తింపు పొందానని పేర్కొన్నారు. తన జ్ఞానాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్నటువంటి విద్యార్థులకు ఉన్న అపోహలు, భయాన్ని, తొలగించే విధంగా కృషి చేస్తానన్నారు. అలాగే సీఎం ఆర్ కళాశాలలో విద్యార్థులు అడిగినటువంటి సందేహాలు, అనుమానాలకు, స్పష్టమైన సమాధానాలతో విద్యార్థులకు సూచనలను అందించారు. ప్రతి విద్యార్థి తన జీవితంలో కష్టపడి చదవాలని సూచించారు. తన చిన్నప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగిన పరిణామాలు అన్నిటిని విద్యార్థులకు సవివరంగా వివరించారు. అంగవైకల్యం ఉంటే సమాజం వెలివేస్తుందని, తాను మాత్రం సమాజంతో అందరితో కలుపుకొని తన వైకల్యాన్ని లెక్క చేయకుండా అనుక్షణం కష్టపడి విద్యా అనే సంపదను నేర్చుకున్నానని తెలిపారు. ఆనాడు నేర్చుకున్న విద్య నేటి భవిష్యత్తుకు జీవనాధారం అవుతుందని తెలిపారు. జీవితంలో ఒకరిపై ఆధారపడడం కాకుండా సొంతంగా కష్టపడడం నేర్చుకోవాలని తెలిపారు. తన జీవితంలో జరిగిన పరిణామాలు, అణచివేతలు విన్న ప్రతి విద్యార్థి ఆచార్యానికి గురైయ్యారు. ఆయన ఉపన్యాసం విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం కళాశాల కార్యదర్శి సిహెచ్. గోపాల్‌రెడ్డి, నిక్ ఉజిసిక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీఈవో అభినవ్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డా. వీఏ నారాయణ, కళాశాల డీన్స్, కళాశాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవో డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉద్యోగుల జేఏసీ చైర్మెన్, తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి అధ్యక్షులు బి.రవి ప్రకాష్, జిల్లా కార్యవర్గం అధ్యక్షతన తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ డైరీ, క్యాలెండర్-2024ను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమానికి టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ కేంద్ర సంఘం అధ్యక్షులు మారాం జగదీష్, నల్సార్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావు ముఖ్య అతిథులుగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి భరత్, కోశాధికారి గిరికాంత్, జిల్లా ఉపాధ్యక్షులు శామ్యూల్ పాల్‌హరి, జాయింట్ సెక్రెటరీ చంద్, సత్య నారా యణ్ గౌడ్, సెంట్రల్ అసోసియేట్ ప్రెసిడెంట్, పి.ఈశ్వర్, ఈసీ సభ్యులు, టీఎన్జీవో సెంట్రల్ యూని యన్, శశికాంత్ రెడ్డి, ఈసీ సభ్యుడు, టీఎన్జీవో సెంట్రల్ యూనియన్, శైలజ పబ్లిసిటీ కార్యదర్శి, కె.లక్ష్మణ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ముజీబ్ హుసేనీ, అధ్యక్షుడు హైదరాబాద్ జిల్లా, నరేందర్, అధ్యక్షుడు, మెదక్ జిల్లా, శ్రీకాంత్, అధ్యక్షుడు హైదరాబాద్ సిటీ, హరికృష్ణ, కార్యదర్శి హైదరాబాద్ సిటీ, జావీద్ అలీ, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, వివిధ యూనిట్ల, ఫోరంల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

కనిపించని త్యాగమూర్తి రమాబాయి అంబేద్కర్



నవతెలంగాణ-అల్వాల్

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఎన్నో విజయాలు వెనుక కనిపించని త్యాగమూర్తి మాత రమాబాయి అంబేద్కర్ అని అణగారిన ప్రజల హక్కుల పోరాట కమిటీ, గద్దర్ అభిమానుల సంఘం అధ్యక్షుడు సీఎల్ యాదగిరి చెప్పారు. బుధవా రం రమాబాయి 126వ జయంతి సందర్భంగా అల్వాల్‌లో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో తన కన్న బిడ్డలు నేల రాలుతున్న సమయంలో మాతృశోకాన్ని కడుపులో దాచుకొని తన భర్తను చదివిస్తే పేద ప్రజల బానిస బతుకుల విముక్తికి ఉపయోగపడుతుందని తలచారని, అందుకోసం పిడకలు చేసి జీవనం సాగిస్తూ తాను ఉపవాసం ఉంటూ ఆ డబ్బులు తన భర్తకు పంపించారని తెలిపారు. రమాబాయి అంబేద్కర్ సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అణగారిన ప్రజల హక్కుల పోరాట కమిటీ సభ్యులు, గద్దర్ అభిమానుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వార్షిక స్పోర్ట్స్ మీట్ 2023-24 ' ది లీగ్ ఆఫ్ ది లయన్స్'



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రముఖ ప్రీమియం విద్యాసంస్థ ప్రీమియా అకాడమీ ఇటీవల హైదరాబాద్‌లో తమ వార్షిక స్పోర్ట్స్ మీట్ 2023-24 ' ది లీగ్ ఆఫ్ లయన్స్' నిర్వహించింది. వారం రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమం క్రీడాస్ఫూర్తి, ప్రతిభ, జట్టు కృషికి అపూర్వమైన ప్రదర్శనగా నిలిచింది. ఏడాది పొడవునా అనేక రకాల క్రీడా కార్యకలాపాలను నిర్వహిస్తుంది. వీటిలో బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, ఖో-ఖో, లాంగ్ జంప్, వివిధ ట్రాక్ ఈవెంట్‌లు ఉన్నాయి. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు అనుబంధంగా ఉన్న అనుభవజ్ఞులైన ప్రొఫెషనల్ క్రికెటర్. విశ్లేషకురాలు ఎం.సునీత ఆనంద్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వారు తన విలువైన పరిజ్ఞానం, క్రీడా ప్రపంచంలోని అనుభవాలతో విద్యార్థులను ప్రేరేపించారు. ఆమె స్పోర్ట్స్ ఈవెంట్‌లలో పాల్గొనడం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా ప్రీమియా అకాడమీ వ్యవస్థాపకురాలు, మేనేజింగ్ డైరెక్టర్ సింధూరిరెడ్డి మాట్లాడుతూ "విద్యార్థుల నుంచి అద్భుతమైన ఉత్సాహం, చురుకైన భాగస్వామ్యాన్ని చూస్తున్నందుకు సంతోషిస్తున్నాం. ఈ పోటీల్లో పాల్గొనే వారిలో పోటీతత్వ స్ఫూర్తి, స్నేహం విద్యుద్దీకరణ వాతావరణాన్ని సృష్టించింది. మా విద్యార్థులను మరింత మెరుగైన వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకు మరిన్ని ఈవెంట్‌లను నిర్వహించాలని ఎదురు చూస్తున్నాం" అని తెలిపారు.

అనాథ పిల్లలకు నిత్యావసర వస్తువుల పంపిణీ



నవతెలంగాణ-బడంగ్‌పేట్

అనాథ పిల్లలకు నిత్యావసర వస్తువుల పంపిణీ చేయటం హర్షనీయమని కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 20వ డివిజన్‌లో ఉన్న మన ఫౌండేషన్ చిల్డ్రన్ హోమ్స్‌లో రిలేబుల్ ట్రస్ట్ హైదరాబాద్ వారు అనాథ పిల్లలకు నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానవతా హృదయంతో పేద ప్రజలకు, అనాథలకు సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నైనాచారి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలపై కాంగ్రెస్ బూత్ లెవల్ మీటింగ్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 131 డివిజన్‌లో పార్లమెంట్ ఎన్నికల బూత్ స్థాయి మీటింగ్ కుత్బులాల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కోలన్ హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ .. కుత్బుల్లాపూర్ నియోజకర్గానికి రూ.10 కోట్ల నిధులు కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కేటాయించిన రూ.10 కోట్ల నిధులను ఒకొక్క డివిజన్‌కు కోటి రూపాయలతో 20శాతం నిధులు స్కూల్స్, 10శాతం నిధులు నీటి సమస్యలు, 70శాతం నిధులతో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, రోడ్స్, ప్యాచ్ వర్క్, కమ్యూనిటీ హాల్స్ వంటి వాటికి ఉపయోగిస్తామని తెలిపారు. నియోజకర్గంలోని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు, నాయకులు, పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఎన్నికల అధికారి ఉత్తర్వుల ప్రకారం బుధవారం మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో ఓటరు నమోదు అధికారి, ఉప కమిషనర్ జి. రాజు అధ్యక్షతన వివిధ రాజకీయ పార్టీ నాయకులతో ఓటర్ల జాబితా 2024 గురించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ నెల 8వ తేదీన ఓటర్ లిస్ట్ తుది జాబితా విడుదలవుతుండడంతో ఈ సమావేశం నిర్వహించినట్టు చెప్పారు.

ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాల ని కోరారు. ఈ సమావేశంలో పి.శ్రీనివాస్, వగ్గు చంద్రశేఖర్ రావు, పి.నరేందర్ రెడ్డి, ఆర్.విష్ణువర్ధన్ రావు, ఎస్.కే.అజీజ్, కర్ణం గోపి, కే.నాగరాజు, కృష్ణ మూర్తి, సహాయక ఓటరు నమోదు అధికారులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా సీసీ రోడ్డు పనులు

- పత్తాలేని అధికారులు, కాంట్రాక్టర్
- ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

అధికారుల పర్యవేక్షణలోపం, కాంట్రాక్టర్ల పాలిట కాసులపంటగా మారింది. అదికాస్త గురుమూర్తి నగర్ ప్రజల పాలిట శాపంగా మారింది. వివరాల్లోకి వెళితే.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గురుమూర్తి నగర్ ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేయిస్తున్నాడని, కనీసం మట్టి రోడ్డును తవ్వి వేయాల్సిన కొత్త సీసీ రోడ్డును ఇష్టారాజ్యంగా వేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పనులు ఆపివేయాలని వాగ్వాదానికి దిగారు. నాసిరకం ముడిసరుకులు వాడుతూ తూతూమంత్రంగా పనులు చేస్తున్నారని వాపోయారు. ఇవి ఎన్నాళ్ళు ఉంటాయో వాళ్లే చెప్పాలని విమర్శించారు. కనీసం రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో అధికారులు, కాంట్రాక్టర్ రాకపోవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే పనులు సాగనివ్వబోమని స్థానికులు హెచ్చరించారు. ఈ విషయమై సంబంధిత అధికారిని వివరణ కోరగా నాణ్యతతో కూడిన పనులు చేస్తామని తెలిపారు.



సీఐను సన్మానించిన సంక్షేమ సంఘం నాయకులు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జీడిమెట్ల పోలీస్ స్టేషన్ నూతన సీఐ గా పదవి బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ రావును బుధవారం పోలీస్ స్టేషన్ లో రంగారెడ్డి నగర్ డివిజన్ నందానగర్, వెంకట్రామిరెడ్డి నగర్ బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షులు బి.కార్తీక్ గౌడ్,సతీష్ గట్బోజి, ఎం.కే. గార్మెంట్స్ అధినేత షౌకత్ అలీలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమందజేసి శాలువాతో అభినందించారు. తమ ప్రాంతాల సమస్యలు సీఐకు వివరిస్తూ అన్ని విధాలుగా సహకారాలు అందిస్తామని తెలిపారు.సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతీ ఒక్కరి భాగస్వామ్యం అవసరమని తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు హాజరవ్వాలని కార్పొరేటర్‌కు ఆహ్వానం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట.

ఈనెల 13,14,15 తేదీలలో జరగనున్న జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి 53వ బ్రహ్మో త్సవాలకు హాజరుకావాలని బుధవారం స్థానిక కార్పొరేటర్. కొలుకుల జగన్‌ను మగ్దుమ్ నగర్‌లోని ఆయన నివాసంలో ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) కృష్ణమాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ ఏ. వేణుగోపాల్ యాదవ్,కమిటీ సభ్యులు, రేగూరి ప్రవీణ్ గుప్తా,గుజ్జుల పాపిరెడ్డి,ఈ.వెంకటేష్.పి. సమ్మయ్య యాదవ్,సిబ్బంది నగేష్ కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవ వేడుకలను పురస్కరించుకొని మూడు రోజులపాటు జరగబోయే జాతరకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు, కమిటీ సభ్యులకు సూచించారు.

కబ్జాదారులు ఎవరైనా ఉపేక్షించేది లేదు

- ఎమ్మెల్యే అరెకేపూడి గాంధీ

నవతెలంగాణ-కూకట్ పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ అంబెడ్కర్ నగర్ లో గల, హిందు స్మశానవాటికలో కొందరు కబ్జాదారులు చేరి రేకులతో కంచె వేసి స్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే అరెకేపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి స్మశానవాటికను పరిశీలించారు. అక్రమంగా నిర్మిస్తున్న ఫీనిసింగ్‌ను వెంటనే తొలగించాలని, పోలీస్ శాఖ వారిని, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కబ్జాదారులు ఎవరైనా సరే ఉపేక్షించేదిలేదని , వారిని చట్టపరంగా శిక్షించి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. గతంలో ఇదే స్మశానవాటికకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించడానికి పునాది రాయి వేసి ఇనాగ్రషన్ చేశామని అన్నారు. అతి త్వరలో స్మశానవాటికకు ప్రహరి, అంతర్గత రోడ్లు, వాకింగ్ ట్రాక్ తో పాటు స్మశాన వాటికలో మొక్కలను పెంచి ఉద్యానవనం ఏర్పాటు చేసి అభివద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతిమయాత్రలో కూడా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది



లేకుండా స్మశానవాటికకు కావలిసిన అన్ని వసతులు చేకూర్చుతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎల్లమ్మబండ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యానిమల్ కేర్ సెంటర్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి



డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ బండలో గల యానిమల్ కేర్ సెంటర్‌ను సందర్శించారు. వీధి కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్ ప్రక్రియ గురించి, యానిమల్ కేర్ సెంటర్ విది విధానాల గురించి సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ యానిమల్ కేర్ సెంటర్‌లో కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసి వాటిని వేరువేరు కెనాల్స్‌లో పెట్టి నాలుగైదు రోజులు అబ్జర్వేషన్‌లో ఉంచి వదిలిపెడుతున్నారని అన్నారు. యానిమాల్ కేర్ సెంటర్‌ను పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహిస్తున్న సిబ్బందిని అభినందించారు. అలాగే ఇటీవల వీధి కుక్కల వల్ల జరిగిన దురదష్టకర సంఘటనలను, దష్టిలో పెట్టుకొని సిబ్బంది మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాశినాథ్ యాదవ్, శివరాజ్ గౌడ్, యానిమల్ కేర్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ పెంపు కోసం ఇంకెన్నాళ్లు ఎదురు చూడాలి..

- టప్రా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. నారాయణరెడ్డి కృష్ణమూర్తి
- పీఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా, మెమొరాండం అందజేత





నవతెలంగాణ-కూకట్ పల్లి

ఈపీఎఫ్ పెన్షన్ దారులకు కనీస పెన్షన్ రూ. 9 వేలకు పెంచుతూ, దానికి కరువు భత్యాన్ని జోడించాలని, ఎన్నో ఏండ్లుగా దేశ వ్యాప్తంగా 74 లక్షల మంది చేస్తున్న పోరాటాన్ని, ఆక్రందనను, కేంద్ర ప్రభుత్వం, ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ పెడచెవిన పెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టప్రా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. నారాయణరెడ్డి కృష్ణమూర్తి లు ఆవేదన వ్యక్తం చేశారు. కూకట్ పల్లి ఏరియా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, ఎల్. దుర్గా ప్రసాద్, కె. శంకర్ రావు ఆధ్వర్యంలో బుధవారం కూకట్ పల్లి వై జంక్షన్ సమీపంలోని, ఉద్యోగుల భవిష్య నిధి ప్రాంతీయ కార్యాలయం ముందు జరిగిన ధర్నా కార్యక్రమానికి వారు హాజరై సంఘీభావం ప్రకటించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస పెన్షన్ పెంపు కోసం రిటైరైన ఈ.పి.ఎఫ్. పెన్షన్ వద్దులు దేశవ్యాప్తంగా చేస్తున్న పోరాటం పై, దేశ ప్రధాని పదవి విప్పడం లేదన్నారు. పి. ఎస్. పెన్షన్ దారుల సమస్యలపై పార్లమెంటులో ప్రతిపక్ష పార్టీల సభ్యులు చేసే ప్రసంగాలను అసలు పట్టించుకోవడం లేదని, వారు వేసే ప్రశ్నలకు సమాధానం కూడా దాట వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే వారికి బుద్ధి చెప్పడానికి రాబోయే లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి ఈపీఎఫ్ పెన్షన్ దారులు ఓటు వేయొద్దని పిలుపు నిచ్చారు. రాజ్యాంగాన్ని రక్షించవలసిన రాష్ట్ర పతి కి, పీఎస్ ప్రాంతీయ కార్యాలయ అధికారి ద్వారా మెమోరాండం సమర్పిస్తున్నామని తెలియజేశారు. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా, సంగారెడ్డి జిల్లా, కూకట్ పల్లి ప్రాంతం నుంచి వివిద సంస్థల్లో పనిచేసిన రిటైర్ అయిన వందలాది మంది పెన్షనర్లు, పాల్గొన్న ఈ కార్యక్రమంలో టాప్ర మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, చెన్న కేశవులు, టి. బాలగంగాధరరావు, సంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైకుంఠ రావు, రామారావులతో పాటు రాష్ట్ర బాధ్యులు బ్రహ్మ చారి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొని మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ మొండి వైఖరి పై మండిపడ్డారు. అనంతరం పెన్షనర్లు కనీస పెన్షన్‌ను తొమ్మిది వేల కు పెంచాలని , దానిపై కరువు భత్యం చెల్లించాలని, ఆరోగ్య రక్షణ కల్పించాలని నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లి పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయ పీఆర్ఓ సురేష్‌కు మోమోరాండం అందజేశారు.



ఓల్డ్ బోయిన్‌పల్లిలో కార్పొరేటర్ పాదయాత్ర

నవతెలంగాణ-బాలానగర్

ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ పరిధిలో అపరిష్కతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ నరసింహ యాదవ్ తెలిపారు. బుధవారం డివిజన్ పరిధిలోని గంగ పుత్ర సంగం కాలనీలో కార్పొరేటర్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పెండింగ్‌లో ఉన్న పనులను రూ. 60 లక్షలతో డ్రయినేజీ, రోడ్లు, విద్యుత్ పనులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధింత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ అరవింద్ రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, వాటర్ వర్క్స్ మేనేజర్ జేజ ప్రకాష్, ఎలక్ట్రికల్ కష్ణ, శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి హరినాథ్, గంగ పుత్ర సంఘం అధ్యక్షుడు జనార్ధన్, బస్తీ వాసులు బిక్షపతి, దానయ్య, పెంటయ్య, శివ, రాజు తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు.

కొంపల్లి మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాం

- ఎమ్మెల్యే కేపీ. వివేకానంద



నవతెలంగాణ-దుండిగల్

కొంపల్లి మున్సిపాలిటీలో మౌలిక వసతులు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దామని ఎమ్మెల్యే కేపీ వివేకా నంద తెలిపారు. బుధవారం సుమారు రూ. 81 లక్షలతో చేపట్టిన అభివద్ధి పనులను ప్రారంభించడంతో పాటు రూ. 15 లక్షల వీధి దీపాల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు. కొంపల్లి మున్సిపాలిటీలోని కమాన్ నుంచి శివాలయం వరకు రూ. 15 లక్షలతో చేపట్టనున్న వీధి దీపాల ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేయగా, రూ. 76 లక్షలతో నూతనంగా చేపట్టిన బీటీ రోడ్డు, అంగన్ వాడి సెంటర్ నందు రూ. 5 లక్షలతో చేపట్టిన కిచెన్ షెడ్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే హాజరై స్థానిక చైర్మెన్ సన్న శ్రీశైలం యాదవ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర శివారు ప్రాంత మున్సిపాలిటీలలో మౌలిక వసతుల కల్పనకు శాయశక్తుల కృషి చేస్తున్నామని, మౌలిక వసతుల కల్పనతో నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ గంగయ్య నాయక్, సీనియర్ నాయకులు బూరుగుబావి హనుమంతరావు, కౌన్సిలర్లు పూజారి వసంత, దప్పు కిరణ్, పాక్స్ డైరెక్టర్లు సీహెచ్ మధు, మల్లేష్, మహిళా అధ్యక్షురాలు సంగీతారెడ్డి, సీనియర్ నాయకులు చింతల దేవేందర్ యాదవ్, లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

- ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి శంకర్



నవతెలంగాణ - కూకట్ పల్లి

16న దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి శంకర్ కోరారు. బుధవారం కూకట్ పల్లి రామాలయం కమాన్, కూకట్ పల్లి ఆటో స్టాండ్ వద్ద, సమ్మెకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ కూకట్ పల్లి మండల నాయకులు బి రాములుతో కలిసి ఆయన హాజరయ్యారు. శంకర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక రాజ్యాంగ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదన్నారు. భారత రాజ్యాంగంలో పొందుపరిచిన, చట్టాలను తారుమారు చేస్తూ ,కులమత బేధాలను పెంచి పోషిస్తున్నదని దుయ్యబట్టారు. 44 కార్మికుల హక్కులను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకొచ్చి కార్మిక హక్కులను కాల రాస్తున్నదని తెలిపారు. అంతేకాకుండా రోజురోజుకు పెరుగుతున్న ధరలను అదుపు చేయడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లకు సంబంధించిన బీఎన్ఎస్ ఒకటి రెండే అనే చట్టాని తీసుకొచ్చి డ్రైవర్లపై పెను భారం మోపిందన్నారు. కార్మికులకు ఇస్తున్నట్లుగా డ్రైవర్లకు సైతం నెలకు రూ. 7500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. నెలకు రూ. 4,500 పింఛన్, ఇన్సూరెన్స్ సౌకర్యం డ్రైవర్లకు కల్పించాలని కోరారు. మోటార్ వాహన చట్టం 2019 రద్దు చేయాలని, హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు మాత ఆటో స్టాండ్ కూకట్‌పల్లి జగద్గిరిగుట్ట ప్రెసిడెంట్ పి. అర్జున్ ,వైస్ ప్రెసిడెంట్ కె. మధు, జనరల్ సెక్రెటరీ కె మోజేష్, కోశాధికారి ముఖలింగం సలహాదారులు, చెన్నూరు యాదగిరి ,ఇస్తారి గడ్డం, మల్లేష్, మహేందర్ గుప్తా, నాయకులు భాస్కర్, నరసింహ, భీమ్ ,రాజు తదితరులు పాల్గొన్నారు.



సీఐను కలిసిన దళిత సంక్షేమ సంఘం సభ్యులు

నవతెలంగాణ - బాలానగర్

బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో నూతన సీఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సీఐ నవీన్ కుమార్‌ను, తెలంగాణ దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు అదిముల రాము, ముఖ్య సలహాదారు నల్ల విల్సన్ ఆధ్వర్యంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు సీఐను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం సీఐ నవీన్ కుమార్ మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు కోసం 24గంటలు అందుబాటులోనే ఉంటానని, ఏదైనా సమస్య వస్తే, అవసరమైతే అర్ధరాత్రి కూడా ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య సలహాదరు నల్ల విల్సన్ మాట్లాడుతూ బాలానగర్ డివిజన్ పరిధిలో ప్రజలకు పటిష్ఠమైన రక్షణ కల్పించేందుకు కషి చేయాలని, శాంతి భద్రతల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జీడిమెట్ల రమేష్, కోశాధికారి దాండు రవి కుమార్, కార్యనిర్వహక అధ్యక్షురాలు దీప్తి, గౌరవ అధ్యక్షుడు సుంకే రామన్, మీడియా కార్యదర్శి రవి స్టీవెన్సన్, మాజీ కార్యదర్శి మోతె బాలరాజు, లక్ష్మీ నారాయణ, కుమార్, చింత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫతేనగర్‌లో అభివృద్ధి పరుగులు పెడుతోంది

- కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్



నవతెలంగాణ - బాలానగర్

ఫతేనగర్ డివిజన్‌లో రూ. వందలాది కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను బుధవారం ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ జలమండలి డీజీఎం శంషేర్‌తో కలిసి పర్యవేక్షించారు. ఇటీవల శివశంకర్ నగర్‌లో వేసిన మంచినీటి పైపులైన్ లను అధికారులతో కలిసి పర్యవేక్షించారు. పెండింగ్ లో ఉన్న అభివద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఫతేనగర్ డివిజన్ లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నాయకత్వంలో అభివృద్ధిలో పరుగులు పెడుతున్నదని, ఫతేనగర్ ముఖచిత్రమే మారిపోయిందన్నారు. అదేవిధంగా డివిజన్ పరిధిలో వందల కోట్లతో అభివద్ధి, సంక్షేమం విజయవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. పెండింగ్ లో ఉన్న మంచినీటి పైప్ లైన్ పనులు, సీసీ రోడ్డు నిర్మాణ పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీజీఎం శంషేర్, వర్కింగ్ ఇన్ స్పెక్టర్ బాపిరెడ్డి, ఫతేనగర్ డివిజన్ అధ్యక్షులు కంచి బిక్షపతి, సి.శ్రీను, యాదగిరి గౌడ్, మహేష్, వేణు, సురేందర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు

అల్వాల్ సీడీపీఓకు సమ్మె నోటీసు అందజేత



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

సీఐటీయూ ఆధ్వర్యంలో అల్వాల్ సీడీపీఓను బుధవారం తన కార్యాలయం లో కలిసి ఆయనకు సమ్మె నోటీస్ అందచేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి కె. ఉన్ని కష్ణన్ మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం 44 చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్స్‌ను తీసుకువచ్చిందని తెలిపారు. కార్మిక వ్యతిరేక కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ యూనియన్(సీఐటీయు) జిల్లా కార్యదర్శి బి. శోభా రాణి మాట్లాడుతూ అంగన్వాడి ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, సుప్రీం కోర్ట్ తీర్పు ప్రకారం గ్రాట్యుటి చెల్లింపు తదితర ఏ ఒక్క సమస్య లను కేంద్ర ప్రభుత్వం పరి ష్కరించలేదని తెలిపారు. ఈ విధానాలను నిరసిస్తూ ఐసీడీఎస్‌కు బడ్జె ట్ పెంచి బలోపేతం చేయాలని, అంగన్వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో జిల్లాలోని అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు అందరూ పాల్గొని జయ ప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు అనురాధ, మంజుల అంగన్వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు పి. శివరాణి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో సంక్షేమ సంఘం ప్రతినిధులు భాగస్వాములు కావాలి

- కాంగ్రెస్ కూకట్ పల్లి నియోజకవర్గ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

సంక్షేమ సంఘం ప్రతినిధులు కాలనీ అభివద్ధిలో భాగస్వాములు కావాలని కాంగ్రెస్ కూకట్ పల్లి నియోజకవర్గం మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి అన్నారు. బుధవారం ప్రభాకర్ రెడ్డి నగర్, రామ్ రెడ్డి నగర్, మసీద్ గడ్డ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన అబ్దుల్ భాఖీ, సెక్రటరీగా ధత్తు ముదిరాజ్, సీనియర్ సభ్యులు రామ్ రెడ్డిలు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారిని ఆయన ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ సంఘాల ప్రతినిధులు బస్తీ సమస్యల విషయంలో చొరవ తీసుకొని అభివద్ధి కార్యక్రమాలు చేపడుతూ సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలని సూచించారు. అబ్దుల్ భాఖీ గెలుపుకోసం సహకరించిన రామ్ రెడ్డి, విష్ణు, రమేష్ విహారి తదితరులకు శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బసిరెడ్డి బ్రహ్మానంద రెడ్డి, దేంది అరవింద్ రెడ్డి, కొమ్ము బాబు, మొయిజ్ అల్లాపూర్, నాగ మళ్ళీ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా రమాభాయ్ జయంతి వేడుకలు

నవతెలంగాణ - కూకట్ పల్లి

బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సతీమణి రమభాయ్‌అంబేద్కర్ 126వ జయంతినిఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కర్క నాగరాజు ఆధ్వర్యంలో మూసాపేట్ గూడ్సెడ్ రోడ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర దళిత నాయకులు కర్కపెంటయ్య విచ్చేసి ఆమె చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఈ స్థాయిలో ఉండటానికి కారణం రమబాయ్ అని పేర్కొన్నారు. బాబాసాహెబ్ విదేశాలలో చదువుతున్న సమయంలో రమబాయ్ ఎన్నో కష్టాలతో కుటుంబ భారాన్ని మోసిందనీ తెలిపారు.ఈ కార్యక్రమంలో శారదారెడ్డి,అంబేద్కర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కర్కడాకయ్య, బిసి నాయకులు భాశెట్టి నర్సింగరావు,కర్క నర్సయ్య, అసోసియేషన్ ప్రధానకార్యదర్శి కర్కనిఖిల్, కర్క చిన్నసాయి, సదా మహేష్,జగన్, గోపాల్, నర్సింగ్, ఖాన్, బాషా శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టీఎస్ కాస్ట్ డిబిటీ స్కిల్ విగ్నన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జేఎన్టీయూహెచ్ డిపార్ట్మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ లో టీఎస్ కాస్ట్ డిబిటీ స్కిల్ విగ్నన్ ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ ప్రొగ్రామ్ యానిమల్ సెల్ లైన్ టెక్నాలజీ కార్యక్రమం బుధవారం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి టీఎస్ కాస్ట్ చైర్మెన్ డాక్టర్ నగేష్ , కన్వీనర్ డాక్టర్ ఆహ్మద్ కమల్ ముఖ్య అతిథులుగా వ్యాలీడిక్టరీ ఫంక్షన్‌కు హజరయ్యారు. . వివిధ సంస్థలు, విశ్వ విద్యాలయాలు, కళాశాలల నుంచి 20 మంది ప్రతినిధులు ప్రొగ్రామ్ కోసం నమోదు చేసుకున్నారని సమన్వయ కర్తలు డాక్టర్ ఎ.ఉమా, డాక్టర్ ఎల్. సైదా తెలిపారు. గత నెల 29న ప్రారంభమైన ఈ కార్యక్రమానికి వివిధ జాతీయ పరిశోధనా సంస్థలు విశ్వ విద్యాలయాల నుంచి రిసోర్స్ పర్సన్లు పాల్గొని ఉపన్యాసాలు అందించారు. 10 రోజుల కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు వివిధ జంతు కణ సంస్కతి పద్ధతులను నేర్చుకున్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి టీఎస్ కాస్ట్ చైర్మెన్ డాక్టర్ నగేష్ , కన్వీనర్ డాక్టర్ ఆహ్మద్ కమల్ లు పాల్గొని ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికేట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వి.రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.నరసింహారెడ్డి, కో ఆర్డినేటర్లు డాక్టర్ ఎ.ఉమ, డాక్టర్ ఎల్.సైదా, ఫ్యాకల్టీ , వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.



మాజీ కేంద్రమంత్రి, ప్రస్తుత హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ ను చండీఘడ్ లోని రాజ్ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు.ప్రస్తుత రాష్ట్ర రాజకీయ అంశాలపై ఆయనతో కూన శ్రీశైలం గౌడ్ చర్చించారు.ఈ సందర్భంగా కూన ను రాజ్ భవన్ లో గవర్నర్ ఆత్మీయంగా సత్కరించారు.

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

భాగ్యరథి డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు..

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



చింతల్ భాగ్యరథి డిగ్రీ కళాశాల ప్రెషర్స్ డే వేడుకలను బుధవారం గాంధీ నగర్ లోని ఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన క్యాట్ వాక్, ఫ్యాషన్ షో, తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి .సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే గత సెమిస్టర్ లో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థి సోఫియా సమ్రీన్‌ను సన్మానించారు. ఆ విద్యార్థికి ఎటువంటి ట్యూషన్ ఫీజు లేకుండా ఉచిత విద్యను అందిస్తామని కళాశాల యాజమాన్యం ప్రకటించింది. కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తును పొందే దిశగా కృషి చేయాలని, లక్ష్యాలను నిర్దేశించుకుంటూ వాటికి అనుగుణంగా కష్టపడాలని సూచించారు. అంతకుముందు పలువురు విద్యార్థులు చేసిన నత్య ప్రదర్శనలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ గోవిందరెడ్డి, ఎస్ .వెంకట్ రెడ్డి, జి.రమేష్ బాబు, కె .రామకష్ణ, నల్ల జై శంకర్ గౌడ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు...

ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

నవతెలంగాణ-దుండిగల్



తమ సమస్యలను పరిష్కరించాలని బుధవారం ఎమ్మెల్సీ శంబిపూర్ రాజును దుండిగల్‌కు చెందిన ఆటో కార్మికుల నేతృత్వంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో కలిసి కృషి చేస్తానని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

'పీజీ హాస్టల్‌ను వెంటనే తొలగించాలి'

- ఇండ్ల మధ్య హాస్టల్ ఇబ్బందిగా మారిందని బాగ్ అమీర్ కాలనీవాసుల ఆవేదన

నవతెలంగాణ - కూకట్‌పల్లి



కూకట్‌పల్లి బాగ్అమీర్ లోని నివాసాల నడుమ, శ్రీలక్ష్మీ పీజీ ఫర్ మెన్స్ హాస్టల్ నిర్వహిస్తుండటం వల్ల పలు ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం వారు మాట్లాడుతూ కుటుంబాలు నివసించే ఇండ్ల మధ్యనే అనుమతికి మించి నిర్మించిన అక్రమ నిర్మాణ భవనంలో పీజీ హాస్టల్ పార్కింగ్ సౌకర్యం లేకుండా నిర్వహిస్తుండటం వల్ల హాస్టల్‌లో ఉన్న యువకులు వారి వాహనాలను రోడ్లమీద పార్కింగ్ చేస్తున్నారని తెలిపారు. రోడ్డుపై వెళ్ళే స్థానిక వాహన దారులకు, అలాగే అటుగా వెళ్ళే మహిళలకు ఇబ్బంది కలుగుతోందన్నారు. అంతేకాకుండా రాత్రి వేళలో మద్యం సేవించి, పక్కన ఉండే నివాసాల పైకి, బిల్డింగ్ పైనుంచి కిందికి మద్యం సీసాలనును విసిరేస్తూ న్యూసెన్స్ చేస్తున్నారని తెలిపారు. పీజీ హాస్టల్ నిర్వాహకున్ని, బిల్డింగ్ యజమానిని ప్రశ్నిస్తుండగా, స్థానిక గ్రామ పెద్దలపై హాస్టల్ లో ఉంటున్న యువకులు తిరగబడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. కాబట్టి దీనిపై స్థానిక ప్రజా ప్రతినిధులు, పోలీసు సిబ్బంది, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, సంబంధిత జీహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు ఇక్కడ నుంచి హాస్టల్ ను తొలగించాలని కోరుతూ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు స్థానికులు తెలియజేశారు.

సీఆర్వో ఫణింద్ర రెడ్డితో ముజీబ్ మర్యాదపూర్వక భేటీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని (ము జీబ్) ఆధ్వర్యంలో బుధవారం నూతనంగా నియమితులైన చీఫ్‌రేషనింగ్ ఆఫీసర్ జి. ఫణీంద్ర రెడ్డిని కలిసి పూలబోకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి ఎస్.విక్ర మ్ కుమార్, కేంద్ర సంఘం నాయకులు పర్వతాలు ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ నూతన సీఆర్వో జి.ఫణీంద్రరెడ్డి ఆధ్వర్యంలో శాఖ మరింతగా మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వృద్ధాశ్రమానికి నాలుగు సీలింగ్ ఫ్యాన్లు అందజేత



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

వృద్ధులను, అనాథ బాలలను, పేదలను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని వసంత నగర్‌కు చెందిన సేవ్ ఏ లైఫ్ (సేఫ్టీ ఫర్ హ్యూమానిటీ) సంస్థ అధ్యక్షుడు రాణాప్రతాప్ సూరగన అన్నారు. వేసవి కాలం దగ్గరపడుతున్న సందర్భంగా మయూరి నగర్‌లో ఆశ్రయ వృద్ధాశమంలోని బుధవారం వృద్ధులకు ఆయన నాలుగు సీలింగ్ ఫ్యాన్స్ విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా మహిళా మండలి అధ్యక్షురాలు సుశీల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశానికి బీజేపీ పెను ప్రమాదం

- పార్లమెంట్ ఎన్నికల్లో పతనం తప్పదు
- సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్



నవతెలంగాణ-ఓయూ

దేశానికి పెను ప్రమాదమైన బీజేపీకి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పతనం తప్పదని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఓటమికై సీపీఐ కార్యకర్తలంతా క్రియాశీలకంగా పనిచేయాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. సీపీఐ మెట్టుగూడ డివిజన్ కార్యకర్తల సమావేశం దూద్ బాయ్‌లోని కమిటీ హాల్లో అయిన మాట్లాడుతూ ఈ పదేండ్లలో అచ్చేదిన్ ఆగయా అంటూ అధికారం లోకి వచ్చిన మోడీ నిత్యవసర ధరలు, గ్యాస్ ధరలు ఆకాశానికి ఎత్తి సామాన్య ప్రజలకు సచ్చేదిన్ రోజులు తీసుకొచ్చారని. పెంచిన నిత్య వసర ధరలు వల్ల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని, వచ్చే ఎన్నికల్లో ప్రజా ఆగ్రహానికి మోడీ గురిగాక తప్పదని అన్నారు. దేశాన్ని రక్షించటం కోసమే వచ్చే ఎన్నికలలో మోడీని ఇంటికి పంపాలని ఆ దిశగా మోడీ హటావో దేశ్ కి బచావో అనే నినాదంతో ప్రచారం కొనసాగిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి కొమురెల్లి బాబు, సోమయ్య, యాదగిరి, ఆంజనేయ గౌడ్, హనుమంతు, యాకయ్య, చందర్, వెంకటయ్య ప్రసంగి , ప్రవీణ్, కే యాదగిరి,పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని రాస్తారోకో



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సుమారుగా 10,000 వేల కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఓయూ ఎన్సీసి గేట్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులను పోలీసులు అరెస్టు చేసి నల్లకుంట పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా తెలంగాణ అల్ స్టేట్ యూనివర్సిటీ కన్వీనర్ జీవన్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వెంటనే విడుదల చేయాలన్నారు. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు స్కాలర్షిప్ ఇవ్వక పోవడం అంటే పేద విద్యార్థులను విద్యకు దూరం చేయడమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్స్ సుమన్ శంకర్, ఆలివేలి రాజు, ఓయూ ప్రెసిడెంట్ అశోక్, సెక్రెటరీ పరశురాం, కోటి ,ఓయూ వైస్ ప్రెసిడెంట్ సాయి, స్టేట్ ఎగ్జిక్యూ టివ్ మెంబర్ హరిప్రసాద్ యూనివర్సిటీ నాయకులు శివ శంకర్ విష్ణు, చైతన్య, రాజేందర్, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎల్ఎల్‌బీ సెమిస్టర్ మళ్లీ నిర్వహించాలని వినతి



నవతెలంగాణ-ఓయూ

బహిష్కరించిన ఎల్ఎల్‌బీ సెమిస్టర్ పరీక్షను తిరిగి నిర్వహించాలని ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీ నారాయణకి ఎఐఎస్ఎఫ్ యునివర్సిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లా కాలేజీ ఈ-1 హాస్టల్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, పెంచిన కోర్సుల ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ 5వ సెమిస్టర్ పరీక్షను బహి ష్కరించి ధర్నా నిర్వహించినట్లు, సుమా రు 20 మంది విద్యార్థులు పరీక్షకు దూరం అయ్యారని, తిరిగి వారికి పరీక్ష ను నిర్వహించి వారికి న్యాయం చేయాలని,అదే హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, మెస్‌ను వెంటనే ప్రారంభించాలని, పెంచిన కోర్సు ఫీజులపైన కూడా దృష్టి సారించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్ష,కార్యదర్శులు లెనిన్,నెల్లి సత్య విద్యార్థులు బస్వరాజు, క్రాంతి, సుధాకర్, భరత్, రవి, తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి ఆస్పత్రిలో ఉచితంగా వైద్యసేవలు





- మల్లారెడ్డి ఆస్పత్రి చైర్మెన్ భద్రారెడ్డి

నవతెలంగాణ-బంజారాహిల్స్

భద్రారెడ్డి మేడ్చల్‌లోని మల్లారెడ్డి ఆస్పత్రిలో ఇక నుంచి హైదరాబాద్ నగర వాసులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు మల్లారెడ్డి ఆస్పత్రి చైర్మెన్ భద్రారెడ్డి, వైస్ చైర్మెన్ ప్రీతిరెడ్డిలు ప్రకటించారు. బుధ వారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ గత పద్నాలుగు ఏండ్లుగా మల్లారెడ్డి ఆస్పత్రి తరపున ఉచిత వైద్య సేవలు అందిస్తూనే ఉన్నా మని, అయితే ఈ సేవలను మేడ్చల్ మల్కాజగిరి, కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్, కూకుటపల్లి, ఉప్పల్, ఎల్.బి.నగర్ నియోజకవర్గ ప్రజలు మాత్రమే ఉపయోగించుకునే వారని ఇప్పుడు నగర వాసులకు కూడా ఈ సేవలను అందిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ ఉచిత సేవలు నిరంతరంగా కొనసాగుతాయనీ నగర ప్రజలకు పూర్తిగా అన్ని విభాగాలలో వైద్య సేవలు అందిస్తామని,ఇకనుండి మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు మాత్రమే కాకుండా మహా నగర ప్రజలకు అందరికి ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. జనరల్ మెడసిన్, సర్జరీ, గైనకాలజీ విభాగం తరపున ఇప్పటికే ప్రసూతి సేవలు, అదే విధంగా కెసిఆర్, సీఎంఆర్ కిట్లు అందిస్తామన్నారు. అదే విధంగా ఊపిరి తిత్తులు, గుండె సంబంధిత వ్యాధు లకు, బ్రెయిన్, స్కిన్,ఆర్థో పెడిక్,ఆప్తాల్మాలజీ,ఈ ఎన్ టి వంటి అన్ని రకాల ఉచిత వైద్య సేవలు అం దిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భద్రారెడ్డి, ప్రీతిరెడ్డిలతో పాటు డాక్టర్లు రమణి, విశ్వేశ్వర శాస్త్రి,పాల్గొన్నారు.

ప్రజాభీష్టం మేరకు హాలిడేమార్ట్ ఫేస్-2 షురూ

- కృష్ణ మోహన్



నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రజల నుంచి వచ్చిన విశేష స్పందనను బట్టి సౌత్రాన్ ట్రావెల్స్ వారు హాలిడే మార్ట్ ఫేస్1, పూర్తి చేసుకుని ఫేస్-2ను ఈనెల 9 నుంచి 11 వరకు నిర్వహిస్తున్నట్లు సంస్థ ఎండి కృష్ణమోహన్ తెలి పారు. బుధవారం లక్డికాపూల్‌లోని కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. డైరెక్టర్ రామారావు, రీజియనల్ హెడ్‌పేసాల కార్తిక్, జిఎం,హరీష్,ఏజిఎం,కే, శ్రీనివాసరావు లతో కలిసి బ్రోచర్‌ను ఆవి ష్కరించి మాట్లాడారు. వారు మాట్లాడుతూ హాలిడే మార్ట్ ఫేస్-2,లో పాల్గొని తమ కస్టమర్లకు అలాగే తెలుగు రాష్ట్రాల ప్రజలకు తాము ఓ ప్రత్యేకమైన ఆఫర్లను అలాగే బహుమతులను అందజేస్తున్నామని ప్రకటించారు. బహుమతుల్లో సిల్వర్ కాయిన్, నగదు బహుమతితో పాటు ప్రత్యేక టూరిజం ప్లాన్లు కలిగిన ప్యాకేజీలు ఇతర రకాల బహుమతులు అందిస్తే ఈ సంవత్సరం ఏప్రిల్ నుండి 2025 మార్చ్ వరకు బుకింగ్ చేసుకున్న వారిని సదరన్ మహా లక్కీ డ్రా కస్టమర్లుగా గుర్తించి మొదటి పదిమందికి మొదటి బహుమతిగా కియా కారు, ఐఫోన్, టీవీ ద్విచక్ర వాహనం,బంగారు నాణేలు,టీవీ, ఇతర బహుమతులను వచ్చే ఏప్రిల్లో అందజేస్తామని తెలిపారు. తమ ట్రావెల్స్ నుండి ప్రయాణించేవారు ఎక్కువగా ఇష్టపడే దేశాల్లో టాప్ టెన్‌లో యూరప్, ఆస్ట్రేలియా,సింగపూర్, దుబాయ్, మలేషియా, ఉన్నాయన్నారు. తమ సంస్థ ద్వారా పాస్పోర్ట్ రెన్యువల్ చేసు కుని వారు అలాగే నూతనంగా దరఖాస్తు చేసుకునే వారికి ఉచితంగా పాస్పోర్ట్ సేవలను అందిస్తోందన్నారు.

వరద ముంపు సమస్యకు ఎస్ఎన్‌డీపీతో

శాశ్వత పరిష్కారం

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

ఎన్నో సంవత్సరాల వరద ముంపు సమస్యకు ఎస్ఎన్‌డీపీ కార్యక్రమం ద్వారా శాశ్వత పరిష్కారం చూపామని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి బేగంపేటలోని బ్రాహ్మణ వాడి, వడ్డెర బస్తీలలో నాలా అభివృద్ధి పనులు, నూతనంగా చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. బస్తీలలో నూతనంగా నిర్మించిన సీసీరోడ్లతో వాటి రూపు రేఖలు మారి పోయాయి. తమ బస్తీలు ఇంత గొప్పగా అభివృద్ధి చెందుతాయని తాము కలలో కూడా ఊహించలేదని స్థానికులు ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బ్రాహ్మణవాడిలోని లైన్ 4లో పెండింగ్‌లో ఉన్న డ్రయినేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.నాలాలో మిగిలిన పూడిక తొలగింపు పనులు చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వర్షాకాలంలో నాలా కు ఎగువ నుండి వచ్చే వరద కారణంగా పరిసర బస్తీలలోకి నీరు చేరి ఇండ్లు ముంపుకు గురయ్యేవని తెలిపారు. తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎన్నో సంవత్స రాలుగా కోరుతూ వచ్చారు. తెలంగాణ ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ఎస్‌డీపీ కార్యక్రమం చేపట్టి నగరంలోని అనేక నాలాల అభివృద్ధి పనులను చేపట్టిందని వివరించారు.సుమారు రూ.45కోట్ల వ్యయంతో బేగంపేట నాలా అభివృద్ధి పనులతో పాటు పరిసర కాలనీలలో మెరుగైన డ్రయినేజీ వ్యవస్థ, నాణ్యత కలిగిన సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కార్పొరేటర్ టి.మహేశ్వరి, డీసీ శంకరయ్య, ఈఈ సుదర్శన్, ఎస్ఎన్‌డీపీ ఈఈ శీధర్, వాటర్ వర్క్స్ జీఎం వినోద్, డీజీఎం శశాంక్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, జనరల్ సెక్రెటరీ ఆరీఫ్, సీనియర్ నాయకులు టి.శ్రీహరి, నరేందర్ రావు, శేఖర్, కిషోర్, ఆకుల హరికృష్ణ తదితరులు ఉన్నారు.

ఇండియాకు ఐటీ హబ్‌గా హైదరాబాద్





నెదర్లాండ్స్ అంబాసిడర్ మారిసాగెరాడ్స్

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఐటీ రంగంలో హైదరాబాద్ ప్రపంచ స్థాయిలో మంచి గుర్తింపు పొందిందని ఇక్కడ పెట్టుబడులకు, ఉపాధికి మంచి అవకాశాలున్నా యని నెదర్లాండ్స్ ఇండియా భూటాన్, నేపాల్ అంబా సిడర్ మారిసా గెరాడ్స్ అన్నారు. బుధవారం ఆమె నాలెడ్జ్ సిటీలోని డచ్‌కు చెందిన జిబియా సిఎంఐటీ, ప్లానెన్ సాఫ్ట్‌వేర్ సంస్థలను సందర్శించారు.జిబియా సీవోవో కిరణ్ మధునాపంతులతో కలిసి డచ్ కంపెనీలలో పని చేస్తున్న ఉద్యోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ తాను తొలి సారిగా హైదరా బాద్‌కు వచ్చానని ఇక్కడ వ్యాపార పెట్టుబడులు విస్తరిం చేందుకు స్థానికంగా ఉన్న పరిస్థితులను అధ్యయనం చేయడంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి మాట్లాడ బోతున్నట్లు తెలిపారు. తమ దేశం లోని పలు వ్యాధులకు 80 శాతం మందులు ఇండియా నుంచే ఎగుమతి అవు తున్నాయని ఇది ఎంతో గొప్ప విషయమని అదే విధంగా ఐటీ రంగంలో సైతం హైదరాబాద్‌లో గణనీయమైన అభివృద్ధి కనిపిస్తున్నదని అన్నారు. డచ్‌కు చెందిన 20ఐటీ కంపెనీలు ఇక్కడ ఉన్నాయని ఆమె తెలిపారు. జిబియా సీవోవో కిరణ్ మాట్లాడుతూ జిబియా అనే ఈడచ్‌కంపెనీలో 3వేల మందికిపై ఉపాధి పొందుతున్నారని త్వరలోనే మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పన, వ్యాపారవృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

సూక్ష్మ కళా నైపుణ్యత కలిగిన వారిని ప్రోత్సహించాలి



- బాబు మోహన్

నవతెలంగాణ-బంజారాహిల్స్

సూక్ష్మ కళా నైపుణ్యత కలిగిన కళ శిల్పులను ప్రోత్సహించాలనీ నటుడు బాబు మోహన్ అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఎంతో ఓపికగా ఒక్కొక్క గింజను ఒడిసిపట్టి అద్భుత నిర్మాణాన్ని రూపొందించడం అభినందనీయమని మాజీ మంత్రి నటుడు బాబు మోహన్ అభినందిస్తూ ప్రసంగించారు. కేవలం రామ మందిరమే కాకుండా అతి చిన్న రామాలయంలో సీతారాముల చిత్రపటాల సైతం పొందుపరచడం మరింత ఆకట్టుకునే అంశ మన్నారు. ఇంతటి ఘనత సాధించిన దయాకర్ను తన చేతులతో సన్మానించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. వరల్డ్ రికార్డులు సాధించిన చిరంజీవి దయాకర్ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు దైవజ్ఞ శర్మ అన్నారు. రోజుకు రెండు గంటల చొప్పున 60 గంటల్లో మాసం రోజుల పాటు శ్రమించి ఈ అద్భుత నిర్మాణాన్ని రూపొందించినట్లు చెప్పారు. శిల్పి దయాకర్ మాట్లాడుతూ సుమారు 16220 వేల బియ్యపు గింజలతో అయోధ్య రామ మందిరం అద్భుతంగా రూపొందించారనీ జగిత్యాలకు చెందిన దయాకర్ ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ భవ్య రామ మందిరంలో బలరాముని ప్రాణ ప్రతిష్ట చేసే సమయం నాటికే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి విజయవంతంగా పూర్తి చేసినట్లు దయాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళ సుజాత, స్వప్న, రమణ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజుల సంక్షేమానికి రూ.10వేల కోట్లు కేటాయించాలి

- ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి
- కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి
- బీసీ-డీ నుంచి బీసీ-ఏ జాబితాలోకి చేర్చాలి
- ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర కార్యదర్శి గోనెల కుమారస్వామి ముదిరాజ్



నవతెలంగా-జూబ్లీహిల్స్

ముదిరాజుల సంక్షేమానికి తెలం గాణ ప్రభుత్వం రూ.10వేల కోట్లను కేటాయించాలని ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర కార్యదర్శి గోనెల కుమార స్వామి ముదిరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఈ విషయమై మాట్లా డుతూ ముది రాజులు బీసీ రిజర్వేషన్లలో జరిగిన అన్యా యం కారణంగా రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. 2009లో జీఓ 15 ద్వారా బీసీ-డీ జాబితాలో నుంచి బీసీ-ఏ జాబితాలో చేరిన తమ సామాజికవర్గానికి ఆ ఆనందం ఎక్కువ కాలం నిలవలేదన్నారు. గత 14 సంవత్సరాల నుంచి తమ న్యాయమైన హక్కు కోసం పోరాడతా తమను బీసీ-ఏ జాబితాలో చేర్చేందుకు సుప్రీం కోర్టు 2022లో మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. అయి తే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ-ఏ జాబితాలో చేర్చ కుండా మీనమేషాలు లెక్కిస్తూ ముదిరాజులను మోసం చేసిందన్నారు. దీంతో ఎన్నికల్లో తమ సామాజిక వర్గం వారికి తగిన బుద్ధి చెప్పిందని పేర్కొ న్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ అంశాల్లో ముది రాజులను బీసీ-ఏ జాబితాలో మార్చే అంశాన్ని కూడా ప్రకటించారని గుర్తుచేశారు. ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే బీసీ-ఏ జాబితాలోకి మార్చాలని కాంగ్రెస్ ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే తమ ప్రధాన కుల వృత్తిని వదిలి ఎంతో మంది ముదిరాజులు రోజువారీ కూలీ లుగా, వీధి వ్యాపారులుగా ఇతర రెక్కల కష్టంతో బ్రతు కులీడుస్తున్నార న్నారు. వారిని ఆదుకుని ముదిరాజుల అభ్యున్నతికి బాటలు వేయాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఓయూ వృక్ష శాస్త్ర సెమినార్

- మొక్కలను పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ. లింబాద్రి



నవతెలంగాణ-ఓయూ

అంతరించిపోతున్న జాతి మొక్కలను పరిరక్షించుకునేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొ.ఆర్.లింబాద్రి వృక్ష శాస్త్ర ప్రొఫెసర్స్‌కు సూచించారు. ఉస్మానియా యూనివర్సిటీ బోటనీ విభాగం వందేళ్ళ పూర్తవుతున్న సందర్భంగా శతాబ్ది ఉత్స వాల్లో భాగంగా బుధవారం ఈ వేడుకల్లో భాగంగా 'అడ్వా న్సెస్ ఇన్ ప్లాంట్ సైన్సెస్ -ఫర్ సస్టైయిన బుల్ ఫ్యూచర్' అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వ హి స్తున్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కార్యాలయ భవనంలో కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సదస్సు ప్రారం భోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రొ. లింబాద్రి హాజరయ్యారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ. పర్యావరణ పరిరక్షణలో ఉస్మానియా యూనివర్సిటీ బోటనీ విభాగం కృషి ఎంతో గొ ప్పదని కొనియాడారు. వర్సిటీ క్యాం పస్‌లో ఆక్సిజన్ పార్కు అభివృద్ధి చేయ డంలో విభాగం ఎంతో కష్టపడిందని గుర్తు చేశారు.ఆపార్కులో నాటిన మొ క్కలపై సైటేషనన్ను ఏర్పాటు చేయా లని సూచించారు. మారుతున్న కాలా నికి "అనుగుణంగా కాలుష్యం పెరిగిపో తోందని, మొక్కలను ఎక్కు వగా నాటా ల్సిన అవసరం ఉందని అభిప్రాయప డ్డారు. ఈ కార్యక్ర మంలో ఓయూ వీసీ ప్రొ.రవీందర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.వీరయ్య, డీన్ ప్రొ.కరుణసాగర్, విభాగం హెడ్ ప్రొ.బి.రమాదేవి, బీవోఎస్ చైర్మెన్ సబితా రాణి, ప్రొ.కమలాకర్, శైలజా, డా.నాగేశ్వ రరావు, కిరణ్ కుమార్, డా.సుమన్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

కోర్టు తీర్పుతో ఓయూలో సంబరాలు

నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ రాష్ట్రంలో అన్ని నోటిఫికేషన్స్‌లలో జన రల్ పోస్టులను మహిళలకి కేటాయిస్తూ ఇవ్వడం వల్ల పురు షులకి తీరని అన్యా యం జరిగిందని, రిజర్వేషన్ విధానానికి విరుద్ధంగా భర్తీ చేసి సమాంతర రిజర్వే షన్లు అమలు చేయలేదనీ వ్యతిరేకిస్తూ ఉద్యమం చేసిన కంభంపాటి సత్యనారాయణ ప్రజాపతి రీసెర్చ్ స్కాలర్, ఓయూ ఆధ్వర్యంలో కోర్టులో కేసు గెలుపొందినట్లు తెలిపారు. దీనిపట్ల చొరవ తీసుకున్న ప్రభుత్వానికి అండ్‌సీఎం రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలియజేశారు. అదే విధంగా జీఓ1274 రద్దు పట్ల సీఎం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పిటిషనర్ కొంద్రపల్లీ శ్రీనివాస్, స్కాలర్స్ శ్రీను ఈ.రమేష్, కె. శ్రీను, నవీన్ మేకల, రామచంద్ర, విజయ్, ఆనంద్, ఉదయ్, చారీ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

తుది తీర్పు వెలువరించడం హర్షణీయం



తెలంగాణ రాష్ట్రంలో అన్ని నోటిఫికేషన్స్‌లలో జన రల్ పోస్టులను మహిళలకి కేటా యిస్తూ ఇవ్వడం వల్ల పురుషులకి తీరని అన్యా యం జరిగిందని, రిజర్వేషన్ విధానానికి విరుద్ధంగా భర్తీ చేసి సమాంతర రిజర్వేషన్లు అమలు చేయడం లేదని కోర్టులో కేసు వేసిన రిట్ పిటిషన్ విచారణలో భాగం గా సమాంతర రిజర్వేషన్లు అమలు చేయాలని తుది తీర్పు వెలువరించడం హర్షణీ య మని ఓయూ లీక్ నిరుద్యోగులు తెలిపారు. ఈ తీర్పు పట్ల సమాంతర రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు కంభంపాటి సత్యనారాయణ ప్రజాపతి రీసెర్చ్ స్కాలర్, ఓయూ ఆధ్వర్యంలో ఓయూ లీక్ నిరుద్యోగులు ధన్యవాదాలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశా రు. అదే విధంగా జీఓ 1274 రద్దు పట్ల సీఎం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పిటిషనర్ కొంద్రపల్లీ శ్రీనివాస్, స్కాలర్స్ శ్రీను ఈ.రమేష్, కె.శ్రీను, నవీన్ మేకల , రామచంద్ర, విజయ్, ఆనంద్, ఉదయ్, చారీ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి క్షమాపణలు చెప్పాలి



కాంగ్రెస్ నేత నరసింహ

నవతెలంగాణ-ఓయూ

సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్ వెంటనే క్షమాపనలు చెప్పాలని లేని యెడల నకిరేకల్ నియోజకవర్గంలో అడుగుపెట్టని య మని కాంగ్రెస్ సీనియర్ నేత వలిగొండ నరసింహ అన్నా రు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట జరిగిన విలేఖరుల సమావేశంలో అయిన మా ట్లాడుతూ ఓయూ విద్యార్థులు యువత ఎంతోమంది ఆత్మ బలిదానాలు త్యాగాలతో ఏర్పడ్డ స్వరాష్ట్ర తెలంగాణలో వంద లాదిమంది విద్యార్థుల త్యాగాల పునాదుల మీద ఎంపీ ఎమ్మెల్యేగా ఎన్నికై ఎదిగొచ్చి మూలాలను మరిచిపోయాడన్నారు. ప్రజా మద్ద తుతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్ను కోబడి, గడీల పాలన నుండి తెలంగాణ ప్రజల్ని విముక్తి చేసి ప్రజాపాలన అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి పైన దుర్భా షలాడిన బానిస బాల్క సుమన్ ఖబర్దార్ అని ఘాటుగా స్పందించారు. పోరాటాల పురిటి గడ్డ నకేరకల్‌లో అడుగుపెట్టె అర్హత లేదని, దమ్ముంటే నకిరేకల్ నియోజకవర్గంలో తిరగ నియ్యమని సవాల్ చేశారు.కొండారెడ్డిపల్లి శేఖర్‌పార్థు,సంజు విద్యార్థులు పాల్గొన్నారు.

సుమన్‌ను అరెస్ట్ చేయాలని ఓయూలో దీక్ష



నవతెలంగాణ-ఓయూ

సీఎం రేవంత్‌రెడ్డి మీద బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలుకు నిరసనగా ఉస్మానియా యూని వర్సిటీ విద్యార్థి నాయకుల ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజ్ ఎదుట బాల్క సుమన్‌ని తక్షణమే అరెస్ట్ చేయాలని నగేష్ దీక్ష చేశారు. ఆయ న మాట్లా డుతూ బాల్క సుమన్ అక్రమ ఆస్తుల మీద విచారణ చేపట్టా లని, రేవంత్‌రెడ్డికి క్షమాపణలు చెప్పాలని అనే డిమాండ్‌తో నిరాహార దీక్ష చేస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఓయూ జేఏసీ నాయకులు బోనాల నగేష్ వలిగొండ నరసింహతో కూడిన విద్యార్థి బృందం దీక్ష శిబిరానికి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఓయూ విద్యార్థి నాయకులు రెడ్డిశీను శాంతికుమార్ గడ్డం ప్రవీణ్ కుమార్ కొండా రెడ్డిపల్లి శేఖర్‌సంజు సాయికుమార్‌పార్థు నరేశ్ శ్యాంసుందర్ వెంకటేష్ పాల్గొన్నారు.

కార్యకర్తకు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ నివాళి



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

వెంగళరావునగర్ డివిజన్ నాయకుడు ఆంజనేయులు తండ్రి స్వర్గస్తులైన సందర్భంగా, వారి స్వగ్రామం పరిగిలో పెద్దకర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ శాసన సభ్యులు బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపీనాథ్ పాల్గొని వారి తండ్రి చిత్రపటానికి పూలు వేసి సంతాపం తెలియచేశారు.ఈ కార్యక్రమములో డివిజన్ నాయకులు రామకృష్ణ, వేణు, చిన్న రమేష్, సత్య, పవన్ ముధిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'ముదిరాజుల సంక్షేమానికి రూ.10 వేల కోట్లు కేటాయించాలి'



నవతెలంగాణ-చైతన్యపురి

ముదిరాజుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం రూ.10వేల కోట్లను కేటాయించాలని ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర కార్యదర్శి గోనెల కుమారస్వామి ముదిరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ముదిరాజుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. 2009లో జీఓ 15 ద్వారా బీసీ-డీ జాబితాలో నుంచి బీసీ-ఏ జాబితాలో చేరినా తమ సామాజికవర్గానికి ఆ ఆనందం ఎక్కువ కాలం నిలవలేదన్నారు. గత 14 ఏండ్ల నుంచి తమ న్యాయమైన హక్కు కోసం పోరాడితే తమను బీసీ-ఏ జాబితాలో చేర్చేందుకు సుప్రీం కోర్టు 2022లో మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తూ మోసం చేసిందన్నారు. దాంతోఎన్నికల్లో తమ సామాజికవర్గం వారికి తగిన బుద్ధి చెప్పిందన్నారు. కాంగ్రెస్ ముదిరాజులను బీసీ-ఏ జాబితాలో మారుస్తామన్నారని.. కావున హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తమ ప్రధాన కులవృత్తిని వదిలి ఎంతో మంది ముదిరాజులు రోజువారీ కూలీలుగా, వీధి వ్యాపారులుగా ఇతర రెక్కల కష్టంతో బతుకులీడుస్తున్నారన్నారు. వారిని ఆదుకోవాలని కోరారు.

'విద్యార్థులు రేపటి భావి పౌరులు..'

నవతెలంగాణ - ధూల్ పేట్

నేటి విద్యార్థులే రేపటి భావి పౌరులని జీయాగూడ ఆదిజాంభవ సంఘం కమిటీ పూర్వ అధ్యక్షులు ఎం.బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి సురేష్, కల్చరల్ సెక్రెటరీ ప్రేమ కుమార్ లు అన్నారు. 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలిద్దాం' అనే అంశం పై జీయగుడ ఇందిరానగర్ ఆది జాంభవ భవనంలో ఆ ప్రాంతం లోని పలు పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ అంశంపై వ్యాస రచన, డ్రాయింగ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిగ్రీ పూర్తి అయ్యేంతవరకు విద్యార్థులు విద్యలో క్రమశిక్షణతో మెలగాలన్నారు. విద్య తో పాటు సామాజిక కార్యక్రమాల్లో పాలుపొంచుకుని అవగాహన పెంపొందించుకోవడం అలవర్చుకోవాలన్నారు. అప్పుడే విద్యార్థులు నిజమైన భావిపౌరులుగా ఎదిగుతారని సూచించారు. విద్యార్థుల్లో అవగాహనకు చొరవ చూపిన ఆదిజాంభవ సంఘానికి హైదరబాద్ జిందాబాద్ అభినందనలు తెలిపింది. ఈ కార్యక్రమంలో హైదరబాద్ జిందాబాద్ సంస్థ జీయాగూడ అధ్యక్షులు ఏ.రాజుబాయి టీచర్లు లావణ్య, మనీష్ , ప్రసన్న తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రం అందించారు.

భారతీయ సంస్కృతికి ప్రతిబింబాలు
సంప్రదాయ జానపద కళలు



- సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

నవతెలంగాణ-కల్చరల్

భారతీయ సంస్కృతిని సాంప్రదాయాలను ప్రతిబింబించేవి సంప్రదాయ జానపద కళారూపాలు అని సాంస్కృతిక పర్యాటక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వీటిని పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై యాదాద్రి జాతీయ నత్య వేడుకలు రెండో రోజు కార్యక్రమానికి ముఖ్య.అతిథిగా మంత్రి పాల్గొని మాట్లాడుతూ కళా కతి నాట్య సంస్థ రెండు రోజులూ దేశంలోని పలు నత్య రీతులకు హైదరాబాద్ ను వేదిక చేయటం ముదావహం అన్నారు.కళాకతి నత్యాలయ సంస్థ స్థాపకురాలు భారతి దీ డాన్స్ ఇండియా మాస పత్రిక సంపాదకుడు విక్రమ్ గౌడ్, నత్య గురువులు కళా కృష్ణ డాక్టర్ వనజ ఉదయ్, డాక్టర్ ఏస్.పీ.భారతి, కె రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భం లో కళా కతి సంస్థ విద్యార్థులు కావడి చిందు డాక్టర్ రమా దేవి శిష్య బందం కూచిపూడి నత్య శైలి లో.అన్నమయ్య కీర్తన ఒరిస్సా కు చెందిన శ్వేత మహపత్రో ఒడిస్సీ తమిళ నాడు కు చెందిన మాధవపెద్ది మూర్తి బందం కూచిపూడి నత్యాలు ప్రేక్షకులను ముగ్ధ ల చేశాయి. నాట్య గురువు భారతి శివాజీ కి యాదాద్రి జీవన సాఫల్య పురస్కారం బహుకరించారు.

కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన సదస్సు



నవతెలంగాణ-సిటీబ్యూరో

జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన పక్షోత్సవాలను పురస్కరించుకొని బుధవారం యూహెచ్ఎన్సీ అంబం "పేట క్లస్టర్ కార్యా లయంలో కుష్టువ్యాధిపై అవగాహన నిర్వహించారు. ఈ సదస్సులో యాడ్/డీఎంహెచ్ఓ (ఎయిడ్స్ లేపరోస్కోప్) డా.నిర్మాలా ప్రభావతి, యూం "హెచ్సీ డాక్టర్లు, బస్తీ దావాఖాన డాక్టర్లు, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మానవ చర్మంపై స్పర్శలేని తెల్లని, ఎర్రని మచ్చలు గాని, లేక పాలపోయిన మొద్దుబారిన లక్షణాలు కలిగిన మచ్చలు, నరాలలో తిమ్మిర్లు, వాపు మొదలైన లక్షణాలు ఉంటే అవి కుష్టువ్యాధికి కిందికే వస్తాయని తెలిపారు. ఈ వ్యాధి ప్రారంభ దశలో లక్షణాలు గుర్తించి సరైన వైద్యులను కలిసి సరైన మందులను వాడితే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చున్నారు. కుష్టువ్యాధికి ఎండీటీ మందులు అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో ఉచితంగా లభిస్తాయని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీహెచ్ఓ డాక్టర్. హేమలత, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దీప్తి పటేల్, డాక్టర్ మనోజ్ మెడికల్ ఆఫీసర్, పీఎంఓ వనతి, డీపీఓఎం హరిచంద్రప్రసాద్, డీపీఎంఓ మెడికల్ ఆఫీసర్ సరళ, ఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయడమే నా లక్ష్యం

- బీఆర్టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

ఓ కంపెనీ యజమాన్యం నుంచి కార్మికుడికి రావాల్సిన రూ. 30 వేలను బీఆర్టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు రవిసింగ్ అందజేయించి ఆదుకున్నారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. షాపూర్ నగర్ ఇండస్ట్రియల్ "శ్రీ రాణి బువ్వల్ ఇండస్ట్రీస్ మ్యానుఫ్యాక్చర్ ఆఫ్ ఫ్యాన్స్ ప్రయివేటు లిమిటెడ్" సుభాష్ నగర్ కంపెనీలో స్వామి నాయుడు అనే కార్మికుడు గత కొన్ని సంవత్స రాలుగా కంపెనీలో పని చేసే వాడు. అనివార్య కారణాలవల్ల కొన్ని రోజులు పనికి రాలేక పోయాడు. కంపెనీ యాజమాన్యానికి ఇన్ఫర్మేషన్ ఇవ్వకపో వడంతో స్వామి నాయుడుని కంపెనీ నుంచి తీసేయడం జరిగింది. నవంబర్ నెల వేతనం 30వేల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా పలుమార్లు కంపెనీ యజమాన్యాన్ని అడిగినా యజమాన్యం నిర్లక్ష్యం వహిస్తూ పట్టించుకోనట్టు తెలిసింది. దాంతో విసుగు చెందిన కార్మికుడు తనకు తెలిసిన బంధువుల ద్వారా బీఆర్టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ గురించి తెలుసుకొని ఆయన ఆఫీస్ వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. వెంటనే కార్మిక నాయకుడు రవి సింగ్ హుటాహుటిన కంపెనీ వద్దకు బయలుదేరి కంపెనీ యజమాన్యంతో మాట్లాడి కార్మికుడికి రావాల్సిన నవంబర్ నెల వేతనం రూ .30 వేల ఇప్పించారు. అలాగే కార్మికులకు ఎలాంటి అన్యాయం జరిగిన సహించేది లేదని కంపెనీ యజమాన్యానికి తేల్చిచెప్పారు. కార్మికుడు స్వామి నాయుడు రవిసింగ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ చారి, మనోజ్ కుమార్, అనిల్ కుమార్, సుదర్శన్, జగన్ తదితరులు పాల్గొన్నారు..

బాల్క సుమన్‌పై కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు



నవతెలంగాణ - బాలానగర్

బాల్క సుమన్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. బాలానగర్ పోలీస్ స్టేషన్ లో కాంగ్రెస్ నాయకులు బుధవారం బాల్క సుమన్‌పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, తన స్థాయిని విస్మరించి సభ్య సమాజం తల దించుకునేలా వ్యవరించడం బాధాకరమని, వెంటనే బాల్క సుమన్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండు చేశారు. లేదంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి కొండ కింది పుష్పారెడ్డి, మాజీ చైర్మెన్ లక్ష్మయ్య, మేడ్చల్ జిల్లా ఎస్సీ విబాగం ఉపాధ్యక్షులు మధు మోహన్, బాలానగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టే ప్రసన్నకుమార్, సీనియర్ నేత ఎడ్ల మోహన్ రెడ్డి, లీగల్ సెల్ జావీద్ అలీ, డివిజన్ జనరల్ సెక్రెటరీ మహేందర్, సోషల్ మీడియా కన్వీనర్ శేఖర్, సీనియర్ నాయకులు అనిల్, ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్‌లు వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ - కూకట్ పల్లి

ఎన్నో పోరాటాలు, మరెన్నో ఉద్యమాలతో, ఏర్పడ్డ తెలంగాణలో ప్రభుత్వాలు మారినప్పటికీ, విద్యార్థులకు స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్మెంట్లు, అందని ద్రాక్ష లాగానే ఉండిపోయాయనీ ఏబీవీపీ కూకట్ పల్లి కన్వీనర్ ప్రతీక్ అన్నారు. ఏబీవీపీ కూకట్ పల్లి జిల్లా ఆధ్వర్యంలో రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ముంబై హైవే కూకట్ పల్లి లో రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ లో ఉన్నటువంటి రూ. 5300 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి విభాగ్ కన్వీనర్ శ్రీనాథ్, జిల్లా కన్వీనర్ ప్రతీక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవన్, భరత్, ఎస్ఎఫ్డీ కన్వీనర్ గోపాల్, నగర సంయుక్త కార్యదర్శి ఆయుష్, నిఖిల్, విద్యార్థులు పాల్గొన్నారు.



సేవాలాల్ మహారాజ్ మందిరాన్ని పరిశీలించిన డిప్యూటీ మేయర్

నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న సేవాలాల్ మహారాజ్ దివ్య మందిరాన్ని డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ బుధవారం సందర్శించారు. బంజారా ఆరాధ్య దైవమైన శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ జగదంబ దేవి భవ్య మందిరం త్వరగా పూర్తి చేయాలంటూ స్థానిక కార్పొరేటర్ బాలాజీ నాయక్‌కు, బంజారా కమిటీ వారికి తెలియజేశారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ తన వంతు సాయం ఎల్లపుడూ ఉంటుందని తెలిపారు.

పుట్టి యాదగిరి ముదిరాజ్ కు సేవారత్న అవార్డు



నవతెలంగాణ-అంబర్‌పేట:

తెలంగాణ ఉద్యమంలో బీఆర్ఎస్ నేత కేసీఆర్, మాజీ కేంద్ర మంత్రి ఆలె నరేంద్రతో కలిసి ఉద్యమంలో కీలకపాత్ర పోషించి, పలు కార్మిక సంఘాలకు అధ్యక్షుడిగా విశిష్ట సేవలు అందించిన తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పుట్టి యాదగిరి ముదిరాజ్ కు సేవారత్న అవార్డు లభించింది. ఆయన సేవలను గుర్తించి పినాకినీ మీడియా సంస్థ తన ఎనిమిదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో పుట్టి యాదగిరి ముదిరాజ్ సేవారత్న అవార్డుతో ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా సంస్థ సీఈఓ వంశీశాస్త్రి మాట్లాడుతూ యాదగిరి ముదిరాజ్ సేవలకు గానూ ఈ అవార్డును ప్రధానం చేయడం జరిగిందన్నారు. పుట్టి యాదగిరి ముదిరాజ్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ఈ ప్రతిష్టాత్మకమైన సేవారత్న అవార్డును అందజేయడం గర్వకారణమన్నారు.

డా.కడిమిళ్ళ వరప్రసాద్‌కు కె.వి రమణ జాతీయ పురస్కారం



నవతెలంగాణ-కల్చరల్

ప్రముఖ సాంస్కృతిక సంఘ సేవా సంస్థ వంశీ ఇంటర్నేషనల్ - ఇండియా నెలకొల్పిన డాక్టర్ కెవి రమణ జాతీయ జీవన సాఫల్య పురస్కారాన్ని 2024 సంవత్సరానికి సంబంధించి సహస్రావధాని డాక్టర్ కడిమిళ్ళ వరప్రసాద్‌కు ప్రకటించారు. ఫిబ్రవరి 9వ తేదీన రవీంద్రభారతిలో జరిగే కె వి రమణ 72వ జన్మదినోత్సవం సందర్భంగా డాక్టర్ కడిమెళ్ళకు తెలంగాణ పర్యాటకశాఖ సాంస్కృతిక శాఖా మాత్యులు జూపల్లి కష్ణారావు అవార్డును బహుకరిస్తారని వంశీ వ్యవస్థాపక అధ్యక్షులు వంశీ రామరాజు తెలియజేశారు. ఆ కార్యక్రమానికి పుష్పగిరి పీఠాధిపతి విద్యా శంకర భారతి స్వామి వారు, కిమ్స్ హాస్పిటల్ వ్యవస్థాపక అధ్యక్షులు, బొల్లినేని కష్ణయ్య, తనికెళ్ల భరణి, నంగునూరు చంద్రశేఖర్ పాల్గొంటా రన్నారు. శివశంకరి గీతాంజలి సంగీత విభావరి సమర్పిస్తారని తెలిపారు. సుధామయి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తారు.

తెలంగాణ అసెంబ్లీలో మహాత్మ జ్యోతిరావు, సావిత్రిబాయి పూలే విగ్రహాలు పెట్టాలి

- బీసీ జాతీయ కమిటీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ అసెంబ్లీలో మహాత్మ జ్యోతిరావు, సావిత్రిబాయి పూలే విగ్రహాలు పెట్టాలని బీసీ జాతీయ కమిటీ చైర్ పర్సన్ భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. ఆధర్ బ్యాక్వర్డ్ క్లాస్ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద శాంతి దీక్ష నిర్వహించారు. ఈ దీక్షలో మాజీ ఎమ్మెల్యే బుర్ర నర్సయ్య గౌడ్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, బీసీ జాతీయ కమిటీ చైర్ పర్సన్ భాగ్యలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రగతి భవన్‌కు మాహాత్మ జ్యోతిరావు పూలే పేరు పెట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ అసెంబ్లీలో జ్యోతిరావు, సావిత్రి భాయి పులే విగ్రహాలను పెట్టాలని సీఎం రేవంత్ కి విజ్ఞప్తి చేశారు. పదేళ్ళ అధికారంలో ఉన్న గుర్తుకురాని ఆదర్శ దంపతుల విగ్రహాన్ని ఏర్పాటు నినాదం ఇప్పుడు కవితకు గుర్తుకు రావడం సిగ్గుచేటన్నారు. అసెంబ్లీలో మహాత్మ జ్యోతిరావు, సావిత్రిబాయిల విగ్రహాన్ని మీరు ప్రతిష్టిస్తారా లేదా మమ్ములను ప్రతిష్టించుకోమంటారా అని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఈ దీక్షలో ఉద్యోగ సంఘాల నాయకులు దానకర్ణ చారి, బీసీ జాతీయ కమిటీ అడ్వైజర్ చిన్నయ్య, ఓబీసీ ఉద్యోగ సంఘాల అధ్యక్షులు రవికుమార్, సిహెచ్ రమేష్, తెలంగాణ ఓబిసి అధ్యక్షులు కాదూరి అచ్చయ్య, ఉద్యోగ సంఘాల అధ్యక్షులు రాజు, సంచార జాతుల అధ్యక్షులు చిత్తరంజన్, ఓబీసీ సెంట్రల్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ రంచి శ్రీనివాస్, సువర్ణ ,శ్రీనిధి ,అంబికా, యమున ,లత, తదితరులు పాల్గొన్నారు.

'శాసనసభ సమావేశాల్లో ప్రజల సమస్యలపై చర్చించాలి'

భారత లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

శాసన సభ సమావేశాల్లో ప్రజల సమస్యలు చర్చించాలని భారత లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రాకులాడ వద్దన్నారు. మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను రేషన్ కార్డుతో లింకు పెట్టకుండా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ ప్రాజెక్టులను కేంద్రానికి దారాదత్తం చేసే చర్యలపై చర్చించాలన్నారు. వీలైనంత తొందరగా కులగణన పూర్తి చేసి స్థానిక సంస్థల ఎన్నికలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో తెలంగాణ ప్రజల మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడవద్దని అన్నారు.

యాదయ్యకు ఘన సత్కారం..



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

నర్సింగ్ ఆఫీసర్ గా యాదయ్య కు ప్రభుత్వ ఉద్యోగం రావడంతో మహారాజ్ గంజ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామ్ చందర్ యాదయ్య ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనిత, సంజీవ, వినోద్, రాము, శ్రీకాంత్ ఎలిజిబెత్ ,ఆశ వర్కర్లు తదితరు పాల్గొన్నారు.

'నూతన పీటీఈ కోర్ ఇంగ్లీష్ ప్రావీణ్యత పరీక్ష కోసం బుకింగ్‌లను ప్రారంభించిన పియర్సన్'

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ప్రముఖ లెర్నింగ్ కంపెనీ, పియర్సన్ దాని సరికొత్త ఆంగ్ల భాషా ప్రావీణ్యత పరీక్ష పీటీఈ కోర్ కోసం బుకింగ్‌లను ప్రారంభించినట్లు పియర్సన్ ఇండియా ఇంగ్లీష్ లాంగ్వేజ్ లెర్నింగ్ డైరెక్టర్ ప్రభుల్ రవీంద్రన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీటీఈ కోర్ గత ఏడాది ఇమ్మిగ్రేషన్, రెఫ్యూజీస్, సిటిజెన్‌షిప్ కెనడా నుండి ఆమోదం పొందిందని, ఇప్పుడు కెనడా లేదా కెనడియన్ పౌరసత్వానికి శాశ్వత ఆర్థిక వలస ప్రయోజనాల కోసం ఆంగ్ల భాషా ప్రావీణ్యం రుజువును అందించడానికి మొదటి పీటీఈ కోర్ పరీక్షలు ఈనెల 13 వరకు తీసుకోవచ్చునన్నారు. పీటీఈ కోర్ అనేది పియర్సన్ టెస్ట్ ఇంగ్లీష్ పోర్ట్ ఫోలియోకు నూతన జోడింపు, పీటీఈ అకడమిక్ అనేక ప్రత్యేక లక్షణాలను పంచుకుంటుందని, ఇది రెండు గంటల కంప్యూటర్ ఆధారిత పరీక్ష కేంద్ర వాతావరణంలో నాలుగు కీలక ఆంగ్ల భాషా నైపుణ్యాలను పరీక్షిస్తుందని, మాట్లాడటం, వినడం, చదవడం, రాయడం ప్రధాన వ్యత్యాసం ఏమిటంటే పీటీఈ కోర్ అనేది వృత్తి పరమైన పరీక్ష రాసే వారికి సంబంధించిన దని, ఇది నిజ జీవితంలో నాన్-అకడమిక్ దృష్టితో రూపొందించబడిందన్నారు. ఈ పరీక్ష రాసేవారు పీటీఈ కోర్‌ను 24 గంటల ముందుగానే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చని, ఏడాది పొడవునా ప్రపంచవ్యాప్తం గా పరీక్షా కేంద్రాల స్లాట్‌ల ప్రయోజనాన్ని పొందవచ్చు నని సగటున రెండు రోజుల్లో ఫలితాలను పొందవచ్చునని ఆయన తెలిపారు.

అధ్యయనం ఎప్పుడూ మరవద్దు..

- ఇంపాక్ట్ ఫౌండేషన్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.ఆది నారాయణ రెడ్డి



నవతెలంగాణ-అంబర్ పేట

ఒక మహానుభావుడు చెప్పినట్లు ప్రతి ఒక్కరూ నిత్య విద్యార్థేనని చదవడం నేర్చుకో వడం అధ్యయనం చేయడం ఎప్పుడూ మరవద్దని నిత్య కృత్యం కావాలని అప్పుడే వ్యక్తి పరిపూర్ణుడు అవుతాడని ఇంపాక్ట్ ఫౌండేషన్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఆది నారాయణ రెడ్డి అన్నారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఇరవైనాలుగు రోజుల పాటు నిర్వహించిన అవగాహన, భవిష్యత్తు కార్యాచరణ శిక్షణ కార్యక్రమంలో హైదరా బాద్ గోల్నాకకు చెందిన సీర్లంచ రమేష్ శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రశంస పత్రాన్ని అందజేశారు. మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల నుండి విశేష స్పందన లభించిందని డాక్టర్ ఆది నారాయణ రెడ్డి తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న సీర్లంచ రమేష్ మాట్లాడుతూ తాను మాదాపూర్‌లోని ఐటి కంపెనీలో అకౌంట్స్ హెడ్‌గా విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ ద్వారా తాను ఎన్నో విషయాలను తెలుసుకోవడం, నేర్చుకోవడం చేశానన్నారు. తాను తెలుసుకున్న విషయాలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అవగాహనా కల్పించి వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసి వారు భవిష్యత్తు లో ఏది సాధించాలి అనుకుంటున్నారో దానిపై అవగహన కలిపిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో ఇంపాక్ట్ ఫౌండేషన్ ఫౌండర్ గంప నాగేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థి మేధస్సుకు పదును..!

- 12న జిల్లా స్థాయి పోటీల నిర్వహణకు అధికారుల ఏర్పాట్లు
- విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలి: డీఈవో రోహిణి


ఫైల్ ఫోటో

నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి విజ్ఞాన అంశాలపై దృష్టి పెట్టేలా విద్యాశాఖ ప్రోత్సహిస్తోంది. వివిధ దశల్లో వైజ్ఞానిక మేళాలు, ప్రేరణ తదితర కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా సైన్స్ దినోత్సవం సందర్భంగా 2న నాంపల్లిలోని ప్రభుత్వ మోడల్ ఆలియా ఉన్నత పాఠశాలలో పిల్లలకు పోటీలు నిర్వహించనుంది. తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ- పరిశోధన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పలు అంశాల్లో ఈ పోటీలు నిర్వహించనున్నట్టు డీఈవో ఆర్.రోహిణి తెలిపారు.



విద్యార్థులకు నిర్వహించే పోటీలు

(1) పెయింటింగ్ (2) కవిత్వం (3) పాటల పాడటం (4) ఉపన్యాస పోటీలు

ప్రధాన అంశం :

'సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్(సైన్స్ ఫర్ సస్టైనబుల్ ఫ్యూచర్)

ఉప అంశాలు

(1) చెత్తను తగ్గించడం (Reduse waste)
(2) ఈ-వ్యర్థాలను తగ్గించడం (Reduce e- waste)
(3)ఆరోగ్యకరమైన అలవాట్లు దత్తత తీసుకోవడం (Adopt heathy Life styles)
(4) సుస్థిరమైన ఆహార వ్యవస్తను దత్తత తీసుకోవడం (Adopt Sustainable food waste)
(5) ఒక సారి వాడి పారవేసే ప్లాస్టిక్‌కు నో చెప్పండి (Say no to single use plastic)
(6) నీటిని పొదుపు చేయాలి (Save water)
(7) శక్తిని కాపాడడం (Save Energy)

పోటీ జరిపే విధానం

(1) విద్యార్థులు 7 అంశాలలో ఏదైనా ఒక అంశంపై మాత్రమే పాల్గొనాలి, రెండు లేదా మూడు అంశాలు అంపిక చేసుకోకూడదు.

(2) పెయింటింగులో పాల్గొనేవా రు కలర్స్, బ్రష్‌లు, చార్ట్, స్కేల్ విద్యార్థులు తెచ్చుకోవాలి, పెయింటింగ్ గరిష్ట సమయం 45 నిముషాలు

(3) కవిత్వం ఒక అంశం పేజీకి మించకూడదు , సమయం 3-5 నిముషాలు.

(4) పాటలు ఏదైనా ఒక అంశం ఎంచుకొని పాటలు పాడవలెను. సమయం 6 నిముషాలు

(5) ఉపన్యాసం ఒక అంశంపైన ఉపన్యాసం ఇవ్వాలి, సమయం 6 నిముషాలు.

(6) ఒక్కొక్క పోటీ నుంచి ముగ్గురు చొప్పున ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపిక చేసి.. 28న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నారు.

నాలుగు రకాల పోటీల్లో 12 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి సి. ధర్మేందర్ రావ్‌ను 7799171277కు సంప్రదించాలని సూచించారు.

జర్మన్ భాషా శిక్షణా ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

పంజాగుట్ట నిమ్స్ సమన్వయంతో టామ్కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్పవర్ కంపెనీ లిమిటెడ్) నర్సుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక జర్మన్ భాషా శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ (ఎస్ఇటిఎఫ్) ప్రారంభించారు. యూకే, యూఎస్ఏ, జపాన్, జర్మనీ వంటి అభివద్ధి చెందిన దేశాల్లో తెలంగాణ శ్రామికశక్తికి విదేశీ ఉపాధి అవకాశాలను పెంపొందించడానికి, సష్టించడానికి రాష్ట్ర ప్రభుత్వాల ప్రయత్నాల్లో ఈ చొరవ భాగం. ఈ సందర్భంగా రాణి కుముదిని మరిన్ని సామర్థ్యాలను పెంపొందించే కార్యక్రమాలను చేపట్టడానికి, తెలంగాణ యువతకు సురక్షితమైన, చట్టబద్ధమైన వలస మార్గాల ద్వారా విదేశీ ఉపాధి అవకాశాలను సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ భీరప్ప నగరి, ఐరోపా దేశాల్లో నైపుణ్యం కలిగిన వర్కర్స్‌కు అధిక డిమాండ్ ఉందని, నర్సులను సమీకరించి శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న చొరవను అభినందించారు. జర్మన్ భాషా శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ప్రారంభించడం తెలంగాణ శ్రామికశక్తికి అంతర్జాతీయ నైపుణ్యాలు, అవకాశాలతో సాధికారత కల్పించేందుకు ఒక ముఖ్యమైన ముందడుగు. భారతదేశం, జర్మనీల మధ్య వలసలు, చలనశీలత భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి దోహదం చేస్తుంది. ఈ కార్యక్రమంలో టామ్కామ్ వైస్ చైర్‌పర్సన్ రాణి కుముదిని (రిటైర్డ్ ఐఏఎస్), నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ భీరప్ప నగరి, టామ్కామ్ ప్రత్యేక కార్యదర్శి, సీఈఓ డాక్టర్ ఇ.విష్ణు వర్ధన్ రెడ్డి, డాక్టర్ లీజా రాజశేఖర్, డీఎస్ నిమ్స్, డాక్టర్ తాడూరి గంగాధర్ నిమ్స్ ప్రొఫెసర్, ప్రశాంత్ సీఈఓ 25మ్స్, ఈ టామ్ కామ్, నిమ్స్ ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

'గంగపుత్రులు అన్ని రంగాల్లో రాణించాలి'



- గంగపుత్రుల డైరీ ఆవిష్కరణ..

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

గంగపుత్రులు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర అధ్యక్షులు గడప శ్రీహరి పిలుపునిచ్చారు. నగరంలోని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం 10వ వార్షికోత్సవం సందర్భంగా డైరీ - 2024 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆవిష్కరించి ప్రసంగించారు. రాష్ట్రంలోని గంగపుత్రుల్లో హక్కుల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో గంగపుత్రులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో డైరీ కన్వీనర్ ఎర్రబోయిన మల్లేష్ , సంపత్ కుమార్ హైదరాబాద్ నగర టీఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షులు కే శ్రీకాంత్, రాష్ట్ర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బి లక్ష్మయ్య, హైకోర్టు అసోసియేషన్ కోశాధికారి పూర్ణ శ్రీ, కాంగ్రెస్ పార్టీ ఫిషర్మెంట్ సెల్ చైర్మెన్ మెట్టు సాయి, ప్రదేశం గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షులు శివరత్నం, నగర గంగపుత్ర సంఘం అధ్యక్షులు చాట్ల సదానంద్, రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షులు అంబటి సుధాకర్, గంగపుత్ర చేర్యా సంగీత, మంగలిపెల్లి సునీత భగవాన్, ఓం ప్రకాష్, పిల్లి శంకర్, బీజ్జ శత్రు తదితరులు పాల్గొన్నారు.

'నేతాజీ లాంటి వారిని ఆదర్శంగా తీసుకొని ఉద్యమించాలి'



నవతెలంగాణ-మెహిదీపట్నం

నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి మహోత్సవాల సందర్భంగా విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పదవ మహాసభలు నిర్వహించారు. లకిడికాపూల్‌లోని సామ్రాట్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ప్రముఖ రచయిత రాపోలు సుదర్శన్ హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులలో క్రమశిక్షణ నైతిక విలువలు కొరవడుతున్న ఈ సమయంలో నేతాజీ లాంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యల పట్ల నేతాజీ లాంటి గొప్ప వారిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ఉద్యమించాలన్నారు. ఆ తర్వాత ఏఐడీఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు మల్లేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో 500 కోట్లకు పైగా ప్రభుత్వం స్కాలర్షిప్ బకాయిలు ఉన్నాయని దీని వలన మధ్యతరగతి, పేద విద్యార్థులు చాలా కష్టాలకు గుర వుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం విద్యార్థుల స్కాలర్షిప్‌ల బకాయిలు చెల్లించి విద్యారంగానికి అవసరమైనటు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ సాధనకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. తర్వాత హైదరాబాద్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీకి అధ్యక్షులుగా నితీష్, ఉపాధ్యక్షులుగా ప్రతిభ, వినోద్, కార్యదర్శిగా నాగరాజు, సభ్యులుగా శశాంక్, సిద్దార్థ, మన్సూర్, ప్రణవ, నరేష్, నిహిత , అభిషేక్ ల తో కూడిన 50 మందిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ విద్యాలయాల నుంచి విద్యార్థులు హాజరైనారు.

నేటి నుంచి హైటెక్స్‌లో జీఎస్ఐ ఎక్స్‌పో 2024 ప్రదర్శన

- మూడు రోజుల పాటు ప్రదర్శన
- జాతీయ అంతర్జాతీయ ఉత్పత్తుల వేదికగా ఎక్స్‌పో



నవతెలంగాణ-అంబర్‌పేట

జీఎస్ఐఎక్స్‌పో 2024కు హైదరాబాద్ వేదిక అవుతోంది. ఎక్స్‌పో గెలాక్సియా ఆధ్వర్యంలో హైటెక్స్‌లో గిఫ్ట్ అండ్ స్టేషనరీ ఇండియా 2024 పేరుతో మూడు రోజుల పాటు ప్రత్యేక ప్రదర్శన నిర్వహిస్తున్నారు. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు జరిగే ఎక్స్‌పోలో దేశ విదేశాలకు చెందిన పలు బ్రాండింగ్ కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నట్లు ఎక్స్‌పో గెలా క్సియా ఇన్‌చార్జ్ రాఖీ ముఖర్జీ తెలిపారు. స్వచ్ఛంద సంస్థ ది కార్పొరేట్ గిఫ్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీజీఏఐ) కు చెందిన సభ్యులు ఈ ఎక్స్‌పోలో పాల్గొంటున్నారు. ప్రతీ ఏటా రూ.4వేల కోట్ల విలువల ఇండియన్ స్టేషనీ ఇండస్ట్రీలో వచ్చిన విప్లవాత్మకమైన ప్రాడక్ట్‌లు, కొత్త బ్రాండ్‌లన్నింటిని ఒక వేదిక మీదికి తీసుకువచ్చి ఈ ఎక్స్‌పో నిర్వహిస్తున్నారు. ఈ ప్రదర్శనలో బ్రాండింగ్ మిషనరీలు, కెమెరాలు, హ్యాండీ క్రాఫ్ట్స్, నావెల్టీస్, ఫోటో ఫ్రేమ్స్, కంప్యూటర్, మొబైల్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, డ్రై ఫ్రూట్స్ , గిఫ్ట్ హ్యాంపర్స్, డెకోరేటివ్ ఐటమ్స్, కాస్ట్యూమ్స్, స్కూల్, కాలేజీలు, ఆఫీస్‌లకు సంబంధించిన స్టేషన్‌లతో పాటు జర్నల్స్, ఆన్‌లైన్ పోర్టల్స్ ప్రదర్శనలో పాల్గొంటాయి. ఒక్క తెలంగాణలోనే 230 మిలిన్ డాలర్ల ఐటీ, సాఫ్ట్ వేర్ , బ్యాంకింగ్, ఫార్మా , అగ్రికల్చర్ కార్పొరేట్ గిఫ్ట్ బిజినెస్ జరుగుతుంది. ఈనేపథ్యంలో హైదరాబాద్‌లో ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ఎక్స్‌పో గెలాక్సియా ప్రతినిధి రాఖీ ముఖర్జీ వెల్లడించారు.

16న సమ్మె, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయండి

- ఐఎఫ్‌టీయు జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్
- ఐఎఫ్‌టీయు రాష్ట్ర కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 16న దేశ వ్యాప్తంగా గ్రామీణ బంద్ పారిశ్రామిక సమ్మెకు 10 కార్మిక సంఘాలతో కలిసి సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పిలుపునిచ్చిందని ఐఎఫ్‌టీయు జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్ అన్నారు. దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని విద్యానగర్ మార్క్స్ భవన్‌లో ఐఎఫ్‌టీయు రాష్ట్ర కార్యాలయం నందు పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా టి.శ్రీనివాస్, ఐఎఫ్ టీయు జాతీయ ఉపాధ్యక్షులు బి.ప్రదీప్ లు మాట్లాడుతూ ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఆర్భాటం గా ప్రకటించినా, పేదలు తదితరుల బ్యాంకు ఖాతాల్లోకి రూ. 15 లక్షలు జమచేస్తున్నప్పటికీ, దశాబ్ద కాలంగా సాగుతున్న బీజేపీ ప్రభుత్వ పాలనలో ప్రజల ప్రాథమిక సమస్యలను పెద్దగా పరిష్కరించకపోగా, వాస్తవం మాత్రం అలాంటి వాగ్దానాలకు ద్రోహం చేస్తోందన్నారు. యాభై ఏళ్ల క్రితం కంటే నిరుద్యోగం అత్యధికంగా ఉంది. గత పదేళ్లలో "అచ్చే దిన్", "మెరుస్తున్న భారతదేశం అనే చర్చ వాస్తవ వాస్తవాల వెలుగులో కేవలం నినాదాలు గానే మిగిలిపోయ నన్నారు. శ్రామిక ప్రజల వేతనాలు 20% పడిపోయాయి ధరల పెరుగుదల ఈ కాలంలో అపూర్వమైనదగా ఉంద న్నారు. స్వచ్ఛంద, స్కీమ్, గిగ్ మొదలైన వాటిని పేర్కొన డం ద్వారా కార్మికులకు హెూదా వేతనాలు నిరాకరించబడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణతో కార్పొరేట్ రంగం సేవలో ఒక విధానంగా, కాంట్రాక్టు కార్మికుల ఉపాధి వైపు డ్రైవ్ మరింత ఉధృతం చేయబడింది. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ .జనార్దన్, ఉపాధ్యక్షులు అరుణ, దాసు, ఐ .కృష్ణ, భుమేశ్వర్ సహాయ కార్యదర్శులు భూమయ్య వెంకన్న, గంటా నాగయ్య, వై. గీత ,కోశాధికారి సారంగ పాణి రాష్ట్ర కమిటీ సభ్యులు నరేష్, బ్రహ్మానందం, సూర్య శివాజీ,మల్లయ్య, నాగేశ్వరరావు,శ్రీనివాస్, లింగ్యా, ఐ.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రమణాచారి వంటి అధికారులు పాలన పరంగా అవసరం

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డీ. శ్రీధర్ బాబు



నవతెలంగాణ-కల్చరల్

ప్రభుత్వ పాలనా రంగంలో ఎ శాఖలో ఉన్నా సానుకూల దక్పథంతో సమస్యలను పరిష్కరించే సహదయుడు రమణాచారి అని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డీ. శ్రీధర్ బాబు కొనియాడారు. పాలనా పరంగా అయన సలహాలు సూచనలు నేటి ప్రభుత్వానికి అవసరం అని, ముఖ్య మంత్రి తో ఈ విషయమై చర్చిస్తామని తెలిపారు. నల్లకుంట లోని శంకర మఠం లో కిన్నెర ఆర్ట్స్ నిర్వహణలో విశ్రాంత సివిల్ సర్వీస్ అధికారి డాక్టర్ కె వి రమణ జన్మ దిన సందర్భంలో జరుగుతున్న హరికథ సప్త హాంలో ముగింపు కార్యక్రమంలో మంత్రి పాల్గొని రమణాచారి దంపతు లను సత్కరించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం చెప్పుకోదగ్గ ఉత్తమ పాలనాధ్యక్షుడు రమణాచారి అని ఇట్టి అధికారి తెలంగాణ వారు కావటం మనకు గర్వ కారణం అన్నారు. ఆయన సాహితీ కళా రంగలకే కాక సేవా కార్యక్రమలలో కూడా ముద్ర వేసుకున్నారని అభినందించారు. అయన పదవీ విరమణ చేసినా కార్యక్రమాలకు విరమణ చేయలేదని అన్నారు. కిన్నెర రఘురాం అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ వల్లీశ్వర్ అశ్వనీ సుబ్బారావు, కష్ణా రావు, రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి తొలుత మదనపల్లి కి చెందిన సత్యవతి సీతా కళ్యాణం హరి కథ గానం మధురం గా ఆలపించారు.

తహసీల్దార్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్:

మల్కాజిగిరి నూతన తహసీల్దార్ గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కష్ణను బుధవారం కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు మోమిన్ బాషా మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలబొకే ఇచ్చి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆశ, నరసింహ గౌడ్, గిరి యాదవ్, రహీం,వెంకటేష్, భాగ్యలక్ష్మి, గౌసియా, చైనా రాణి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కళలు సాహిత్యానికి సాంస్కృతిక సంస్థలు ఆలంబనలు

- ఆచార్య కొలకలూరి ఇనాక్



నవతెలంగాణ-కల్చరల్

కళలు సాహిత్యానికి సాంస్కృతిక సంస్థలు అలంబనలు అనీ అట్టి సంస్థలలో త్యాగరాయ గానసభ చేస్తున్న సేవలు విశేషమని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అభినందిం చారు. శ్రీ త్యాగరాయ గానసభ నిర్వహణలో గాన సభ లోని లలిత కళా వేదిక పై డాక్టర్ కె వి రమణ జన్మ దిన సందర్భంలో జరుగుతున్న నత్య సాహిత్య సంగీత ఇతర కళా ప్రక్రియలలో భాగంగా బుధ వారం జరిగిన సాహిత్య కార్యక్రమంలో రఘు శ్రీ రచించిన కవీంద్ర మోక్ష కు నిర్మల చేసిన హిందీ అనువాద సంపుటి ఆవిష్కరణ కవి సమ్మేళనం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య కొలకలూరి ఇనాక్ సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. మూల కవితలు భావం మారకుండ హిందీలోకి నిర్మల యధా తథం గా అనువదించి న్యాయం చేశారన్నారు. రమణాచారి జన్మ దినాన్ని పురస్కరించుకు ని గాన సభ బుర్ర కథ వంటి కళాకారులను ఎంకరేజ్ చేయటం ప్రశంసనీయం అన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో సినీ దర్శకుడు లక్ష్మణ రేఖ గోపాల కష్ణ, కవి కామేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు అనంతరం జరిగిన కవి సమ్మేళనం లో రఘు శ్రీ నిర్వహించగా వెంకట స్వామి, కనకా చారి , బాల గంగాధరయ్య, డాక్టర్ నాగేశ్వర రావు తదితరులు స్వీయ కవితలు చదివారు.

బీట్‌రూట్‌తో...

బీట్‌రూట్ అంటే చాలా మంది అయిష్టత చూపుతారు. కానీ ఇది అందానికీ, ఆరోగ్యానికీ చేసే మేలు గురించి తెలుసుకుంటే మాత్రం వదిలిపెట్టరు. ఈ బీట్‌రూట్‌ను పచ్చిగానే కాకుండా, జ్యూస్‌లా, పచ్చడిలా, జెల్‌లా చేసుకోవచ్చు. వీటిని గారెలుగా వేసుకుని తిన్నా శరీరానికి పోషకాలు అందుతాయి. సో.. ఈ బీట్‌రూట్‌తో చేసుకోగలిగే కొన్ని వంటలు ఈ వారం...




గారెలు

కావాలసిన పదార్థాలు : బీట్‌రూట్ తురుము - కప్పు, క్యారెట్ + క్యాబేజీ తురుము - అరకప్పు, శనగపప్పు - రెండున్నర కప్పులు, కందిపప్పు - అరకప్పు, ఉడికిన అన్నం - అరకప్పు, ఎండుమిర్చి - పది, సోంపు - మూడు చెంచాలు, జీలకర్ర - చెంచా, అల్లం తురుము - రెండు చెంచాలు, కొత్తిమీర తరుగు - అరకప్పు, ఉల్లికాడల తరుగు - అరకప్పు, ఉల్లి తరుగు - ఒక కప్పు, ఉప్పు - రుచికి తగినంత, నూనె - వేగించడానికి సరిపడా.

తయారు చేసే విధానం : గోరువెచ్చని నీటిలో పప్పుల్ని రెండు గంటలు నానబెట్టి, నీరు వడకట్టి కచ్చాపచ్చాగా రుబ్బుకోవాలి. జీలకర్ర, సోంపు, ఎండుమిర్చి కలిపి పొడి చేసుకోవాలి. ఒక పాత్రలో అన్నం, జీలకర్ర మిశ్రమం, రుబ్బిన పప్పులు, బీట్‌రూట్, క్యారెట్, క్యాబేజీ, కొత్తిమీర తురుము, ఉప్పు వేసి బాగా కలిపి ముద్దలా చేసుకోవాలి. తర్వాత అరంగుళం మందంగా గారెలు వత్తుకొని నూనెలో వేసుకుని, స్టవ్ మంటను మధ్యస్తంగా పెట్టుకుని దోరగా (లోపల కూడా ఉడికేలా) వేయించుకోవాలి. ఈ గారెలు వేడివేడిగా టమోటా కెచప్‌తో కలిపి తింటే బాగుంటాయి.

పోషకాలు

- ఇందులోని ఇనుము రక్తహీనత రానివ్వకుండా చేస్తుంది. దీన్ని రోజూ తింటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రక్తప్రసరణ సక్రమంగా జరిగేలా చేస్తూ అధిక రక్తపోటుని నిలువరిస్తుంది. రక్తాన్ని శుద్ధిచేయడంలోనూ ఇందులోని పోషకాలు తోడ్పడతాయి.
- దీనిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఒత్తిడిని అదుపులో ఉంచి, జీర్ణక్రియను వేగవంతం చేస్తాయి.
- బీట్‌రూట్‌లోని సిలికాన్ ఖనిజం చర్మం తాజాగా కనిపించడానికీ, గోళ్లు, జుట్టు పెరగడంలో కీలకంగా పనిచేస్తుంది.
- కండరాల సమస్యకు బీట్‌రూట్ చక్కని పరిష్కారం.
- కంటి చూపును మెరుగు పరచడంలో దీని పాత్ర కీలకం.
- బీట్‌రూట్‌తో గుండె ఆరోగ్యం కూడా పదిలంగా ఉంటుంది.







పచ్చడి

కావాలసిన పదార్థాలు : మీడియం సైజు బీట్‌రూట్ - ఒకటి, కొబ్బరికోరు- పావు కప్పు, పచ్చిమిర్చి - ఒకటి, అల్లం తురుము - చెంచా, పెరుగు- ముప్పావు కప్పు, ఉప్పు - రుచికి తగినంత, కొత్తిమీర తరుగు - అలంకరణకు
తాలింపు కోసం : నూనె, ఆవాలు, ఇంగువ, కరివేపాకు (అన్ని తగిన మోతాదులో)

తయారు చేసే విధానం : బీట్‌రూట్ తొక్క తీసి, పెద్ద ముక్కలుగా కట్ చేసి కొద్దినీటిలో ఒక విజిల్ వచ్చేవరకు కుక్కర్లో ఉడికించాలి. ఈలోపు కొబ్బరి కోరు, పచ్చిమిర్చి, అల్లం మెత్తగా రుబ్బుకుని ఆవాలు, ఇంగువ, కరివేపాకుతో తాలింపు పెట్టి పక్క నుంచాలి. ఉడికిన బీట్ రూట్ ముక్కల్ని సన్నగా తురిమి, పెరుగు, ఉప్పుతో పాటుగా తాలింపు మిశ్రమంలో కలిపి కొత్తిమీరతో అలంకరించాలి. ఈ పచ్చడి బిర్యానీ రైస్, పరాటాలతో బాగుంటుంది.

జెల్

కావాలసిన పదార్థాలు : మీడియం సైజు బీట్‌రూట్‌లు - రెండు, చెక్కెర - పావు కప్పు, యాలకుల పొడి - అర చెంచా, నీరు - తగినంత.

తయారు చేసే విధానం : బీట్‌రూట్‌లను ఉడికించి, తొక్కతీసి ముక్కలుగా చేసుకుని మిక్సీలో పేస్టు చేసుకోవాలి. ఈ పేస్టులో చెక్కెర కలిపి సన్నటి మంటపై దాదాపు 40 నిమిషాలు అడుగంటకుండా కలుపుతూ ఉడికించాలి. మరీ ముద్దలా అనిపిస్తే రెండు టేబుల్ స్పూన్ల నీరు పోసుకోవచ్చు. తీగ పాకం రాగానే స్టవ్ ఆఫ్ చేసేసి యాలకుల పొడి చల్లాలి. పిల్లలు ఇష్టంగా తినే ఈ జెల్లీ ఫ్రిజ్‌లో వారం రోజుల పాటు నిలువ ఉంటుంది.



"పుట్టినరోజు పండుగే అందరికీ.. పుట్టింది ఎందుకో తెలిసేది కొందరికే" అంటారు సినారే. ఆ కొందరిలో డా.కందాళ శోభారాణి కూడా ఒకరు. ఆమె జీవితం వడ్డించిన విస్తరి కాదు. ముళ్లు, రాళ్లు ఎన్నున్నా రాజీలేని పోరాటం చేసి నిటారుగా నిజాయితీగా నిలబడిన వ్యక్తిత్వం. తన కలాన్ని గళాన్ని ఎప్పటికప్పుడు పదును పెట్టుకుంటూ రాటుదేలిన సామాజిక ఉద్యమ కర్తగా ఎదిగిన రచయిత. ఫిబ్రవరి 8న జరగబోయే ఆమె మొదటి యాది సభ సందర్భంగా...

ఉద్యమ బాటసారి శోభక్క

డా. కందాళ శోభారాణి 1973 ఏప్రిల్ 29న వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామంలో సాంప్రదాయ వడ్రంగి వృత్తిలో జీవనం గడుపుతున్న శ్రామిక కుటుంబానికి చెందిన కందాల అనసూర్య-రామచంద్రయ్య దంపతులకు జన్మించారు. మధ్యతరగతి శ్రామిక వర్గం కావడం మూలంగా పసితనం నుండే కష్టాల కొలిమిలో కాలుతూ సామాజిక ఉద్యమకారిణిగా ఎదిగారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు శోభారాణి అయినా చిన్న పెద్ద తేడా లేకుండా ఆమెకు సమాజం పెట్టుకున్న పేరు శోభక్క.

నిలబడి కలబడ్డారు

చదువు-సమీకరించు-పోరాడు అన్న అంబేద్కర్ సూక్తిని ఆచరణలో పెట్టడం కోసం తన వైయుక్తిక ఎదుగుదలను,జీవనాన్ని పక్కనపెట్టి నికార్సుగా తన ఆశయ ప్రయాణాన్ని కొనసాగించారు. వరంగల్ జిల్లా ఒకప్పటి విద్యార్థి సంఘ నాయకుడైన తాటిపాముల రమేష్ తన జీవిత సహచరుడు కావడం, తన ఆశయ సాధనకు మరింత పటుత్వం ఏర్పడింది. బతకనేర్చిన వాళ్ళు సమాజంతో రాజీపడి వైయుక్తికమైన తమ ఆశయాలను లక్ష్యాలను సాధిస్తారు. బతుకు నిచ్చే వాళ్ల సమాజంతో అనునిత్యం సంఘర్షిస్తూ కడ ఊపిరి దాకా తమ జీవితాన్ని కొవ్వొత్తిగా మార్చుకుంటారు. ఆ క్రమంలో శోభారాణి పౌరహక్కుల, మహిళా, కార్మిక-కర్షక, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కుళ్ళు రాజకీయాలకతీతంగా నిలబడి కలబడ్డారు.

సాహిత్య జీవితం

ఉద్యమాల్లో పాల్గొంటూనే విద్య పట్ల కూడా సమదృష్టిని పెట్టి కాకతీయ విశ్వవిద్యాలయంలో యం.ఏ తెలుగు చేశారు. వివిధ పత్రికల్లో, సాహిత్య సంకలనాల్లో వ్యాసాలు, కవితలు, కథలు రాసి రచయిత్రిగా ఎదిగారు. 'తెలుగు సాహిత్య విమర్శ- స్త్రీల కృషి' అంశంపై కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో పరిశోధన చేసి డాక్టర్ పట్టా పొందారు. ఈ పరిశోధనా సమాచార సేకరణ కోసం తెలుగు నాట ప్రసిద్ధ పొందిన వేటపాలెం గ్రంథాలయానికి వెళ్లి అక్కడ మూల మూలన దాగిన గ్రంథాల బూజు దులిపి సమాచారాన్ని సేకరించారు. వివిధ పత్రికలకు, సంకలనాలకు రాసిన వ్యాసాలను, జాతీయ ప్రాంతీయ సదస్సులో సమర్పించిన వ్యాసాలను క్రోడీకరించి వ్యాస శోభిత, తెలుగు సాహిత్యంలో స్త్రీవాద విమర్శకులు, సాహిత్యావలోకనం వంటి వ్యాస సంపుటాలు ప్రచురించారు. రుద్రమ, బందగీ ప్రచురణల్లో భాగస్వామిగా చేరి రచనలు చేశారు.

అధ్యాపకురాలిగా పనిచేస్తూ...

ఇక తన చదువుకు తగిన గుర్తింపు సార్థక్యం కోసం అధ్యాపక వృత్తిని చేపట్టి సావిత్రిబాయి పూలే బాటలో నడిచారు. రంగసాయి పేట జూనియర్ కాలేజీలో, ఎల్బీ కాలేజీలో తాత్కాలిక అధ్యాపకురాలిగా పనిచేస్తూ అనేక వివక్షలను ఎదుర్కొన్నారు. తన ప్రతిభే తన శత్రువు కావడంతో విశ్వవిద్యాలయ అధ్యాపకురాలు కావడానికి ఎన్నో ఆటంకాలను, అసంతృప్తులను, కుట్రలను చవిచూశారు. చివరకు విశ్వవిద్యాలయ మహిళా కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా స్థిరపడి, ప్రస్తుత విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య తాటికొండ రమేష్ ప్రోత్సాహంతో సావిత్రిబాయి పూలే సంస్థకు డైరెక్టర్ కాగలిగారు. కానీ తనకు దొరికిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే క్రమంలోనే ఆమెను 2023 ఫిబ్రవరి 8న అకాల మృత్యువు కబళించుకుపోయింది.

- హాథిరామ్ సభావట్, 6309862071

కేజ్రీవాల్‌కు కోర్టు సమన్లు

న్యూఢిల్లీ : మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ కోర్టు సమన్లు జారీ చేసింది. ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇచ్చిన నోటీసులకు సీఎం స్పందించకపోవడంతో దర్యాప్తు సంస్థ కోర్టును ఆశ్రయించింది. కేజ్రీవాల్ విచారణకు సహకరించడం లేదంటూ రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టులో ఈడీ ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం సీఎంకు సమన్లు ఇచ్చింది. ఈ నెల 17న వ్యక్తిగతంగా కోర్టు ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. మరోవైపు, కేజ్రీవాల్‌కు ఢిల్లీ కోర్టు సమన్లు ఇవ్వడంపై ఆప్ స్పందించింది. న్యాయస్థానం జారీ చేసిన ఆర్డర్‌ను అధ్యయనం చేస్తున్నామని.. అందుకు తగినవిధంగా చర్యలు తీసుకుంటామని ఆప్ నేత జాస్మిన్ షా తెలిపారు.

ఈ కేసులో ఈడీ ఇప్పటికే ఐదుసార్లు కేజ్రీవాల్‌కు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. తొలుత నవంబరు 2న, ఆ తర్వాత డిసెంబరు 21, జనవరి 3, జనవరి 18న, ఫిబ్రవరి 2న తమ ఎదుట విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. కానీ, వివిధ కారణాలు చూపి ఆయన వాటిని తిరస్కరించారు. ఇవి చట్ట విరుద్ధమని, రాజకీయ కుట్రలో భాగంగానే తనను విచారణకు పిలుస్తున్నారని కేంద్రంపై కేజ్రీవాల్ విమర్శలు చేశారు.

రాజస్థాన్‌లోనూ యూసీసీ

జైపూర్ : యూనిఫామ్ సివిల్ కోడ్(యూసీసీ) బిల్లును ఉత్తరాఖండ్ ప్రభుత్వం మంగళవారం ఆ రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే రాజస్థాన్ మంత్రి కన్హయ్య లాల్ చౌదరి కీలక వ్యాఖ్యలు చేశారు. రాజస్థాన్‌లోనూ యూసీసీని త్వరలోనే అమలు చేస్తామని తెలిపారు. తదుపరి శాసనసభ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టాలని భావిస్తున్నట్టు వ్యాఖ్యానించారు. మతంతో సంబంధం లేకుండా పౌరులందరూ ఒకే రకమైన చట్టాలను కలిగి ఉండాలనే ఉద్దేశంతో బిల్లును ప్రవేశపెట్టిన ఉత్తరాఖండ్ సీఎం ధామిపై ప్రశంసలు కురిపించారు. 'ఉత్తరాఖండ్ తర్వాత యూసీసీ తీసుకొచ్చిన రెండో రాష్ట్రంగా రాజస్థాన్ ఉంటుంది. సీఎం దీనికి అనుకూలంగా ఉన్నారు. త్వరలోనే యూసీసీపై కార్యాచరణ మొదలు పెడతాం' అని వెల్లడించారు. యూసీసీ దేశ ప్రజలకు ఎంతో అత్యవసరమైందని చెప్పారు. కాబట్టి వచ్చే అసెంబ్లీ సెషల్ లేదా తదుపరి సెషన్‌లో బిల్లును తీసుకొస్తామని స్పష్టం చేశారు. అయితే రాజస్థాన్ అసెంబ్లీ ప్రస్తుత సమావేశాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉంది కాబట్టి, యూసీసీని ప్రవేశపెట్టే అవకాశం లేదు. మరోవైపు యూసీసీ బిల్లును సరైన సమయంలో ప్రవేశపెడతామని ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య తెలిపారు

బీజేపీకి బాబుమోహన్ రాజీనామా

నవతెలంగాణ - బంజారా హిల్స్

బీజేపీకి మాజీ మంత్రి బాబుమోహన్ రాజీనామా చేశారు. ఈ మేరకు విలేకరుల సమావేశంలో ఆయన ప్రకటన చేశారు. కొందరు బీజేపీ నేతలు తనను పొమ్మనలేక పొగబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ కోసం తాను చాలా కష్టపడి పనిచేశానని తెలిపారు. తెలంగాణలోనే కాకుండా దేశవ్యాప్తంగా తిరిగి ఎన్నికల ప్రచారం చేసినట్టు చెప్పారు. అయితే పార్టీ నేతలు కొందరు తనను అవమానించారన్నారు. ఏబీసీడీ సెక్షన్లుగా నాయకులను విభజించి అత్యంత అవమానకరంగా తనను డీ క్యాటగిరీగా నిర్ణయించడానికి వీరికి ఏమి అధికారం ఉందని ప్రశ్నించారు. తనను అవమానించడానికే రాష్ట్ర బీజేపీ పెద్దలు నిర్ణయించుకున్నట్టు అర్థమవుతోందన్నారు. అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి తనను దూరం పెడుతూ తన ఫోన్ సైతం ఎత్తకుండా ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. అందుకే పార్టీకి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నానని వెల్లడించారు. తాను ఎప్పటికైనా వరంగల్ ఎంపీగా పోటీ చేసి గెలిచి ప్రజలకు సేవలందించాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. వేరే పార్టీలో చేరతారా..? అని ఓ విలేకరి ప్రశ్నించగా.. దానిపై ఇంకా ఆలోచించలేదని సమాధానం ఇచ్చారు. అవసరమైతే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని తెలిపారు.

శాస్త్రీయంగా నదీ జలాల పరిష్కారం

(మొదటిపేజి తరువాయి)

గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. రామాలయం నిర్మాణంతో లబ్ది పొందాలని చూస్తోందన్నారు. ఇప్పటికే తొమ్మిది సార్లు కూటములు మార్చిన బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ వైఖరినీ దేశ ప్రజలు అసహ్యించుకుంటున్నారని తెలిపారు. జాతీయంగా ఇండియా కూటమి మధ్య వైరుధ్యాలు తగ్గించి రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని తిప్పికొడతామని ధీమా వ్యక్తం చేశారు.

అహంకార ధోరణితోనే బీఆర్ఎస్ ఓటమి

బీఆర్ఎస్ అప్రజాస్వామిక, అహంకార ధోరణిని సీపీఐ(ఎం) నిరసించిందన్నారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీల్లో రెండింటిని అమలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తమ పార్టీ స్వాగతించిందన్నారు. అప్రజాస్వామిక విధానాలకు ప్రజలు ఎలా గుణపాఠం చెబుతారో మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. ఆరు



నెలల్లో ప్రభుత్వం కూలుతుందనే బీఆర్ఎస్ శాపనార్థాలు సరికాదని తమ్మినేని అన్నారు. ధరణి భూ సమస్యలు, రైతులు, వ్యవసాయ కూలీలు, అసంఘటిత రంగాల కార్మికుల సమస్యలు, జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు తదితర సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

పాలేరు పాతకాలువకు నీరివ్వాల్సిందే..

పాలేరు పాతకాలువ ఆయకట్టు పరిధిలో 14,500 ఎకరాలుండగా దానిలో 7వేల ఎకరాల్లో యాసంగి వరి, చెరుకు తదితర పంటలు సాగయ్యాయని.. వీటికి నీరు ఇచ్చేలా ముగ్గురు మంత్రులు బాధ్యత తీసుకోవాలని తమ్మినేని డిమాండ్ చేశారు.

లేనిపక్షంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. సాగు, తాగునీటి ఎద్దడి రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తన ఆరోగ్యం ఎంత సీరియస్ కండీషన్‌కు వెళ్లిందో అంత త్వరగా కోలుకున్నానని, ప్రస్తుతం తన ఆరోగ్యం గురించి ఎలాంటి ఆందోళనా అవసరం లేదని చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జాతీయ నాయకులు ఎం.సాయిబాబు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వర్లు, మాచర్ల భారతి, భూక్యా వీరభద్రం, బండి రమేష్, బుగ్గవీటి సరళ, వై.విక్రమ్, బొంతు రాంబాబు, కళ్యాణం వెంకటేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వైసీపీ తిరుగుబాటు ఎంపీ రఘు రామకృష్ణ రాజుకు ఎదురుదెబ్బ

నవతెలంగాణ-హైదరాబాద్

ఉద్దేశ్యపూర్వక రుణ ఎగవేతదారుడిగా రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్(ఆర్ఈసీ) ప్రకటించడాన్ని సవాల్ చేసిన ఎంపీ రఘురామకృష్ణరాజుకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యానికి డివిజన్‌బెంచ్ నిరాకరించింది. తమిళనాడు, టుటికోరిన్ జిల్లా సత్తాంకుళం తాలూకా సత్తావినల్లూరు, పల్లక్కురిచి గ్రామాల్లో 660 మెగావాట్ల బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం ఇందు భారత్ పవర్‌కు ఆర్ఈసీ రూ.2,655 కోట్ల రుణం ఇచ్చింది. అందులో కొంత మొత్తం 2014లో (రూ.947.71 కోట్ల) తీసుకుంది. అప్పుడు ఇందు భారత్‌లో అప్పుడు రాజు, ఆయన భార్య రమాదేవి డెరెక్టర్లుగా ఉండగా, సుమారు రూ.500 కోట్లను ఇందు భారత్ ఇతర కంపెనీల్లోకి మళ్లించిందని ఆర్ఈసీ తేల్చింది. రాజు రుణ ఎగవేతదారులుగా ఆర్ఈసీ నిర్ణయించింది. వాళ్లపై క్రిమినల్ కేసు నమోదు కూడా నమోదైంది. వీటిని సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయిస్తే సింగిల్ జడ్జి వద్ద ఉపశమనం లభించలేదు. అప్పీల్ దాఖలు చేసిన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ డివిజ న్ బెంచ్ విచారణ పూర్తి చేసి పైవిధంగా బుధవారం తీర్పు చెప్పింది.

సాధారణ ఎన్నికలకు సిద్ధంకండి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశంలో త్వరలో జరిగే సాధారణ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధంగా ఉండాలని కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) డిప్యూటీ కమిషనర్ నితీష్‌కుమార్ వ్యాస్ ఆదేశించారు. బుధవారంనాడాయన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడే ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎదురైన సవాళ్లను ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ఎలా ఎదుర్కోవాలో దిశానిర్దేశం చేశారు. ఎన్నికల అధికారుల శిక్షణా సమావేశాల వివరాలను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ వివరించారు. పలు అంశాలపై కేంద్ర ఎన్నికల సంఘం నుంచి స్పష్టతను కోరారు. అదనపు సీఈఓ లోకేష్‌కుమార్, డిప్యూటీ సీఈఓ సత్యవాణి, జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర పోలీస్ నోడల్ అధికారి సంజయ్ జైన్, ఎన్నికల వ్యయ నోడల్ అధికారి మహేష్ భగవత్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్లు, ఎన్నికల విధుల్లో ఉన్నవారి ఓటింగ్ వంటి విషయాల్లో అనుసరించాల్సిన ఏకీకృత సూచనలను



కేంద్ర ఎన్నికల సంఘం త్వరలో జారీ చేస్తుందని ఈ సందర్భంగా వ్యాస్ తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన అదనపు బలగాలు, బడ్జెట్ అవసరాలపై అంచనాలు రూపొందించాలని చెప్పారు. ఎన్నికల సందర్భంగా పట్టుబడే నగదు, వస్తువులుకు సంబంధించి ప్రతి జప్తుకు సంబంధిత అధికారుల పేర్లతో సహా అన్ని వివరాలతో కూడిన రశీదులు ఇవ్వాలని ఆదేశించారు. తనిఖీల సందర్భంగా జరిగే జప్తులు, తిరిగి ఆధారాలు చూపించి వారి వస్తువులు వారు పొందే వెసులుబాటుపై ఈసారి ముందస్తుగా ప్రచారం కల్పించాలనీ, వస్తువులు తిరిగి పొందే విధానాన్ని సరళతరం చేయాలని సూచించారు. వ్యాపార లావాదేవీల కోసం నిత్యం తీసుకెళ్తున్న బంగారం, వెండి తదితర ఆభరణాల విషయంలో తమిళనాడులో అనుసరిస్తున్న విధానాన్ని అధ్యయనం చేసి, సానుకూలంగా ఉంటే అనుసరించాలని సలహా ఇచ్చారు. పోస్టల్ బ్యాలెట్ల పంపిణీలో జాప్యాన్ని నివారించడానికి జిల్లా స్థాయిలో వాటిని ముద్రించాలనీ, వాటి లెక్కింపు కోసం ప్రతి 500 పోస్టల్ బ్యాలెట్‌లకు ఒక టేబుల్‌ను ఏర్పాటు చేయడం ద్వారా పరిష్కరించవచ్చని తెలిపారు.

నేడు హైదరాబాద్‌లో కేరళ సంఘీభావ ధర్నా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేరళలోని వామపక్ష ప్రభుత్వం పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిరంకుశ విధానాలను నిరసిస్తూ గురువారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద సంఘీభావ ధర్నాను సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ నిర్వహించనున్నది. ఈ ధర్నా కార్యక్రమంలో ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బీవి రాఘవులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారు. ఈ ధర్నాను జయప్రదం చేయాలని ప్రజాస్వామ్యవాదులు, ప్రజలకు ఆ పార్టీ విజ్ఞప్తి చేసింది. కేరళ ప్రభుత్వంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షపూరిత, అణచివేత ధోరణిని కొనసాగిస్తున్నదని విమర్శించింది. విపక్ష రాష్ట్ర ప్రభుత్వాల పట్ల కేంద్రం విద్వేషపూరిత వైఖరిని అనుసరించడం సరికాదని పేర్కొంది. మేధావులు, యువకులు, ప్రజాస్వామికవాదులు, ప్రజలు మౌనం వహించకుండా కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఖండించాలని కోరింది.

ఇతరులకూ అవకాశమివ్వండి

న్యూఢిల్లీ : కులం ఆధారిత రిజర్వేషన్ నుండి ప్రయోజనం పొందిన వారు తమలో వెనుకబడిన మరింత మందికి అవకాశం కల్పించాలని సుప్రీంకోర్టు సూచించింది. రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీలు, ఎస్టీల ఉప వర్గీకరణను చేపట్టవచ్చా అనే అంశంపై దాఖలైన కేసును ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారిస్తోంది. పంజాబ్ ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాలకు 25% రిజర్వేషన్లు కల్పిస్తోంది. ఎస్సీలను రెండు కేటగిరీలుగా వర్గీకరిస్తూ ఆ ప్రభుత్వం 1975లో నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిపై దాఖలైన కేసును సుప్రీంకోర్టు ప్రస్తుతం విచారిస్తోంది.

'వెనుకబడిన వారిలో ఇప్పటికీ వెనుకబడిన వారు ఉంటే వారికి రిజర్వేషన్లు కల్పిద్దాం. మీరు రిజర్వేషన్ పొంది ఉంటే ఆ ప్రయోజనం నుండి వైదొలగవచ్చు. ఈ విషయంలో ఎందుకు మినహాయింపు ఇవ్వకూడదు?' అని న్యాయమూర్తి విక్రమ్ నాథ్ ప్రశ్నించారు. దీనిపై పంజాబ్ అడ్వకేట్ జనరల్ గుర్మీందర్ సింగ్ స్పందిస్తూ ఉప వర్గీకరణ లక్ష్యం అదేనని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన సివిల్ సర్వీస్ అధికారుల పిల్లలకు రిజర్వేషన్లు కొనసాగించవచ్చా అని జస్టిస్ బీఎస్ గవాయ్ కూడా ప్రశ్నించారు. దీనిపై సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ అలాంటి వారిని క్రీమిలేయర్‌గా వర్గీకరించవచ్చునని, వారిని రిజర్వేషన్ల నుండి మినహాయించాలని సూచించారు.

బీఆర్ఎస్‌ది ఎప్పుడూ ప్రజాపక్షమే

(మొదటిపేజి తరువాయి)

గురించి ప్రస్తావన తెస్తుంటారని అన్నారు. జనగామలో గులాబీజెండా ఎగురవేసిన సైనికులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. బీఆర్ఎస్‌కు ఉద్యమాలు, అరెస్టులు కొత్త కాదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 60 రోజులు పూర్తయ్యిందని హరీశ్‌రావు తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, రూ.4వేల పింఛన్ ఇస్తామని ఊదరగొట్టారని.. కానీ ఉన్న రెండు వేల పెన్షన్‌ను కూడా కట్ చేశారని విమర్శించారు. వ్యవసాయ పనులు ప్రారంభం కాకముందే రూ.15వేలు ఇస్తామన్నారని తెలిపారు. కానీ ఉన్న రూ.10 వేలు పోయింది.. వేస్తామన్న రూ.15వేలకు కూడా దిక్కులేదని అన్నారు. హామీల అమలులో సీఎం రేవంత్ రెడ్డి ఎగవేత, దాతవేట వైఖరిని ప్రదర్శిస్తున్నారని అన్నారు. ఎన్నికల కోడ్ రాకముందే హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి ఇవ్వకుండా ఆడబిడ్డలను ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే పి.రాజేశ్వర్‌రెడ్డి, తదితర ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

కరెంట్ కట్‌పై ..

ఆయన కరెంట్ పరిస్థితిని వివరిస్తున్న సమయంలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో మార్పు వచ్చిందంటూ హరీశ్‌రావు సెటైర్ వేశారు. జనరేటర్ ఆన్ చేయడంతో హరీశ్‌రావు మళ్లీ తన ప్రసంగం కొనసాగించారు.

నవచిత్రం

విధ్వంసాల జాతర మొదలైంది..


రవితేజ

రవితేజ నటించిన నయా యాక్షన్ థ్రిల్లర్ 'ఈగిల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించింది. ఈ చిత్ర రిలీజ్ ట్రైలర్‌ని బుధవారం మేకర్స్ విడుదల చేశారు. దర్శకులు అనిల్ రావిపూడి, బాబీ, హరీష్ శంకర్‌లతో కూడిన ట్వీట్ల థ్రెడ్‌తో మేకర్స్ ఉదయం నుండి దీని కోసం చాలా ఆసక్తిని పెంచారు.

రిలీజ్ ట్రైలర్ రవితేజ ఫెరోషియస్ అవతార్‌ను ప్రజెంట్ చేసింది. టెర్రిఫిక్ డైలాగ్‌లు, దావ్‌జాండ్ అద్భుతమైన బిజీఎమ్‌తో అదరగొట్టింది. టేకింగ్ టాప్ క్లాస్‌గా ఉంది. ప్రొడక్షన్ డిజైన్ చాలా లావిష్‌గా ఉంది. 'వచ్చాడంటే మోతర, విధ్వంసాల జాతర' అనే లైన్స్ సినిమాలోని మాస్ మహారాజా పాత్రను వివరిస్తూ ప్రేక్షకులకు మునుపెన్నడూ లేని విధంగా స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైన్మెంట్‌ని ప్రామిస్ చేస్తున్నాయి. రిలీజ్ ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింతగా పెంచింది. విడుదలకు ముందు అభిమానులకు మంచి ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈనెల 9న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. కావ్య థాపర్, అనుపమ పరమేశ్వరన్, నవదీప్, శ్రీనివాస్ అవసరాల, మధుబాల, ప్రణీత పట్నాయక్, అజయ్ ఘోష్ తదితరులు ఈ చిత్రంలోని ఇతర ముఖ్యతారాగణం.

ఆసక్తికరంగా టిల్లు గ్లింప్స్


సిద్ధు జొన్నలగడ్డ

'డీజే టిల్లు' చిత్రానికి కొనసాగింపుగా సిద్ధు జొన్నలగడ్డ 'టిల్లు స్క్వేర్' చేస్తున్నారు.

బుధవారం సిద్ధు జొన్నలగడ్డ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఈ సినిమా నుండి స్పెషల్ బర్త్‌డే గ్లింప్స్‌ను రిలీజ్ చేసింది. రాత్రి సమయంలో కారు నడుపుతూ తన పక్కనే ఉన్న లిల్లీ (అనుపమ పరమేశ్వరన్) నుండి టిల్లు ముద్దును పొందడం మనం గ్లింప్స్‌లో చూడవచ్చు. ఈ గ్లింప్స్‌లో అనుపమ పరమేశ్వరన్ గతంలో కంటే చాలా అందంగా, మరింత గ్లామరస్‌గా కనిపిస్తుంది. మొత్తానికి ఈ గ్లింప్స్ మునుపటి చిత్రం 'డీజే టిల్లు'లో జరిగిన విషయాలను గుర్తు చేయడమే కాకుండా, 'టిల్లు స్క్వేర్' ఎలా ఉండబోతుందనే ఆసక్తిని కూడా కలిగిస్తోంది. ఈ సినిమా ట్రైలర్ ప్రేమికుల దినోత్సవం కానుకగా ఈనెల 14న విడుదల కానుంది. తమన్ ఈ చిత్రానికి నేపథ్య సంగీతం సమకూరుస్తున్నారు. మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. మార్చి 29న ఈ సినిమా భారీస్థాయిలో విడుదల కానుంది.

'లాల్ సలామ్' ట్రైలర్ రిలీజ్


రజనీకాంత్

భారతదేశంలో ఎన్నో మతాలు, కులాల వాళ్లు ఇక్కడ ఎలాంటి బేదాభిప్రాయాలు లేకుండా ఆనందంగా జీవిస్తున్నారు. కానీ కొందరు స్వార్థ రాజకీయాలతో మనలో మనకు గొడవలు పెట్టారు. దీని వల్ల నష్టం జరిగింది. అయితే ఇలాంటి చెడు పరిణామాల నుంచి ప్రజలను, దేశాలను కాపాడిన వారెందరో ఉన్నారు. అలాంటి ఓ హీరో మొయిద్దీన్ భాయ్. మొయిద్దీన్ భాయ్ పాత్రలో రజనీకాంత్ నటించిన 'లాల్ సలామ్' సినిమాను లైకా ప్రొడక్షన్స్ నిర్మించింది. సుభాస్కరణ్ నిర్మాతగా.. ఐశ్వర్య రజనీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఈనెల 9న విడుదల కాబోతోంది. ఈ చిత్రాన్ని తెలుగులో శ్రీ లక్ష్మీ మూవీస్ గ్రాండ్‌గా విడుదల చేస్తోంది. బుధవారం చిత్రయూనిట్ ట్రైలర్‌ను రిలీజ్ చేసింది.

తమిళ, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో రాబోతున్న ఈ చిత్రంలో విష్ణు విశాల్, విక్రాంత్, జీవితా రాజశేఖర్, క్రికెట్ లెంజెండ్ కపిల్ దేవ్ తదితరులు నటించారు. రీసెంట్‌గా 'జైలర్'తో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన రజనీఇప్పుడు 'లాల్ సలాం'తో రానుండటంతో ఆయన అభిమానులతో పాటు సినీ ప్రేక్షకుల్లోనూ అంచనాలు భారీ స్థాయికి చేరాయి.

భయపెట్టే తిమిరం


ఇషా యాదవ్, ప్రశాంత్ గురువాన

నూతన నిర్మాణ సంస్థలు ఎస్‌కేఎస్ క్రియేషన్స్, ప్రసన్న క్రియేషన్స్ పతాకంపై రూపొందనున్న హర్రర్ థ్రిల్లర్ 'తిమిరం'. ఈ చిత్రం బుధవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ప్రశాంత్ గురువాన హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రాహుల్ అయ్యర్, ప్రసన్న, వేణుగోపాల్ నిర్మిస్తున్నారు. ఇషా యాదవ్ కథానాయిక.

హైదరాబాద్‌లోని పరమేశ్వర రామాలయంలో చిత్రీకరణ ఆరంభమైంది. హీరో, హీరోయిన్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి నిర్మాతల్లో ఒకరైన వేణుగోపాల్ స్విచ్చాన్ చేయగా, పారిశ్రామిక వేత్త ప్రసాద్ క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా హీరో, దర్శకుడు ప్రశాంత్ గురువాన మాట్లాడుతూ, 'ఓ ఇన్నోటివ్ కాన్సెప్ట్‌తో రూపొందుతున్న సరికొత్త హర్రర్ థ్రిల్లర్ ఇది. కొత్తదనంతో కూడిన ఈ చిత్రం తప్పకుండా అందరికి నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. 'మూఢ నమ్మకాల మీద నడిచే హర్రర్ చిత్రమిది. రెండు షెడ్యూల్స్ అంటే 30 రోజుల్లో చిత్రీకరణ పూర్తిచేస్తాం. వేసవిలో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని నిర్మాతలు చెప్పారు. జయలలిత, పల్సర్ బైక్ రమణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తరుణ్ రానా ప్రతాప్, డీఓపీ: మహేష్, ఎడిటర్: శ్రీ వరకాల, లైన్ ప్రొడ్యూసర్: ప్రసాద్.పి.

అద్భుతమైన అనుభూతిని పంచే సినిమా


విద్యాధర్, విశ్వక్‌సేన్, కార్తీక్ శబరీష్

విశ్వక్ సేన్, విద్యాధర్ కాగిత దర్శకత్వంలో విశ్వక్ సేన్ చేస్తున్న చిత్రం 'గామి'. కార్తీక్ కల్ట్ క్రియేషన్స్‌పై కార్తీక్ శబరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ అడ్వెంచర్ డ్రామాని వి సెల్యులాయిడ్ సమర్పిస్తోంది. ఈ చిత్రం మార్చి 8న విడుదలౌతుంది.

ఈ సందర్భంగా మీడియాతో విశ్వక్ సేన్ మాట్లాడుతూ,'దర్శకుడు విద్యాధర్ ఈ సినిమా కోసం చాలా రీసెర్చ్ చేశాడు. సినిమా ట్రైలర్ చూశాను. మైండ్ బ్లోయింగ్‌గా ఉంది. ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తుందనే నమ్మకం ఉంది. అద్భుతమైన అనుభూతిని పంచే సినిమా ఇది' అని అన్నారు. దర్శకుడు 'అతని అతిపెద్ద భయం మానవ స్పర్శే. అతని లోతైన కోరిక మానవ స్పర్శే. మానవ స్పర్శ లేని జీవితాన్ని ఊహించలేం. అలాంటి సమస్య ఎదుర్కొంటున్న అఘోర శంకర్ హిమాలయాల్లో చేసే సాహసోపేత ప్రయాణం, దీనితో పాటు సమాంతరంగా కొన్ని పాత్రలు నడుస్తుంటాయి. వాటి ప్రయాణం ఈ అఘోర ప్రయాణంతో ఎలా ముడిపడి ఉంది?, చివరగా అఘోర తన లక్ష్యాన్ని చేరుకున్నాడా లేదా అనేది గామి కథాంశం' అని విద్యాధర్ కాగిత అన్నారు. నిర్మాత కార్తీక్ శబరీష్ మాట్లాడుతూ,'క్రౌడ్ ఫండ్ మోడల్‌లో 'మను' సినిమా సక్సెస్ ఫుల్‌గా చేశాం. అదే మోడల్‌ని ముందుకు తీసుకువెళ్లాలని 'గామి' చేశాం. ఇది చాలా ఎగ్జైటింగ్ కంటెంట్. ప్రేక్షకులకు తప్పకుండా అలరిస్తుంది' అని చెప్పారు.

సీట్ ఎడ్జ్ ఫాంటసీ థ్రిల్లర్


వర్షబొల్లమ్మ

సందీప్ కిషన్ నటించిన మ్యాజికల్ ఫాంటసీ అడ్వెంచర్ మూవీ 'ఊరు పేరు భైరవకోన'. విఐ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నారు. కావ్య థాపర్, వర్ష బొల్లమ్మ కథానాయికలుగా నటించారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా లావిష్ స్కేల్‌లో నిర్మించారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై అనిల్ సుంకర సమర్పిస్తున్నారు. బాలాజీ గుత్తా సహ నిర్మాత. ఈ చిత్రం ఈనెల 16న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో హీరోయిన్ వర్ష బొల్లమ్మ మీడియాతో మాట్లాడుతూ, 'దర్శకుడు విఐ ఆనంద్ చెప్పిన కథ నాకు చాలా కొత్తగా, అద్భుతంగా అనిపించింది. ఇందులో భూమి అనే పాత్రలో కనిపిస్తాను. భూమి ట్రైబల్ గర్ల్. తన ఊర్లో తనొక్కరే చదువుకున్న అమ్మాయి. చూడటానికి అందంగా, అమాయకంగా కనిపిస్తుంది. తప్పుని నిలదీసే ధైర్యం ఉన్న అమ్మాయి. ఆ పాత్ర బలం సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులకు బాగా అర్థం అవుతుంది. ట్రైలర్‌లో చూస్తే నాకు ఒక యాక్షన్ సీన్ ఉంటుంది. భూమి పాత్రలో చాలా స్ట్రెంత్, పవర్ ఉంది. ఇది అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్. ప్రేక్షకుడికి ఎడ్జ్ ఆఫ్ ది సీట్ థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్‌ని ఇస్తుంది. అద్భుతమైన సూపర్ నేచురల్ ఎలిమెంట్స్ ఉన్నాయి. అలాగే ఇందులో చాలా మంచి సందేశం కూడా ఉంది' అని తెలిపారు.

భిన్న కాన్సెప్ట్‌తో సోలో బాయ్


గౌతమ్ కృష్ణ

బిగ్ బాస్ సీజన్ 7 ఫేమ్ గౌతమ్ కృష్ణ, శ్వేతా అవాస్తి, రమ్య పసుపులేటి లీడ్ రోల్స్‌లో నటిస్తున్న సినిమా 'సోలో బాయ్'. సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై సెవెన్ హిల్స్ సతీష్ నిర్మించారు. పి. నవీన్ కుమార్ దర్శకుడు. ఈ సినిమా టైటిల్ అనౌన్స్‌మెంట్‌తోపాటు ఫస్ట్ లుక్ పోస్టర్ లాంచ్ వేడుక బుధవారం గ్రాండ్‌గా జరిగింది. నిర్మాత సెవెన్ హిల్స్ సతీష్ మాట్లాడుతూ ,'ఈ జనరేషన్ ఆడియెన్స్ చూడాల్సిన సినిమా. వాళ్లకు ఈజీగా కనెక్ట్ అయ్యే అంశాలు ఉంటాయి. రెండు పాటలు మినహా సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ సినిమా చూసి బయటకు వచ్చేప్పుడు కనీసం పది నిమిషాలు ఆలోచిస్తారు' అని చెప్పారు. 'మా సినిమాని అనుకున్న దానికంటే బాగా రూపొందించాం. తెలుగు ప్రేక్షకులకు మంచి టేస్ట్ ఉంది. మంచి సినిమాలను తప్పకుండా ఆదరిస్తారు. ఆ కోవలోనే ఈ సినిమాని తప్పకుండా విజయవంతం చేస్తారని ఆశిస్తున్నాను' అని హీరో గౌతమ్ కృష్ణ అన్నారు. డైరెక్టర్ పి.నవీన్ కుమార్ మాట్లాడుతూ, 'యూత్‌కి ఫ్యామిలీ ఆడియన్స్‌కి ఇలా అన్ని వర్గాల ప్రేక్షకులను ఈ చిత్రం తప్పకుండ నచ్చుతుంది' అని చెప్పారు.

ప్రేమికుల జీవితాలకు ప్రతిబింబం


శ్రీగౌరి ప్రియ

మణికందన్, శ్రీ గౌరి ప్రియ, కన్న రవి లీడ్ రోల్స్‌లో నటిస్తున్న సినిమా 'ట్రూ లవర్'. మిలియన్ డాలర్ స్టూడియోస్, ఎంఆర్ పీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ పై నజేరత్ పసీలియన్, మగేష్ రాజ్ పసీలియన్, యువరాజ్ గణేషన్ నిర్మించారు. ప్రభురామ్ వ్యాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను డైరెక్టర్ మారుతి, నిర్మాత ఎస్ కేఎన్ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ నెల 10న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ మాట్లాడుతూ, 'తమిళంలో ఈ సినిమాని 'లవర్' పేరుతో తెరకెక్కించారు. దర్శకుడు ప్రభురామ్ వ్యాస్ ఈ స్క్రిప్ట్ చెప్పినప్పుడు ఎంతో ఎగ్జైటింగ్‌గా అనిపించింది. మన జీవితంలో ఏదీ రైట్ కాదు, ఏదీ రాంగ్ కాదు. సందర్భాన్ని బట్టి, మనం ఆ విషయాన్ని చూసే కోణాన్ని బట్టి ఒక్కొక్కరు ఒక్కోలా తీసుకుంటారు. అలా ఒక అమ్మాయి అబ్బాయిని చూసే పర్సెప్షన్, అబ్బాయి అమ్మాయిని చూసే పర్సెప్షన్ కొన్ని వేర్వేరు సందర్భాల్లో ఎలా ఉంది అనేది ఈ సినిమాలో ఎంతో సహజంగా తెరకెక్కించారు దర్శకుడు. ఒక జంట మధ్య ఆరేళ్ల కాలంలో జరిగే కథ ఇది. ప్రతి ప్రేమికుడు, ప్రేమికురాలు తమ జీవితాలతో ఈ సినిమాలోని సన్నివేశాలను, సందర్భాలను రిలేట్ చేసుకుంటారు. అదే ఈ సినిమాలోని యూనిక్ నెస్. ఇందులో దివ్య అనే క్యారెక్టర్‌లో నటించాను' అని అన్నారు.



కేరళ ప్రగతికి, మనుగడకే పోరాటం

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్

- కేంద్రం వివక్ష చూపుతోంది
- ప్రజాస్వామ్యవాదుల మద్దతు, సహకారం ఇవ్వండి

నవతెలంగాణ- న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ వివక్షకు వ్యతిరేకంగా ఢిల్లీ చేస్తున్న పోరాటం కేరళ ప్రగతికి, మనుగడకు అవసరమైన మార్గమని ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. కేరళ పోరాటానికి దేశం మొత్తం మద్దతునిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం నాడిక్కడ కేరళ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేరళ ఆర్థిక మంత్రి బాలగోపాల్‌తో కలిసి పినరయి విజయన్ మాట్లాడారు. "ఇది కేరళకే కాకుండా మొత్తం రాష్ట్రాలకు కూడా రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడేందుకు జరుగుతున్న పోరాటం. ఈ పోరాటం ఎవరినీ ఓడించే లక్ష్యం కాదు. అర్హత కలిగిన వాటిని పొందడం లక్ష్యం. పోరాటానికి రాజకీయ రంగు లేదు. కో ఆపరేటివ్ ఫెడరలిజం భావనలో ఇందులోని సారాంశాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర విధానాలపై మా పోరాటం. ఢిల్లీలో జరిగే ప్రత్యేక ఆందోళనలో రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు పాల్గొంటారు. చరిత్రలో అంతగా లొంగని ఈ తరహా ఆందోళనలు కేరళ మనుగడ కోసమే" అని అన్నారు.

"దేశంలోని 17 బీజేపీ పాలిత రాష్ట్రాల పట్ల, ఎన్‌డీఏయేతర రాష్ట్రాల పట్ల కేంద్రం వైఖరి ఒకేలా లేదు. అటువంటి చర్యలకు వ్యతిరేకంగా గొంతె పెంచాలి. దీనికి విస్తృత మద్దతునివ్వాలని కోరుతూ బీజేపీ ముఖ్య మంత్రులు, రాజకీయ నేతలకు లేఖలు రాశాం. వారి మద్దతు, సంఘీభావం కోసం ఎదురు చూస్తున్నాను. కేరళలో కాంగ్రెస్ వ్యతిరేకించడంతో మల్లికార్జున్ ఖర్గే పాల్గొనకపోవచ్చు. కేరళ పోరాటానికి మద్దతిచ్చినందుకు కర్ణాటకలోని కాంగ్రెస్ నాయకత్వానికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. కేరళలో కాంగ్రెస్ ఎందుకు ఇలాంటి వైఖరిని అవలంబించిందో అర్థం కావడం లేదు. నేను మొదట వారి గురించి ఆలోచించాను. కానీ సమాధానం ప్రతికూలంగా వచ్చింది. కేరళ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఎందుకు నిలబడతాయో అర్థం కావడం లేదు" అని అన్నారు.

"శ్రేష్ఠత నుంచి మరింత శ్రేష్ఠతకు వెళ్లేందుకు కేరళను సమర్థించే బదులు.. ఆ ప్రగతికి అడ్డంకులు సృష్టించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. వరదలు, అంటువ్యాధుల సమయంలో తగిన సాయం అందించడానికి బదులు, అవసరాలకు వెనుదిరగడమే కాక వాటికి అడ్డంకులు సృష్టించే ప్రయత్నం చేశారన్నది వాస్తవం" అని అన్నారు.

"రాజ్యాంగ విరుద్ధమైన చర్యలతో కేంద్రం కేరళను ఆర్థికంగా కుంగదీస్తోంది. కెఐఎఫ్బీ వంటి ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థలు తీసుకున్న రుణాలను ప్రభుత్వ రుణాలుగా పరిగణించడంతో రుణ పరిమితిని తగ్గించడం ఒక ఉదాహరణ. ఈ చర్య ఆర్థిక సంఘం సిఫార్సులకు విరుద్ధం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధం. కేరళకు రూ.4,350 కోట్ల విలువైన గ్రాంట్లు ఆరోగ్య మిషన్, యూజీసీ, మూలధన వ్యయం కోసం రుణ సహాయం మొదలైనవి నిలిపివేశారు. రాష్ట్రం 88 శాతం పెట్టుబడి పెట్టే లైఫ్ మిషన్ వంటి ప్రాజెక్టులు కూడా బ్రాండింగ్‌తో కేంద్ర సాధనగా మార్చడానికి ఫెడరలిజానికి వ్యతిరేకంగా జరుగుతున్న చర్య. కేరళ పన్ను వాటా 3.8 శాతం నుంచి 1.9 శాతానికి తగ్గింది. జీఎస్టీ అమల్లోకి వచ్చాక రాష్ట్రాలు 44 శాతం పన్నును వదులు కోవాల్సి వచ్చింది. రాష్ట్రాల ఆదాయ నష్టాన్ని భర్తీ చేసేందుకు తీసుకొచ్చిన జీఎస్టీ పరిహారం ఐదేండ్ల తరువాత దశలవారీగా రద్దు చేస్తున్నారు. 2020-24 కాలానికి అందిన రెవెన్యూ లోటు గ్రాంట్ కూడా నిలిపివేస్తారు. ఎయిమ్స్ వంటి దీర్ఘకాలిక అవసరాలు అనుమతి ఇవ్వలేదు. కేంద్ర బడ్జెట్‌లో కేరళ అనే పదం కూడా లేదు. రబ్బరు రైతులను ఆదుకునేందుకు ఎలాంటి చర్యలు లేవు. సిల్వర్‌లైన్‌ను తిరస్కరించడంతో కేరళను రైలు రంగంలో వెనక్కి నెట్టారు" అని విమర్శించారు. "గవర్నర్ ప్రవర్తన సామ్రాజ్య కాలంలో నివాసితుల మాదిరిగానే ఉంది.

సీనియర్స్‌కు మించి జూనియర్స్...

- 9వ సారి ఫైనల్‌కు భారత యువజట్టు
- ఐసిసి అండర్-19 ప్రపంచకప్



ఐసిసి(అండర్-19) వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్-2
ఆస్ట్రేలియా(అండర్-19) x పాకిస్తాన్(అండర్-19)
(మధ్యాహ్నం 1.30గం॥లకు)

దక్షిణాఫ్రికా వేదికగా జరుగుతున్న ఐసిసి(అండర్-19) ప్రపంచకప్‌లో భారత యువజట్టుకు తిరుగులేదు. లీగ్‌లో బంగ్లాదేశ్‌పై మినహా ఐర్లాండ్, అమెరికాలపై 200కు పైచిలుకు పరుగుల తేడాతో టీమిండియా ఘన విజయం సాధించింది. స్టేజ్-2 సూపర్-6 పోటీల్లో న్యూజిలాండ్‌పై ఏకంగా 214పరుగుల తేడాతో నెగ్గిన టీమిండియా.. నేపాల్‌పై 132పరుగుల తేడాతో గెలిచి సెమీస్‌కు చేరింది. ఈ క్రమంలో సెమీస్‌లోనూ ఆతిథ్య దక్షిణాఫ్రికాను చిత్తుచేసి సునాయాసంగా ఫైనల్‌కు చేరుతుందనే అభిమానుల అంచనాలు తొలుత తలక్రిందులయ్యాయి. సెమీస్ మినహా మినహా మిగిలిన అన్ని మ్యాచుల్లోనూ తొలిగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా భారీస్కోర్లను నమోదు చేసింది. కానీ దక్షిణాఫ్రికాపై టాస్ గెలిచి లక్ష్యాన్ని ఛేదించేందుకు ఉపక్రమించింది. కెప్టెన్ ప్రణాళిక సఫలం కావడంతో ఆతిథ్య దక్షిణాఫ్రికాను సెమీస్‌లో 245పరుగులకే కట్టడి చేసింది. కానీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో 32పరుగులకే టాప్ ఆర్డర్ నాలుగు వికెట్లు కోల్పోవడంతో అభిమానులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఈ క్రమంలో గెలుపు ఆశలు వదులుకున్న అభిమానుల అంచనాలను తలక్రిందులు చేస్తూ కెప్టెన్ ఉదయ సహారన్, సచిన్ ధాస్ స్ఫూర్తిదాయక ఇన్నింగ్స్ ఆడారు. వీరిద్దరూ 5వ వికెట్‌కు ఏకంగా 171పరుగులు జతచేసి గెలుపుకు లక్ష్యాన్ని చేరువ చేయగా.. మిగతా పని లోయర్ ఆర్డర్ బ్యాటర్స్ పూర్తిచేశారు. దీంతో భారత యువజట్టు సీనియర్స్‌ను మించి అత్యధికంగా 9వ సారి టైటిల్ చేజిక్కించుకొనేందుకు మెట్టు దూరంలో నిలిచింది. సీనియర్స్ విభాగంలో భారతజట్టు 1983, 2011లలో టైటిళ్లను సాధించి.. 200, 2024లలో రన్నరప్‌తో సరిపుచ్చుకుంది.

ఐదు టైటిళ్లతో అగ్రస్థానం..

1988నుంచి ఇప్పటివరకు 15సార్లు అండర్-19 ప్రపంచకప్ టోర్నమెంట్‌లు జరగ్గా... ఇందులో భారత యువ జట్టు ఏకంగా ఐదుసార్లు టైటిల్‌ను ముద్దాడింది. సీనియర్స్ విభాగంలో ఆస్ట్రేలియా జట్టు ఆరుసార్లు వన్డే ప్రపంచకప్‌ను నెగ్గితే.. జూనియర్స్ విభాగంలో ఆస్ట్రేలియాను వెనక్కి నెట్టి భారత యువజట్టు ఐదుసార్లు టైటిళ్లను సాధించడం గర్వించదగ్గ విషయమే. ఈ టైటిల్‌ను ఆసీస్ జట్టు కేవలం మూడుసార్లు మాత్రమే సాధించగలిగింది. ఇక ఇంగ్లండ్ యువ జట్టు ఒక్కసారే ఈ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ టోర్నమెంట్‌లో ఆసియా ఖండ జట్లదే పైచేయి. మొత్తం 15 టోర్నమెంట్‌లలో భారత్(5), పాకిస్తాన్(2), బంగ్లాదేశ్(1) కైవసం చేసుకున్నాయి. అలాగే భారత యువజట్టు(3), పాకిస్తాన్(2), శ్రీలంక(1) రన్నరప్‌గా నిలిచాయి. అంటే ఈ టోర్నమెంట్ చరిత్రలో ఒక్కసారి మినహా.. ప్రతి పర్యాయం ఆసియాఖండ జట్లలో ఒకటి ఫైనల్‌కు చేరడం పరిపాటిగా మారింది. అంటే ఐసిసి అండర్-19 వన్డే ప్రపంచకప్‌లో ఆసియా ఖండ జట్లదే హవా!

ఐసిసి(అండర్-19) వన్డే ప్రపంచకప్

ఏడాది	ఆతిథ్యం	విజేత	రన్నరప్
1988	ఆస్ట్రేలియా	ఆస్ట్రేలియా	పాకిస్తాన్
1998	దక్షిణాఫ్రికా	ఇంగ్లండ్	న్యూజిలాండ్
2000	శ్రీలంక	ఇండియా	శ్రీలంక
2002	న్యూజిలాండ్	ఆస్ట్రేలియా	దక్షిణాఫ్రికా
2004	బంగ్లాదేశ్	పాకిస్తాన్	వెస్టిండీస్
2006	శ్రీలంక	పాకిస్తాన్	ఇండియా
2008	మలేషియా	ఇండియా	దక్షిణాఫ్రికా
2010	న్యూజిలాండ్	ఆస్ట్రేలియా	పాకిస్తాన్
2012	ఆస్ట్రేలియా	ఇండియా	ఆస్ట్రేలియా
2014	యుఏఇ	దక్షిణాఫ్రికా	పాకిస్తాన్
2016	బంగ్లాదేశ్	వెస్టిండీస్	ఇండియా
2018	న్యూజిలాండ్	ఇండియా	ఆస్ట్రేలియా
2020	దక్షిణాఫ్రికా	బంగ్లాదేశ్	ఇండియా
2022	వెస్టిండీస్	ఇండియా	ఇంగ్లండ్

ఫైనల్‌కు సన్‌రైజర్స్

- దక్షిణాఫ్రికా టి20 లీగ్

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా టి20 లీగ్ రెండో సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ ఫైనల్లోకి దూసుకొచ్చింది. కేప్‌టౌన్‌లో మంగళవారం జరిగిన క్వాలిఫయర్-1లో దర్బన్ సూపర్ జెయింట్స్‌పై ఏకంగా 51 పరుగుల తేడాతో విజయం సాధించింది. వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన 'న్‌రైజర్స్ నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 157పరుగులు చేసింది.

మలన్(63; 45బంతుల్లో 6ఫోర్లు, సిక్సర్)తో దర్బన్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. మరో ఎండ్‌లో కెప్టెన్ ఎడెన్ మర్కరమ్(30) పరుగులతో రాణించాడు.

బుమ్రాకు అగ్రస్థానం

ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్‌మండలి(ఐసిసి) తాజా టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రా సత్తా చాటాడు. ఇంగ్లండ్‌తో జరిగిన రెండు టెస్టుల్లో అదరగొట్టిన బుమ్రా ర్యాంకింగ్స్‌లోనూ టాప్‌కు ఎగబాకాడు. వైజాగ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఏకంగా తొమ్మిది వికెట్లు తీసి ఇంగ్లండ్‌ను ఓడించడంలో కీలకపాత్ర పోషించాడు. దీంతో మూడు స్థానాలకు ఎగబాకిన బుమ్రా నంబర్ వన్ ర్యాంక్‌కు చేరాడు. టెస్టు ర్యాంకుల్లో ఓ భారత పేసర్ అగ్రస్థానంలో నిలవడం ఇదే తొలిసారి కావడం విశేషం. బుమ్రా 881 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. కగిసో రబాడ(851) రెండో స్థానంలో నిలిచాడు. ఇప్పటివరకు అగ్రస్థానంలో ఉన్న అశ్విన్ (841) రెండు ర్యాంకులు కిందికి దిగజారాడు. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో ఒక మ్యాచ్ మాత్రమే ఆడిన రవీంద్ర జడేజా (746) రెండు స్థానాలు దిగజారి 9వ స్థానానికి పరిమితమయ్యాడు. ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ (828), జోష్ హేజిల్ వుడ్ (818) నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. బ్యాటింగ్ విభాగంలో న్యూజిలాండ్ స్టార్ కేన్ విలియమ్సన్ (864) అగ్రస్థానంలో ఉన్నాడు. భారత్ నుంచి విరాట్ కోహ్లీ (760) మాత్రమే టాప్-10లో నిలిచాడు. విరాట్ 7వ స్థానంలో కొనసాగుతున్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో తొలి రెండు స్థానాలు భారత ఆటగాళ్లవే. రవీంద్ర జడేజా (416), రవిచంద్రన్ అశ్విన్ (326) ముందు వరుసలో ఉన్నారు. అక్షర్ పటేల్ (286) ఐదో స్థానంలోకి దూసుకొచ్చాడు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

నారీ శక్తి ఎక్కడ..?

- కార్పొరేట్ ఉచ్చులో ఎస్‌హెచ్‌జీలు • నిధుల కేటాయింపులో సర్కారు నిర్లక్ష్యం
- ఖర్చు అంతంతే • కేటాయింపుల్లోనూ కోతే

న్యూఢిల్లీ : మహిళలు సంపన్నులుగా మారేందుకు మధ్యంతర బడ్జెట్ దోహదపడుతుం దంటూ ఊదరకొట్టిన ప్రభుత్వం... వారి కనీస అవసరాలను తీర్చడంలో మాత్రం అలసత్వం ప్రదర్శిస్తోంది. 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుండి మోడీ ప్రభుత్వం సాధించిన అతి పెద్ద విజయాలలో మహిళా శక్తి ఒకటని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన మధ్యంతర బడ్జెట్ ప్రసంగంలో చెప్పుకొచ్చారు. గత దశాబ్ద కాలంలో మహిళా ఔత్సాహిక పారిశ్రామికవే త్తలను ప్రోత్సహించి వారికి సాధికారత కల్పించామని, వారి జీవితాలను సుఖవంతం చేశామని, వారు గౌరవప్రదంగా జీవించేలా చూశామని వివరించారు.

లక్‌పతి దీదీ...

'నారీ శక్తి' విషయంలో ప్రభుత్వం చెప్పుకుంటున్న విజయాలలో ఒకటి కోటి మంది మహిళలను లక్షాధికారులను చేయడం. దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన-నేషనల్ రూరల్ లైవ్లీహుడ్స్ మిషన్ (డే-ఎన్ఆర్ఎల్ఎం) కార్యక్రమం కింద స్వయం సహాయక బృందాల ద్వారా ఒక్కో మహిళ తన కుటుంబానికి ఏడాదికి లక్ష రూపాయల ఆదాయాన్ని అందిస్తుందని, దీనివల్ల కోటి మంది మహిళలు లక్షాధికారులవుతారని ప్రభుత్వం చెబుతోంది. కార్పొరేట్ మీడియాలో ఎంతో ప్రాచుర్యం లభించిన ఈ పథకాన్ని ప్రధాని నరేంద్ర మోడీ 2023 ఆగస్ట్ 15న ప్రారంభించారు.

మహిళలకు వివిధ విభాగాలలో శిక్షణ అందించి వారి కాళ్లపై వారు నిలబడేలా చేయడం ఈ కార్యక్రమం ఉద్దేశం. ఇందులో వ్యాపార దిగ్గజాలైన పతంజలి, ఫ్లిప్‌కార్ట్, బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ వంటి కంపెనీలను భాగస్వాములను చేశారు. గ్రామీణాభివృద్ధి శాఖ థర్డ్ పార్టీ ఒప్పందాలు కుదుర్చుకొని ఆయా సంస్థల ఉత్పత్తులను మార్కెటింగ్ చేయించడం ద్వారా మహిళలకు సాయపడుతుందని చెబుతున్నారు.

నమో డ్రోన్ దీదీ...

అగ్రీ బిజినెస్‌ను, మహిళలను 'నమో డ్రోన్ దీదీ' కార్యక్రమం ద్వారా అనుసంధానం చేసే మరో పథకాన్ని 2023 నవంబరులో ప్రకటించారు. మధ్యంతర బడ్జెట్‌లో దీనిని రూ.500 కోట్లు కేటాయించారు. ఈ పథకం కింద డిజిటల్ వ్యవసాయాన్ని ప్రోత్సహించే కార్యక్రమంలో మహిళలను భాగస్వాముల్ని చేస్తారు. పదిహేను వేల మహిళా గ్రూపులకు కిసాన్ డ్రోన్లు అందజేస్తారు. వీటిని వారు రైతులకు అద్దెకు ఇచ్చి ఆదాయం పొందవచ్చు. ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయమేమంటే నమో డ్రోన్ దీదీ, లక్‌పతి దీదీ వంటి కార్యక్రమాల ద్వారా మహిళా స్వయం సహాయక బృందాలను కార్పొరేట్ సంస్థల ఉచ్చులోకి లాగుతున్నారు. వ్యవసాయాన్ని వ్యాపారంగా మార్చేస్తున్న ఈ బడా సంస్థలు మోడీ ప్రభుత్వానికి సన్నిహితంగా ఉంటాయన్న విషయాన్ని వేరే చెప్పాల్సిన అవసరం లేదు.

ప్రచారం ఘనం...కేటాయింపు స్వల్పం

మహిళలను సంపన్నులుగా మార్చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని ఆర్థిక మంత్రి తన మధ్యంతర బడ్జెట్ ప్రసంగంలో ఏకరువు పెట్టారు. అయితే అదే సమయంలో వారి కనీస అవసరాలను పట్టించుకోలేదు. పైగా ఫలితమే ముఖ్యం తప్ప కేటాయింపులు కావని వ్యాఖ్యానించారు. కేటాయింపులు, విజయాలపై ప్రభుత్వం చేస్తున్న వాదనలు ఎవరికీ ఆశ్చర్యాన్ని కలిగించవు. ఎందుకంటే ఈ పథకాలపై గతంలో ప్రభుత్వం చేసిన వ్యయాన్ని గమనిస్తే దాని వాదనల్లో డొల్లతనం బయటపడుతుంది. ఉదాహరణకు పీఎం ఆవాస్ యోజన (గ్రామీణ) పథకం కింద మహిళల గౌరవాన్ని గృహాల ఉమ్మడి యాజమాన్యంతో ఆర్థిక మంత్రి ముడిపెట్టారు. అయితే 2023-24లో ఈ పథకానికి కేటాయించిన బడ్జెట్‌ను పరిశీలిస్తే సవరించిన అంచనాలు బడ్జెట్ అంచనాలలో సగం మాత్రమే ఉన్నాయి. అంటే దీనర్థం ఈ పథకానికి పెట్టిన ఖర్చు చాలా తక్కువ.



అదే విధంగా హర్ ఘర్ జల్ పథకాన్ని తీసుకుంటే దానిని మహిళలకు అనుకూలమైనదిగా ప్రచారం చేశారు. కానీ 2022-23లో దీనికి పెట్టిన వాస్తవ ఖర్చు అంతకుముందు సంవత్సరంలో చేసిన వ్యయం కంటే 16% తక్కువ. 2024-25లో బడ్జెటరీ అంచనాలు మరింత తగ్గిపోయాయి. ఇక స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ)కు కేటాయించిన బడ్జెట్‌లో పెట్టిన వాస్తవ ఖర్చు 60-70% దాటలేదు. కేటాయింపులు మాత్రం ప్రతి సంవత్సరం ఘనంగానే ఉంటున్నాయి.

కేటాయింపుల్లో కోత...

మహిళల అభ్యున్నతికి అత్యవసరమైన పథకాలపై ప్రభుత్వ వ్యయం చాలా తక్కువగా ఉంటోంది. కేటాయింపుల్లో కోతలు విధిస్తున్నారు. పౌష్టికాహారం (ఆహార సబ్సిడీ, పీఎం పోషణ్), విద్య (స్కాలర్‌షిప్పులు), వితంతు పెన్షన్, గ్రామీణ ఉపాధి హామీ పథకం ఇందుకు కొన్ని ఉదాహరణలు. ఈ పథకాల నిర్వహణ భారాన్ని క్రమేపీ రాష్ట్రాలపై మోపుతున్నారు. కేంద్రం నుండి మాత్రం ఎలాంటి మద్దతు లభించడం లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే మహిళలకు మెరుగైన జీవన పరిస్థితులు కల్పించాల్సిన బాధ్యత నుండి కేంద్రం వైదొలుగుతోంది. పైగా మహిళలు తమంతట తామే సాధికారత సాధించాలని సుద్దులు చెబుతోంది.

మహిళల అభ్యున్నతికి కేటాయింపులేవి?

మరోవైపు మహిళలు ఎదుర్కొంటున్న వివక్ష, హింసను ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. మోడీ సర్కారు మధ్యంతర బడ్జెట్‌లో ఈ నిర్లక్ష్యం కన్పిస్తోంది. మోడీ ప్రభుత్వం రెండుసార్లు అధికారంలో ఉన్నప్పటికీ ఈ పదేండ్ల కాలంలో బడ్జెట్‌లో మహిళలకు కేటాయించింది 5-6% మాత్రమే. మహిళ, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు బడ్జెటరీ వ్యయంలో కేటాయించింది కేవలం 0.5% మాత్రమే. మహిళలపై హింస పెరిగిపోతుంటే బాధితులకు మద్దతు ఇవ్వడానికి మౌలిక సదుపాయాలలో పెట్టుబడులు పెట్టే విషయంలో ప్రభుత్వ చిత్తశుద్ధి ప్రశ్నార్థకంగా ఉంటోంది. మహిళల రక్షణ, సాధికారత కోసం ఉద్దేశించిన పథకాలన్నింటినీ కలిపి మిషన్ శక్తి పేరిట కార్యక్రమం చేపట్టినా మొత్తం బడ్జెటరీ వ్యయంలో దానికి కేటాయించిన నిధులు 0.1% కూడా లేకపోవడం శోచనీయం. నిర్భయ నిధిలో 70% మొత్తాన్ని ఖర్చు చేయలేదు. గృహ హింస, లైంగిక వేధింపుల నుండి మహిళలకు రక్షణ కల్పించే విషయంలో కూడా ప్రభుత్వం ఉదాసీనంగానే వ్యవహరిస్తోంది.

ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల నయా సరళీకరణ విధానాలు మత భావాల వ్యాప్తికి అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే మహిళా ఉద్యమ ప్రతిఘటనను బలహీనపరిచే ప్రయత్నాలు ఊపందుకుంటున్నాయి.



మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

- మంత్రి కోమటిరెడ్డికి పీఎంటీఏటీఎస్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పీఎంటీఏటీఎస్ డైరీ, క్యాలెండర్‌ను రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. మోడల్ స్కూళ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని మంత్రిని పీఎంటీఏటీఎస్ అధ్యక్షులు తరాల జగదీశ్ విజ్ఞప్తి చేశారు. బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని కోరారు. ఆరోగ్య కార్డులివ్వాలనీ, 010 పద్దు కింద వేతనాలివ్వాలని సూచించారు. మోడల్ స్కూళ్లలో మౌలిక సదుపాయాలను కల్పించాలనీ, అందుకోసం ప్రత్యేక నిధులను కేటాయించాలని తెలిపారు. ఈ సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఎంటీఏటీఎస్ కార్యవర్గ సభ్యులు సలీం, శ్రీనివాస్, అనిల్‌కుమార్, నాగేశ్వరరావు, స్వామి, సీతారామరాజు పాల్గొన్నారు.

జేఎన్టీయూహెచ్ రెక్టార్‌గా విజయ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూ) హైదరాబాద్ రెక్టార్‌గా మెకానికల్ ఇంజినీరింగ్ సీనియర్ ప్రొఫెసర్, జేఎన్టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ కె విజయ్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జేఎన్టీయూహెచ్ రిజిస్ట్రార్ కె వెంకటేశ్వరరారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జేఎన్టీయూహెచ్ 68 ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో విజయ్‌కుమార్‌రెడ్డిని రెక్టార్‌గా ఎంపిక చేస్తూ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఆయన ఏడాదిపాటు లేదంటే తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ రెండింటిలో ఏది ముందుగా వస్తే అప్పటి వరకు రెక్టార్‌గా కొనసాగుతారని పేర్కొన్నారు. రెక్టార్‌గా నియమించడంతో జేఎన్టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్‌గా రిలీవ్ చేశామని తెలిపారు. ఆయన ప్రస్తుతం ఎప్‌సెట్ కోకన్వీనర్‌గా కొనసాగుతున్నారు.

నేడు ధరణిపై మధ్యంతర నివేదిక?

అసెంబ్లీ సమావేశాల్లో చర్చించే అవకాశం

- బుధవారం మరో రెండు శాఖలతో సమీక్ష నిర్వహించిన కమిటీ • మరింత అధ్యయనం కోసం త్వరలో జిల్లాల పర్యటన



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ధరణి కమిటీ నేడు మధ్యంతర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించే అవకాశం ఉంది. నెల రోజులుగా ఆరు సార్లు సమావేశమైన కమిటీ వివిధ ప్రభుత్వ శాఖలు, రెవెన్యూ వర్గాలు, పోర్టల్ నిర్వహణ కంపెనీలు, భూ నిపుణులతో చర్చలు జరిపింది. ప్రాథమిక స్థాయిలో కమిటీ అధ్యయనం దాదాపు 90 శాతం పూర్తయింది. క్షేత్రస్థాయి నుంచి మొదలుకొని రాష్ట్రస్థాయి వరకు రెవెన్యూశాఖలో నెలకొన్న అనేక సమస్యలకు పరిష్కార మార్గాన్ని సూచిస్తూ మధ్యంతర నివేదిక సిద్ధం చేసింది. ధరణిలో ఉన్న 33 మాడ్యూల్స్‌ను రెండు కేటగిరిలుగా విభజించిన కమిటీ మధ్యంతర నివేదికలో సత్వరమే పరిష్కారమయ్యే సమస్యలను ప్రస్తావించారు. సర్వే నెంబరు మిస్సింగ్, ఎక్స్‌టెన్షన్ కరెక్షన్ చేయాలంటే ఆ ఫైలు సీసీఎల్ఏ వరకు వెళ్లాల్సి వస్తోంది. డిజిటల్ పాస్‌బుక్ మొదటి పేజీలో తప్పులు సరిచేయించుకోవాలంటే కలెక్టర్‌ను ఆశ్రయించాలి. ఇలాంటి చిన్న చిన్న పొరపాట్లను సరిచేయించుకునేందుకు యజమానులు నెలల తరబడి అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. వీటిని కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌కు ప్రాధాన్యత క్రమంలో బదలాయించాలని కమిటీ సూచించినట్టు తెలుస్తోంది. భూ సమస్యలపై మరింత లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ నేటి నుంచి శాసన సభా సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ధరణిపై చర్చ జరిగే అవకాశం ఉంది ఈ నేపథ్యంలో కమిటీ మధ్యంతర నివేదికను రూపొందించింది. సమస్యను మరింత లోతుగా అధ్యయన చేసేందుకు గానూ కమిటీ త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించనుంది. ఇందుకు సంబంధించిన టూర్ షెడ్యూల్ ఖరారు చేస్తున్నట్టు సమాచారం.

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖపై సమీక్ష

బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సమావేశమైన ధరణి కమిటీ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖతో సమీక్ష నిర్వహించింది. ప్రభుత్వ భూముల బదలాయింపులు, ఇతర సమస్యలు ధరణికి ముందు, తర్వాత ఎలా ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో మాన్యువల్ పద్ధతిలో ఉన్నప్పుడు ప్రభుత్వ భూములపై ఉన్న నిషేధం ఎలా అమలయ్యేది ఇప్పుడెలా అమలవుతోందని ఆరా తీశారు. అనంతరం తెలంగాణ స్టేట్ ఇండస్ట్రీస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్ (టీఎస్ఐఐసీ)తో కమిటీ చర్చించింది. రాష్ట్ర వ్యాప్తంగా సంస్థ పారిశ్రామిక వాడల కోసం కొనుగోలు చేసిన భూములెన్ని? అందులో ఎంత భూమిని పరిశ్రమలు పెట్టేందుకు కేటాయించారు? అడిగి తెలుసుకున్నారు. చాలా భూముల నాలా కన్వర్షన్ లేక పోవడం వల్ల రైతు బంధు పడుతున్నట్టు వస్తున్న ఆరోపణలపై అధికారులతో చర్చించారు.

ఆరు గ్యారంటీల అమలు కార్యాచరణ ప్రకటించాలి : రాణి రుద్రమ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఓటాన్ బడ్జెట్ సమావేశాల్లో ఆరు గ్యారంటీల అమలుకు కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. కృష్ణా జలాల పంపిణీపై సవాల్ చేస్తూ బడ్జెట్ సెషన్‌ను పక్కదారి పట్టించాలని సీఎం రేవంత్‌రెడ్డి చూస్తున్నారని ఆరోపించారు. జూరాల నుంచి నాగార్జున సాగర్ దాకా ఆన్‌గోయింగ్‌లో ఉన్న ఎస్ఎస్‌బీసీ, డిండి, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులను పూర్తి చేయడం కోసం ఎంత బడ్జెట్ కేటాయిస్తారు? ఎప్పటిలోగా పూర్తిచేస్తారు? అనే దానిపై యాక్షన్ ప్లాన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీకి ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయించాలని కోరారు. రైతు భరోసా కింద రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి రూ. 15 వేలు ఇస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. ఇప్పటి వరకూ పంట పెట్టుబడి సాయం అందించకపోవడం దుర్మార్గమన్నారు. పేదలకు వెంటనే రేషన్ కార్డులివ్వాలని కోరారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఎప్పటి వరకు ఇస్తారనే దానిపై స్పష్టతనివ్వాలన్నారు. యువ వికాసం కింద ప్రతి విద్యార్థికి రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, మండలానికో అంతర్జాతీయ పాఠశాల ఏర్పాటు, జాబ్ క్యాలెండర్, రూ.4 వేల పింఛన్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

తమపై కేసు కొట్టేయండి

హైకోర్టులో గండ్ర వెంకటరమణారెడ్డి పిటిషన్ దాఖలు

నవతెలంగాణ -హైదరాబాద్

భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో గత నెల 16న నమోదైన కేసును కొట్టేయాలంటూ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, గండ్ర గౌతమ్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పోలీసుల కేసు విచారణపై స్టే ఇవ్వాలనీ, భూపాలపల్లిలోని పుల్లూరి రామయ్యపల్లి శివారు చెరువు శిఖంలో అక్రమ నిర్మాణం చేపట్టారని నాగవెల్లి రాజలింగమూర్తి ఫిర్యాదు మేరకు కోర్టు ఆదేశాలతో పోలీసులు ఎఫ్ఐఆర్ చేశారు. ఈ కేసును కొట్టేయాలని గండ్ర దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారించనున్నది.

నలుగురికి లక్ష రూపాయల జరిమానా

సివిల్ కోర్టులో దావా వేసిన విషయాన్ని చెప్పకుండా హైకోర్టులో పిటిషన్ వేసి స్టేటస్‌కో (యథాతథస్థితి) ఉత్తర్వులు పొందిన నలుగురికి హైకోర్టు లక్ష రూపాయల జరిమానా విధించింది. జరిమానా సొమ్మును హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీకి చెల్లించాలంది. అంబర్‌పేటలోని సర్వే నెం 57లో 2432 చదరపు గజాల తమ స్థలంలో టీఎస్పీడీసీఎల్ జోక్యం చేసుకుని, ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తోందంటూ ఆర్ మల్లేష్, మరో ముగ్గురు తప్పుడు పిటిషన్ వేశారని ఇటీవల హైకోర్టు తేల్చింది.

ప్రపంచ గమనం

అమెరికా ఉక్రెయిన్ విధానంతో కుదేలైన ఐరోపా దేశాలు



రష్యాకు, ఉక్రెయిన్‌కు మధ్య జరుగుతున్న యుద్ధంపై అమెరికా అనుసరిస్తున్న విధానం ఐరోపాను కుంగదీసిందని హంగరీ అధ్యక్షుడి ప్రధాన సలహాదారు అన్నారు. కూటములు కట్టే విధానం వర్తమాన పరిస్థితికి పరిష్కారం కాదని బలజ్ ఓర్బాన్ తన నూతన గ్రంథావిష్కరణ సందర్భంగా తెలిపాడు. నాటోలోనూ, యూరోపియన్ యూనియన్‌లోనూ సభ్య దేశంగావున్న హంగరీకి ఇది ప్రమాదకరంగా పరిణమించిందని, హంగరి అభివృద్ధి చెందటానికిగల అనేక అవకాశాలను అందుబాటులో లేకుండా చేసిందని ఆయన వివరించారు. కూటములు కట్టటం అమెరికాకు కూడా ఉపయోగపడదని, అది ప్రపంచంలో మార్పును వేగవంతం చేస్తుందని కూడా అన్నారు. 2022లో మాస్కోపైన ఆంక్షలు విధించటంలోనూ ఉక్రెయిన్‌కు ఆయుధాలను సరఫరా చేయటంలోనూ రష్యా నుంచి దిగుమతయ్యే ఇంధనాన్ని తిరస్కరించటంలోనూ అమెరికాతో యూరోపియన్ చేరింది. తత్ఫలితంగా 2023లో నాటో కూటమి దేశాల ఆర్థిక వ్యవస్థలు మాంద్యంలోకి జారుకునే స్థితికి చేరాయి. వర్తమానంలోని పారిశ్రామిక విప్లవాలు సాంకేతిక పరిజ్ఞానంపై ఆధాపడి వుంటాయి. అందుకోసం ముడి సరుకులు కావాలి. అవి ఐరోపాలో లభ్యంకావు. అది ఐరోపా ఖండం బలహీనతగా బయటపడుతుందని ఆయన హెచ్చరించాడు. మరోవైపు అమెరికా నాయకత్వంలో ఐరోపా విధించిన ఆంక్షలతో రష్యా పతనం కాలేదు. ఆ దేశం తన ఆర్థిక వ్యవస్థ దిశను మార్చి చైనాతో తన సంబంధాలను బలోపేతం చేసిందని ఓర్బాన్ చెప్పాడు. యూరోపియన్ యూనియన్, బాల్కన్ దేశాలకు ముఖద్వారంగావున్న హంగరి రానున్న రోజుల్లో తన ఆర్థిక వ్యవస్థను విజయవంతంగా నడపటానికి తన సార్వభౌమత్వాన్ని బలోపేతం చేసుకోవలసివుంటుందని కూడా ఓర్బాన్ చెప్పాడు. 2022 ఫిబ్రవరిలో ప్రారంభమైన రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో హంగరి తటస్థ వైఖరిని తీసుకుంది. హంగరి రష్యా సైనిక చర్యను ఖండించినప్పటికీ ఉక్రెయిన్‌కు ఆయుధాలను సరఫరా చేయటానికి నిరాకరించింది. అంతేకాకుండా దౌత్యనీతితో మాత్రమే ఉక్రెయిన్ సమస్య పరిష్కారం అవుతుందని హంగరీ ప్రకటించింది.

రాజధానిపై దాడి కేసులో ట్రంప్‌నకు చట్టపరమైన రక్షణ ఉండదు

- అమెరికా కోర్టు



అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌పై 2020 అధ్యక్ష ఎన్నికను మార్చటానికి ప్రయత్నిం చాడనే ఆరోపణకు సంబంధించి ఆయనకు అధ్యక్షుడికి లభించే ఎటువంటి చట్టపరమైన రక్షణ ఉండదని డిస్ట్రిక్ట్ ఆఫ్ కొలంబియాలోని ఫెడరల్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్ మంగళవారం ఒక రూలింగ్ ఇచ్చింది. ఈ కేసును స్పెషల్ కౌన్సిల్ జాక్ స్మిత్ తీసుకుని వచ్చాడు. ట్రంప్‌పై ఎన్నికల ఫలితాన్ని తారుమారు చేయటానికి ప్రయత్నించాడనే ఆరోపణకు సంబం ధించి నాలుగు నేరాలను స్మిత్ మోపాడు. వీటిలో అమెరికాను మోసం చేయటం, అధికార ప్రకటనను ఆపటానికి 2021 జనవరి 6వ తేదీనాడు అమెరికా రాజధానిపై హింసాత్మకంగా అల్లర్లు చేయించటం ఉన్నాయి.అమెరికా 45వ అధ్యక్షుడైన ట్రంప్ తాను ఎటువంటి నేరం చేయలేదని, మోపబడిన అభియోగాలు జరిగిన కాలంలో తాను అధ్యక్షుడిగా కొనసాగుతున్నందున తనకు అధ్యక్షుడికివుండే నేర విచారణ నుంచి రక్షణ ఉంటుందని వాదించాడు. అయితే ఈ నేరానికి సంబంధించి మాజీ అధ్యక్షుడు ట్రంప్ ఒక సాధారణ పౌరుడిగా మాత్రమే ఉంటాడని, ఆయనకు ఒక నేరస్థుడికి ఉండే రక్షణలు మాత్రమే ఉంటాయని ముగ్గురు జడ్జీల ప్యానల్ రూలింగ్ ఇచ్చింది. ఆయన అధక్షుడిగా వున్నప్పుడు కార్యనిర్వాహక రక్షణలు ఉండి వుంటాయని, ప్రస్తుత విచారణలో ఆయనకు ఎటువంటి రక్షణలు ఉండవని ప్యానల్ పేర్కొంది. ప్యానల్‌లోని ఇద్దరు న్యాయమూర్తులు జె. మిచెల్ చైల్డ్స్, ఫ్లోరెన్స్ పాన్‌లను డెమొక్రాటిక్ పార్టీకి చెందిన ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ నియమించాడు. మూడవ న్యాయమూర్తి కారెన్ లి క్రాఫ్ట్ హెండర్‌సన్ ను జార్జి డబ్ల్యు బుష్ నియమించాడు.

ఒక అధ్యక్షుడిని తాను అధికారంలో వున్నప్పుడు తీసుకున్న అధికారిక చర్యలపై విచారించటం రాజ్యాంగాన్ని ఉల్లంఘించటమౌతుందని, అది అమెరికా ప్రజాస్వామ్యానికి పునాదివంటిదని కోర్టు రూలింగ్ వెలువడిన తరువాత ట్రంప్ ప్రచార ప్రతినిధి స్టీవెన్ చెవుంగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. డీసీ సర్క్యూట్ కోర్టు నిర్ణయంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సవినయంగా విభేదిస్తున్నాడని, అధ్యక్షత్వాన్ని, రాజ్యాంగాన్ని రక్షించటం కోసం పైకోర్టుకు అప్పీల్ చేస్తాడని ఆయన ప్రకటించాడు. ఈ రూలింగ్‌ను ఫుల్ డీసీ సర్క్యూట్‌కు గానీ, నేరుగా సుప్రీంకోర్టుకు గానీ ట్రంప్ అప్పీల్‌కు వెళ్ళొచ్చు. 2020లో అమెరికాలోని అనేక రాష్ట్రాలు కోవిడ్-19 మహమ్మారి కారణంగా మెయిల్ ద్వారా ఓటు వేయటానికి ఎన్నికల నిబంధనలను మార్చాయి. అంతిమంగా అమెరికా చరిత్రలోనే అత్యధికంగా బైడెన్ 8 కోట్ల ఓట్లతో ట్రంప్‌ను ఓడించాడు. ఈ ఎన్నికలో రిగ్గింగ్ జరగటమే కాకుండా అనేక అవకతవకలు జరిగాయని ట్రంప్ ఆరోపించాడు. ఈ ఆరోపణను డెమోక్రాట్లు, అమెరికా మీడియా తిరస్కరించటం జరిగింది.

ప్రతి రూపాయికీ లెక్క పక్కాగుండాలి

నిధులను పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఖర్చుపెట్టాలి

- ప్రజల భాగస్వామ్యంతో పచ్చదనం పెంపు ప్రక్రియ నిరంతరం కొనసాగాలి : హరితనిధిపై సమీక్షలో అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హరిత నిధికి జమయ్యే ప్రతి రూపాయికీ లెక్కా పక్కాగుండాలనీ, ఆ డబ్బులను పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఖర్చుపెట్టాలని అధికారులకు అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో పచ్చదనం పెంపు ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో హరితనిధి విరాళాలు, వ్యయంపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఇప్పటి దాకా ఈ పథకంలో వచ్చిన విరాళాలు, ఖర్చు వివరాలను అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్, హెచ్ఓఎఫ్ఎఫ్) ఆర్.ఎం. డోబ్రియల్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. 2021 లో మొదలైన హరితనిధి ద్వారా ఇప్పటి దాకా 69.21 కోట్ల రూపాయలు జమయ్యాయని వెల్లడించారు. అందులో రూ.43 కోట్ల మేరకు పనులు మంజూరయ్యాయనీ, రూ.29. 39 కోట్లు విడుదల కాగా, 18.72 కోట్ల రూపాయల పనులు పూర్తయ్యాయని తెలిపారు. జిల్లాకు ఒకటి చొప్పున సెంట్రల్ నర్సరీల ఏర్పాటు, ఎవెన్యూ ప్లాంటేషన్



కోసం పెద్ద మొక్కల పెంపకం, అర్బన్ ఫారెస్ట్ పార్కుల్లో మిగిలిన పనులు, దశాబ్ది సంపద వనాల పేరుతో సాగునీటి శాఖ పరిధిలో ఉన్న మిగులు భూముల్లో వనాల పెంపకం వంటి పనులు హరితనిధి ద్వారా వచ్చిన నిధులతో జరుగుతున్నదని వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..హరితనిధి కేటాయింపులు, ఖర్చుకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. వివిధ జిల్లాల్లో ఏర్పాటైన నర్సరీలు, జరుగుతున్న పనుల నాణ్యతను పరిశీలించి తనకు నివేదిక ఇవ్వాలని అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీ ప్రసాద్‌కు సూచించారు. పూర్తయిన పనుల ఆడిట్ నివేదికలను కూడా పరిశీలించాలని తెలిపారు. మంజూరై, పనులు మొదలు పెట్టని జిల్లాలను నుంచి నిధులను వెంటనే వెనక్కి తీసుకుని, తాజా పనులకు కేటాయించాలని అన్నారు. తెలంగాణ నేల స్వభావానికి అనువైన చింత, వేప, రేల లాంటి చెట్లను రహదారుల వెంట నాటేందుకు ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు. సమీక్షా సమావేశంలో పీసీసీఎఫ్ (హరితహారం) సువర్ణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో సమ్మక్కసారలమ్మకు నిలువెత్తు బంగారం సమర్పణ

- ప్రసాదం బుక్ చేసుకుంటే పోస్టల్ శాఖ ద్వారా పంపిణీ : మంత్రి కొండా

సమ్మక్క-సారలమ్మ జాతరకు నేరుగా వెళ్లలేని వారు ఆన్‌లైన్‌లో కూడా వనదేవతలకు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించుకునే అవకాశాన్ని కల్పించామని దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. జాతరకు వెళ్ళలేని భక్తులు తమ నిలువెత్తు బంగారాన్ని అమ్మవారి గద్దెల వద్ద సమర్పించేందుకు వీలుగా సేవలను బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలోని తన కార్యాలయంలో ఆమె ప్రారంభించారు. తన మనవడు కొండా మురళీకృష్ణ పేరును మీ సేవ వెబ్‌సైట్‌లో నమోదు చేసి, బరువు ప్రకారం డబ్బులు చెల్లించి అమ్మవారి గద్దెల వద్ద నిలువెత్తు బంగారాన్ని సమర్పించే సౌకర్యాన్ని పొందారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..వివిధ కారణాలతో సమ్మక్క సారాలమ్మలను దర్శించుకోలేని భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఐటీ శాఖ సహకారంతో దేవాదాయ శాఖ అమలు చేస్తున్న ఈ సేవలు మీ సేవ (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్), టీయాప్ ఫోలియో(ఆన్‌లైన్), తపాల శాఖ (ఆఫ్‌లైన్) ద్వారా ఎవరి పేరు మీదైతే బంగారం సమర్పించాలనుకుంటున్నారో వారి బరువును అనుసరించి డబ్బులు చెల్లించి ఈ సేవలను పొందవచ్చునని తెలిపారు. రాష్ట్రంలోని దాదాపు 5 వేల మీ సేవా సెంటర్లు, దేశంలోని దాదాపు 1.5 లక్షల పోస్టల్ కేంద్రాలు (తెలంగాణలో 6 వేల కేంద్రాలు) ఈ సేవలను అందిస్తాయన్నారు. దేవాదాయ శాఖ సంవత్సరం పొడవునా బంగారం సమర్పణ సేవలను అందిస్తుందని తెలిపారు. ప్రసాదం కావాలనుకునే వారు వాటి ద్వారా డబ్బులు చెల్లించినట్లైతే, తపాలా శాఖ ద్వారా ప్రసాదాన్ని ఇంటికి పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, దేవాదాయ, తపాలా, మీసేవ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.